The Chintamani

A MONTHLY TELUGU MAGAZINE

EDITED BY N. SUBBARAU B. A. & B. L.

Vol.4.] RAJAHMUNDRY: SEPTEMBER, 1894. [No.3.

CONTENTS.

RAJAHMUNDRY:

Printed for the Proprietor at the Vivekavardhani Press.

విషయసూచిక.

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

[సంపుటము ౮. | రాజమహేంద్రవరము. జయసంవత్సర భాద్రపదమాసము. | [సంచిక. 3.

కృతివిమర్శనము.

"చిలాన్‌బంది"

గోదావరీమండల న్యాయస్థానమున న్యాయవాదియు, కాళికావిలాసాది గ్రంథ నానైపుణుండునునగు శ్రీ క్రొష్టు జగన్నాథశాస్త్రి ప్రణీతంబైన 'చిలాన్‌బంది' పద్యకావ్యము మా కార్యస్థానమునకుఁ బంపఁబడినది. ఆంగ్లేయకవులలో మిగులఁ బ్రఖ్యాతిగాంచిన, 'బైరను' కవి విరచితమైన 'ప్రిజనర్ ఆఫ్ షిలాన్' అను పద్యకావ్యమునకు నేతద్గ్రంథ మాంధ్రీకరణము. హూణభాషాకావ్యము నాంధ్రీకరించుట మిక్కిలి కష్టతరమైనపని యని మేము నొక్కి వక్కాణింప నక్కరలేదు. ఆయంశ ముభయభాషా పరిజ్ఞాతలకు దెల్లంబు. అయినను శాస్త్రులవారు వారి శక్తిసామర్థ్యముల ననుసరించి చక్కగానే వ్రాసియున్నారు. శైలి మృదువై సులభగ్రాహ్యమైయున్నది. హూణులకును ఆంధ్రులకును అభిప్రాయభేదము మెండుగావున హూణకవీంద్రుల యభిప్రాయములను తద్భాషాపరిచితేతరులకు దెలుపునట్లు మార్చుట సులభసాధ్యము కాకపోయినను గ్రంథకర్తగారు చేసిన భాషాంతరీకరణము కొంతవరకు తృప్తికరముగానే యున్నదనుట కెంతమాత్రమును సందియముండకూడదు. గ్రంథకర్తగారి భాషాంతరీకరణశక్తి నుదాహరించుటకై మూలగ్రంథమునందు రసవంతములని వాడఁబడు పద్యములకు సరియైన శాస్త్రులవారి పద్యముల గొన్నిటి నీక్రింద బొందుపరుచుచున్నాము.

గీ. గరుడపోతంబు స్వేచ్ఛమై తిరుగునాడు
పొడుచురవిగాంచి యాహ్లాదమును వహించు
కరణి నేమును స్వేచ్ఛమై గ్రాలునాడు
పవలు గనుగొన్న రమ్యమై పరగె నాకు.

క. ఆపవలునవలెనె రమ్యం । బై తరగెనునాడు చిన్నియనుజుం డరయ
న్నా పవలవసానముఁ గన । నోపదు వేసంగియంత యుడిగినదనుకన్.

క. భువివగతిరవిక్రుంకడు వే । సవియంతము నంనుపరకు శ్రాంతింపని దీ ।
ర్ఘువికాసపు వేసవియగు । ధవళహిమాంబగ దినేశతను జాతంబై.

గీ. అనిలవేగోపహతి నిర్మలాంబరమున । హిమతుసారంబు చలివేళ నెగసియాడ
గలుగుగొనగొన రొదరేపవలుచెలంగి । తలలపై మ్రోగనెదలేనియులివువింటి.

గీ. అకట! దైవమ! ఘోరంపుటడలుదాడర । కున్నజీవాత్మ పక్షములొనరవాల్చి
యెట్టి యాకృతినెగతినేనిబొంది । చూచుచుండంగ నెగరిపోఁజోద్యముగను.

సీ. ఒంటరినేనుంటి మింటిపైగనుపించు విడియొంటి మేఘంబు విధముదోప
రవిప్రకాశింపంగ దివియెల్ల నిర్మలమై చెలంగఁగ నొక్కయంబువాహ
మటదోపనారయ నాకాశదేవత మొగముచిట్లించు కన్బొమలనోడ్పు
గా నెంతుగాదొ! యాకాశంబునీలమై విలసిల్లి నవనిహర్షప్తిబొదల
కార్యమేమియు లేకుండ కారుమబ్బు । విడిదియొక్కటి యచ్చట వెలయుట
తెలుకంతయున్నైనను గానరాదు । కొంతతరి యిటుచన నాకవింతగలి

ఈ గ్రంథము వలయువారు గ్రంథకర్తగారి తావుకు వ్రాసి తెప్పించుకొనవచ్చును.
వెల ఆఱు అణాలు. A. S.

ఛాయాపుత్రశతకము.

మచ్చ వేంకటకవికృతమయిన పయిగ్రంథము మా కార్యస్థానముఁ జేరినది. శనైశ్చరుని వివిధవిశేషములచేత సంబోధించు మొదటి ముప్పదిరెండు పద్యములకును రాగమాలిక యను పేరిడఁబడెను. తరువాత డెబ్బదినాలుగు డెబ్బదియయిదు పద్యములచేత శనిస్తోత్రము చేయఁబడినది. కందపద్యములకు చతుర్థపాద విశ్రమస్థానమైన చోటనే "ఛాయాపుత్రా" యను నంకితమునందలి భవర్గము నిలిపి పద్యములన్నిటి చతుర్థపాదాదియందును దానితోడి పవర్గమును సుకరముగా పొందుపఱుచుటచే కవి ప్రౌఢిమము వెల్లడియగుచున్నది. కవిత్వ మంత్యనియమములతోను, అను ప్రాసములతోను నిండియుండి వినువారి కాహ్లాదము గలిగించుచున్నది. ఈశతకమునుండి రెండు పద్యముల నిందుదాహరించుచున్నాము—

"కుందమ్ములు దంతమ్ములు । మందమ్ములు గతులురక్తి మందమ్ములు గే
లందమ్ములు గందమ్ముల । చందమ్ములు నీనునెఱులు ఛాయాపుత్రా.

"శనియని బుధులను వనికా । మనియని గ్రహలోక మధ్యమణియని కరుణా
ఖనియని పాతకశైలా । శనియని నిన్నెన్నవలయు ఛాయాపుత్రా.

P. V. G.

శ్రీ కుమారాభ్యుదయము :— వావిలి కొలను సుబ్బరాయకవి ప్రణీతము: ఆర్ష్ఫ్రియన్ ముద్రాక్షరశాల. వెల రూపాయి.

కడప నివాసులయిన వావిలి కొలను సుబ్బరాయకవిగారిచే విరచింపఁబడిన పై గ్రంథము మా కార్యస్థానముఁ జేర దానింజదివి సంతసించితిమి. ఈ గ్రంథము జనసామాన్యమునకు సుబోధ్యముగాని కఠినశైలిని వ్రాయఁబడి, శబ్దాలంకార గర్భితమై కవి ప్రాగల్భ్యమును సూచించుచున్నది.

ఈ గ్రంథము మూడాశ్వాసములుగలది. ప్రథమాశ్వాసమందు నన్నూటపది నాకండును ద్వితీయాశ్వాసమందు మున్నూట యఱువది రెండును తృతీయాశ్వాసమందు నూటయేఁబదియేడును పద్యములుగలవు. వీనియందుఁ గొలది సంఖ్య వచనములున్నవి.

శివతపోభంగమునుగూర్చి యప్సరసలు భయపడఁగా మన్మథుఁడు వెళ్లి శివుని కంటిమంటపాలగుటయు, రతీవిరహవర్ణనమును ప్రథమాశ్వాసమునఁదలిముఖ్యవిషయము. రుక్మిణీకల్యాణము ద్వితీయాశ్వాసమునందలి ముఖ్యవిషయము. రుక్మిణికిఁ బ్రద్యుమ్నుఁడు పుట్టుటయు, ఆశిశువును శంబరుఁడు సముద్రమునవైవఁగా నొక మత్స్యముచే మ్రింగఁబడితుదకాశిశువు రతీదేవిచేతికి వచ్చుటయు, ఆమె పెంచుటయు, ప్రద్యుమ్నుఁడు వయసువచ్చినపిమ్మట తనవృత్తాంతము రతివలన నెఱిఁగినవాఁడయి శంబరుని సంహరించి భార్యయైన రతీదేవితో రుక్మిణీ కృష్ణులయొద్ది కేగుటయు తృతీయాశ్వాసమందలి విషయము.

కథ విస్తారము లేకున్నను తొమ్మిదివందల కెక్కువగాఁ బద్యములు రచించుట వలన నీకవీశ్వరుని కల్పనావైశద్యము తేటపడుచున్నది.

ఈ గ్రంథముయొక్క ప్రథమాశ్వాసమందలి,

మ. అవమానంబు సహించి నిశ్చలతఁ దద్ధ్యానంబునే చేయుచుం
బవలు న్రేయును గూర్కు నాకలి దగ న్వారించి శీతోష్ణ సం
భవఖేదంబున కోర్చి జాములుగ నిల్వం జేసితే నైననూ
యవురా సేవకవృత్తి యోగిగతిఁ జేయం జాలితే యన్నిటన్. 19.

ఉ. కోపము రాదుగా పలువకూఁతలు కూసిన వించు నుండినం
దాపము తోఁచ దాతపమునం జరియింపుచు నెంత యుండిన
న్లేపనభూషలుం బడయలేదు మనం బిఁక నేమి చెప్పఁగా
నోపిక లెచ్చెఁ గా శ్రమను యోగికి మాకు నిఁ కేమి భేదమో. 20.

చ. క్రియలను మాకు యోగికిని గీసయు భేదము లేదదెట్లన
న్భయమున మేము భుక్తికయి భక్తిని యోగియు ముక్తిపొందె బ

బ్రియమునఁ గష్టము ల్వడుచు బ్రాలును పూర గురూపమానులౌ
భయదులు దుష్ప్రభు ల్జగతి వంద్యులు కారొకొ సేవకాళికిన్. 21.

ఈ పద్యములను జదివితిమేని భర్తృహరి సుభాషిత రత్నావళి వైరాగ్యశతకములోని—

పలువలు పల్కు మాట లొకభంగి సహించి బొప్పవారి లో
పల నెహరించి శూన్యమగు భావమునన్ వెడనవ్వు నవ్వితిం
బొలుపరి విత్తజాడ్య హతబుద్ధుల కంజలి చేసితింగటా!
తలఁకక నన్ను నేమిటికిఁ దార్చెదవోసి దురాశ నీవిఁకన్.
క్షమ చేఁగా దవమాన మోర్చుట మహాసంతుష్టి చేఁగాదు గే
హము నందైన సుఖంబుమానుట తపోవ్యాసక్తి చేఁగాదు దు
ర్దమ శీతోష్ణజయంబు కాదు హరుపై ధ్యానంబు విత్తంబుపై
నమరెన్ మాకు మునీంద్ర కృత్యములు లేవా సత్ఫలాభ్యున్నటుల్.

అను పద్యములయందీ కవికుండు నభిమానము తేటపడుచున్నది.

ఈకవి చిత్రబంధగర్భ కవిత్వములందు సునిశితశక్తియుక్తుఁడనుటకు, ప్రథమాశ్వాసమందలి 405 - 409 వ పద్యములును, తృతీయాశ్వాసమందలి 128 మొదలుకొని 138 దనుక గల పద్యములును నిదర్శకములుగానున్నవి.

ఈయనకు నానార్థ నిఘంటువులందును, ఏకాక్షర నిఘంటువులందును, అసమాన సామర్థ్యమున్నందుకు ఈ క్రింది పద్యములు దృష్టాంతములుగా నున్నవి.

ప్రథమాశ్వాసము.

సీ. సారంగ గుణసంగ సారంగసువిహంగ సారంగతులితదోస్సారఘనుఁడు
సారంగ శుకహయ సారంగహయరథ సారంగ సారమ సారతనుఁడు
సారంగ సరబల సారంగసారంగ సారంగనయనాసు శర్మనుండు
సారంగసంభవ సారంగలక్షణ సారంగసహజవిస్తారయశుఁడు
తే. భూరిసారంగ ముదిత త్రిభువనసార । శారసారంగలోచనాపూరుషుండు
రంగుమీఱంగ వేగ సారంగధరుని। వ్రతముఁ జెఱుపంగఁ జాలు సారంగశరుఁడు.
సీ. మణికుండలోల్లసన్మణికుండలాంచితు మణికుండలాదివైమానికవృతు
సర్వతోముఖవంద్య సర్వతోముఖకేశు సర్వతోముఖునిఁ బ్రశస్తగుణుని
ఘను విరోచనవిరోచనవిరోచననేత్రు వరవిరోచనపిత్రు ప్రణుతమహిము
జిను సనాతను సనాతను సనాతనపౌత్రు హరు సనాతనశిరోహరుని శివునిఁ
తే. దారక శతార హరి తార సారహీర। హార ఘనసార మందార గౌరధీర
సారసపటీర ఖర్జూరశారదా వ। దాతరుచి రుద్రుఁ గాంచె నభీతమతిని. 307.

శ్రీ విజయనగరము వారి కుటుంబము.

ఆంగ్లేయ, హిందూదేశములందు ఘనతకెక్కిన శ్రీ విజయనగరము మహారాజు గారి కుటుంబమునుగూర్చి తెలియనివారెవ్వరును లేరు. లేటు శ్రీ మహారాజు గారి దాన శీలత, దేశక్షేమాభిలాష, ప్రజానురాగము, పరిపాలనాసామర్థ్యత మొదలగు సుగుణాతిశయములచే వారి జమీ మూడు రాజధానులలోని జమీలన్నిటికంటె మిగుల వాసిగాంచి ప్రసిద్ధినొందెను. లేటు మహారాజుగారగు ఘనతకెక్కిన మహారాజా మీర్జా శ్రీ విజయరామ గజపతిరాజ్ మన్యసుల్తాన్ బహదర్ కె - సీ - యస్ - ఐ - గారు దేశమునకును, దేశస్థులకును చేసిన మేలు ఎన్నటికిని మరపునకు రానేరదు. దొరతనము వారి యెడల కృతజ్ఞులయి యుండుటయేకాక వారుచేసిన ఘనమైన కార్యములనుబట్టి పశ్చిమఖండ వాసులకుంగూడ వీరియందనురాగ మధికమై వీరియందు మిగుల గౌరవము గలవారై యుండిరి.

ప్రసిద్ధిగాంచిన యీ కుటుంబపు చరిత్రలనుబట్టి విచారించగా, రాజపుత్రస్థానములను జేరిన ఉదయపురము అనే మేవారు మహారాజాగారి సోదరులగు విజయభూపతి ప్రభువుగారు అయోధ్యకుంబోయి అచ్చట కొన్ని దేశములను జయించెను. అట్టిసాహస ధైర్యములతోనే విజయభూపతిగారి సంతతివారగు మాధవవర్మగారుఆన 519 సంవత్సరమునందు దక్కను దేశముపై దండెత్తి రామనాథపురం కటకమునకు మధ్యదేశమును జయించిరి. ఆదేశమును వారి సంతతివారు 921 సంవత్సరములు పరిపాలించిరి.

అటుపిమ్మట ప్రసిద్ధిగాంచిన వారిలో ముఖ్యులగు చిన్నతమ్మిరాజుగారనే రఘునాథరాజుగారి కిప్పటి మహారాజుగారు తొమ్మిదవ పురుషులు. ఆయన గోలకొండ కుటూబ్‌షావంశములో నయిదవ ప్రభువైన అబ్దుల్లాగారియొద్ద ౧౬౫౨ వ సంవత్సరమునందు ఉత్తరసర్కారులో సుబేదారుగానుండి 'బడషాహి జాగీరుల' క్రింద కూమిలీ భోగాపురం పరగణాలు బహుమతినందిరి. అవి నేటివరకును విజయనగరం మహారాజుగారి క్రిందనే జరుగుచున్నవి. అవురంగజేబ్ చక్రవర్తిగారి కాలములో తమ్మిరాజుగారికి 'సుబేదార్' అనుబిరుదును. జల్‌ఫికర్ అను కత్తియుబహుమతిగా నియ్యబడినవి. అదిమొదలు నేటికరకును ఆకత్తివారికుటుంబమువారిచేత వాడబడుచున్నది. తమ్మిరాజుగారి యనంతరము వారి కుమాళ్లు సీతారాములుగారు రాజ్యమునువహించి తలరాష్ణనిమునకు నాలు పరగణాలను నూతనముగా సంపాదించికళింగ దేశాధీశ్వరుని రాజధానియగు పోత్నూరును జయించి కళింగ మహారాజను బిరుదాంకమునుగూడ నొందెను. ఈయన దొరతనమువారికి మిగుల వినయ విధేయులై యుండిరి. వీరియనంతరము

పిరికుమాళ్లు ఆనందరాజుగారు సింహాసనాసీనులయిరి. ఆయనకు సీతారామరాజుగారు, విజయరామరాజుగారని యిద్దఱు పుత్రులు.

విజయరామరాజుగారి శౌర్యస్థైర్యములు మిగుల శ్లాఘాపాత్రములు. శ్రీకాకుళపు నబాబుగారగు జాఫరల్లీఖాన్ సాహేబుగారిపై దండువెడలివారినిజయించి వారిచిహ్నములగు 'మాహీ,మరతెబ్బు', ఫుంజ అను వానిని దీసుకొనిరి. ఇంతియకాక తమదేశమును విశేషముగా వృద్ధిపరచి, దేశక్షేమాభివృద్ధికై వీరుచేసిన కార్యములనుబట్టియు, వీరి పరిపాలనా సామర్థ్యతనుబట్టియు, చక్రవర్తిగారు వీరికి 'మన్యసుల్తాన్' (అనగా కొండదేశములకు ప్రభువు) అను బిరుదునొసగెను. విజయరామరాజుగారు విజయనగరము వాసస్థానముగా నేర్పరచుకొని అచ్చట 1712 వ సంవత్సరమున గట్టబడి నేటివరకును నిలచియున్న కోటను పూర్తిపరచి విశేషముగా వృద్ధిజేసెను.

ఆనందరాజుగారు ఆంగ్లేయ దొరతనమువారికి మిక్కిలి స్నేహితులు. ఉత్తర సర్కారులలోని ఫ్రెంచివారిని పారదోలి తరువాత కొద్దికాలమునకే రాజమహేంద్రవరములో స్ఫోటకమువలన మృతినొందిరి. తిరిగి ప్రభుత్వమునకు దగినవారి నేర్పరచు బాధ్యత రాణిగారి పైబడినందున, తమ భర్తగారి పితృవ్యపుత్రుని రెండవకుమారుడగు విజయరామరాజుగారిని సంస్థానాధిపతిగా నేర్పరచెను. ఈ యేర్పాటున కప్పటి నిజాముగారు కూడ సమ్మతించి 1760 వ సంవత్సరము ఏప్రిల్ నెలలో చక్రవర్తిగారిఫరమానా ననుసరించి రాజుగారికి మీర్జా అను బిరుదాంకము నొసగిరి. మొగలాయి దొరతనమువారికి చెల్లించవలసిన పేష్కషు రు 2,90,059—4—0 లుగా నేర్పరుపబడినది. కాని అనేకపర్యాయములు సొమ్ము దొరతనమువారు వసూలుచేయకుండా మానివేయుచుండిరి. ఆనందరాజు (I) గారి జ్యేష్ఠపుత్రులగు శీతారామరాజుగారు విశేషముగా జేయుచువచ్చిన దండయాత్రలచే గుటుంబగౌరవ స్వాతంత్ర్యములు హెచ్చయ్యెను.

ఆకాలములోని క్రిందిజమీలు విజయనగరపువారిలోనయియుండెను. 1 జయపురము, 2 శృంగవరపుకోట, 3 మాడుగుళ, 4 సాలూరు, 5 కోటపాలెము, 6 కురపాం, 7 అనకాపల్లి, సత్యవరం, 8 గోలకొండ, 9 పాలకొండ, 10 ఆంధ్ర, 11 రేగులవలస, 12 పోరం, 13 తేడా లేక పాచిపెంట, 14 సంగంవలస, 15 చెముడు, 16 రాజాం, 17 నరవ.

1765 వ సంవత్సరమునందుత్తరసర్కారులను హూణులు స్వాధీనము చేసికొనినదిమొదలు విజయనగరపు మహారాజులను "జమీన్దారు"లని అప్పుడప్పుడు వాడుచువచ్చిరి. ఈయూహ్యనకు కారణము దొరతనమువారికి పేష్కషు చెల్లించుచు

వచ్చినందున నేయని మా యభిప్రాయము. అయినను నిజాముగారివలనను, దొరతనము వారివలననుకూడ మిక్కిలి ఘనత కెక్కిన ప్రభువులుగా సన్మానింపబడుచు స్వతంత్రాధికారమును చేయుచు, దొరతనమువారివలన గౌరవసూచితార్థము 19 పిరంగులు కాల్పించుకొనుట కధికారమునుగూడ పొందిరి. విజయనగరపు మహారాజుగారికి ఉత్తరసర్కారులలో పైన చెప్పబడిన 17 గురు జమీందారులు కప్పములగట్టుచు వారి యధికారమునకు లోబడియుండిరి.

ఆ 1778 సంవత్సరమునందు సర్ థామస్ రంబాల్డుదొరవారు చెన్నపట్టణమునకు గవర్నరుగా నియమింపబడినప్పుడు, తమకు చెల్లించవలసిన ఘోషక్కు మొత్తమును స్థిరపరుచుకొనుటకు రాజా విజయరామరాజు గారిని చెన్నపట్టణమునకు రప్పించిరి. మదరాసు సైన్యములోనివారగు కర్నల్ జాన్ బ్రాత్‌వెయిట్ దొరగారు సేనానాయకులుగా నుండిన గ్రెనాడియర్ కంపినీవారిని రక్షకభటులుగా నేర్పరుచుకొని చెన్నపురికిబోయి అచ్చట సమస్తమైన మర్యాదలనుపొందిరి. విజయరామరాజు గారి రాష్ట్రము మిగుల విశాలమయినదియై తూర్పు ఇండియా సంఘమువారికి భయోత్పాతము కలిగించుచుండెను. విజయరామరాజు గారి యనంతరము వారి కుమాళ్లు నారాయణబాబుగారు సింహాసనాసీనులయి కాశీపట్టణము నివాసముగా నేర్పరచుకొని వారి కాలమునంతయు దైవభక్తియందును ధర్మకార్యములయందును వినియోగపరచుచుండి, 1845 సంవత్సరమునందు వారణాసీ నగరమునందు పరలోకగతులయిరి. అప్పుడు గౌరవసూచితార్థముగా ననేకవేలపిరంగులు కాల్పబడెను. అప్పటి రాజ్యప్రతినిధిగారగు లార్డు వులియం బెటిక్ ప్రభువుగారు రాజుగారి యోగ్యతనుగూర్చి యీక్రింద వ్రాసినప్రకారము ప్రశంసించిరి. "విజయనగరపు రాజుగారిని చిరకాలమునుంచి నేనెరుగుదును. ఆయనయెడల నాకు మిగులగౌరవముకలదు. ఆయన నడవడి మిగుల యోగ్యమయినది. ఆయనకు నేను జరపుచున్న మర్యాదల నన్నిటిని నాయనంతరము రాజ్యమునకు వచ్చు ప్రభువుకూడ జరిగించునని నేనురూఢిగా నమ్ముచున్నాను. 19 మార్చి 1835 సం॥"

నారాయణబాబుగారి యనంతరము వారి కుమాళ్లు ఘనతకెక్కిన లేటు మహారాజా మీర్జా శ్రీ విజయరామ గజపతిరాజు మహరాజ్ మన్యసుల్తాన్ బహదర్ కె-సి-యస్-ఐ-గారు రాజ్యమునకువచ్చిరి. ఆయన 1826 వ సంవత్సరము ఆగష్టునెల 7 వ తేదిని జననమొంది మూడుసంవత్సరముల ప్రాయముమొదలు కాశీపట్టణములోనే నివసించుచుండిరి. మిగులవాసిగాంచిన ఆంగ్లేయోపాధ్యాయులయొద్ద

విద్యాభ్యాసముచేసి ఆంగ్లేయభాషయందు తగిన ప్రవీణతను సంపాదించిరి. ఆంగ్లేయ మర్యాదలు వారికి చక్కగ తెలియును. వారిప్పుడు ఆంగ్లేయులతో స్నేహముచేయుచు కాశీనగరమందే నివసించుచుండిరి. 1848 సంవత్సరము 8 యేప్రిల్ తేదిని విజయనగరమునందు బ్రవేశించి ఆ సంవత్సరము మే నెల ౫వ తేదిని పట్టాభిషిక్తులైరి. ఆ మహోత్సవము మిగుల వైభవముతో జరపబడినది. కోటలో బ్రవేశించునపుడు 19 ఫిరంగులును, పట్టాభిషేక మహోత్సవకాలమందు 19 ఫిరంగులు కాల్పబడెను. మర్యాద గుళ్ల సంఖ్య తగ్గించిన సమయమునందు వీరికుటుంబమువారికికూడ 6 గుండ్లను తగ్గించిన 13 గుండ్లుమాత్రమే వేయవలసినదని దొరతనమువారాజ్ఞాపించిరి.

దొరతనమువారు మదరాసు సివిల్ సర్వీసులోజేరిన యల్. హెచ్. క్రోజియర్ దొరవారిని యేజంటుగా నేర్పరచి లేటు మహారాజగారికి పరిపాలనా విషయములను నేర్పించిరి.

మూడునాలుగేండ్లలో మహారాజగారు పరిపాలనాపద్ధతులన్నిటిని చక్కగ నేర్చుకొనినమీదట 1852 వ సంవత్సరములో సంస్థానము వారిపరము చేయబడెను. రాజ్యము వారికి నొప్పగించునపుడు మూడుతరములనుండి నిలచియున్న ఋణములను తీర్చివేసి లక్షరూపాయిల నగదునుకూడ దొరతనమువారప్పజెప్పిరి.

ఘనతకెక్కిన లార్డు హార్డింజ్ ప్రభువుగారు 1845 సంవత్సరములో లాహోరుకు బోవునపుడు కాశీపట్టణమునందు స్టీమరుపైని మహారాజగారువారి దర్శనముజేసిరి. అప్పుడు గవర్నరు జనరల్ గారు మహారాజగారికి సుందరమైన బంగరు టుంగరమును బహుమతిచేసి దేశమునకు బోవలసినదని మహారాజుగారిని కోరిరి.

ఆ 1863 వ సంవత్సరమునందు మహారాజగారు తిరుగ కాశికి బోయిరి. 1864 సంవత్సరములో ఖిల్లతులతోగూడ "మహారాజ్" పట్టము నందుటయేకాక లార్డు లారెన్సు ప్రభువుగారిచే కలకత్తాలోని రాజకీయచట్ట నిర్మాణసభలో నొక సాంఘికులుగా నేర్పరుపబడిరి.

1866 వ సంవత్సరమునందు ఆగ్రా నగరమునందు జరుగబడిన మహాసభలో మహారాజగారికి కె. సి. యస్. ఐ. బిరుదున్ను తత్సంబంధమైన ఖిల్లతులు అనగా ఏనుగు మొదలగు బహుమానములును యియ్యబడెను. బంగాళా రాజధానిలోగూడ వీరికి గౌరవ సూచితార్థముగా 13 గుండ్లుకాల్చుటకు దొరతనమువారుత్తరువొసగిరి. 'హిజ్ హైనెస్' అను బిరుదాంకితముకూడ నందిరి. గవర్నరు జనరల్ గారు సందర్శింపదగిన హిందూప్రభువుల సంఖ్యలో నీయనపేరుకూడ చేర్పబడెను.

114 (సశేషము) ఆ. సుందరరామయ్య.

రామాభ్యుదయము. (౪౮-పుటశేషము.)

మ. బలిసెం గౌను నడల్తెఱంబడిరెఁ గన్పట్టెన్ దనుగ్లాని చె
క్కులఁ జన్మొక్కలఁ దెల్పు నల్పొదవెఁ గూర్కుల్ గూర్కొనెం గంటు వె
ళ్ళెలఁ బాతెన్ ముఖచంద్రమండలము పొల్చెన్ నోరు మృద్గంధ గా
ఢీమై కోసలకన్యకున్ నృపపురంధ్రీమాన్యకున్ ధన్యకున్.

చ. కులమణియైన యన్నెలఁతకున్ మసలెన్నెల చీరచిక్కె మా
టలఁదగెఁ గ్రాను పాలెడ నడన్ వెడగూర్కు జనించె మించె నూ
ర్పులు మనసయ్యె వెల్మిడికిఁ బుట్టెను జాలనరోచకంబు మై
నలఁతయుఁ దొట్టె నోరఁదఱు వయ్యెను జిట్టుము లోకిలింతలున్.

క. సుదతి యతిబోధనిధియై । యుదరస్థిత చిన్మయాంబుజోదర తేజో
భ్యుదిత రఘువీరగుణ సం । పదఁ దెల్పెడుకరణి నిట్లు భావించె మదిన్.

చ. అనుపమ గర్భభారమున నంగనచంక్రమకేళికిన్ సహిం
పని యలమందగామిని యభంగపతంగ మతంగజోగ్రకా
నన సరసీ సముద్ర భువనంబులు దాఁటి చనంగఁ గోర్కు నే
మని కొనియాడవచ్చు నుదరార్భకచిన్మ ధురీణవాసనల్.

ఉ. కోమలి ప్రోవిరాచిలుకకున్ ఫలమర్మిలి నందియియ్య మే
నోమనిదయ్యె నయ్యెడఁ గృపోజ్జ్వలయై సకలాశ్రితార్థ గో
త్రామరు దీక్షితార్థ ఫలదానమె సేయఁదలంచుఁ గంటక
స్తోమ జిగీషమై హరికిశోరము గర్భమునందుఁ బూనుటన్.

క. కేళీ సరోజ దళ ఘట । నాలసమతియయ్యె నప్పుడాత్మఁ దలంచున్
బాలిక పరదళముల నను । కూల ప్రతికూలలీలఁ గూర్పన్ విప్పన్.

ఉ. పూనికనాటుతోఁట వలపల్లలకప్పుఁ గమ్మగూళ్ళ పూఁ
దేనియ యేటి కాలువలు దీర్పఁగ నోపికలేని దౌహృద
శ్రీనిధి యాధరాధిపతి చేడియ సింధు నిబంధన క్రియా
నూన చమత్క్రియల్ దలఁచు నుల్లమునందు నహర్నిశంబులున్.

క. అతుల జలకేళివేళన్ । సతిసరసిజ బిసములాడ్వ నైపనదయ్యెన్
శతధా సహస్రధాగతిఁ. । బ్రతిభటరిపు కంఠనాళ భంగమె తలఁచున్.

క. విబుధరిపుజైత్ర పతి మిం । చు విధమెఱిఁగి సురలు గురియు సుమవర్షంబుల్
నవలాధరింపఁ దలఁకొను । నవతంస శిరీషకోర కాసహయయ్యెన్.

గీ. అంతఁ గేకయ రాజకన్యకయు నట్లు । విష్ణు తేజోవిలాస వర్ధిష్ణు గర్భ
గౌరవోదయభద్ర లక్షణము దాల్చె । నంగలతఁ బూనుటకు ఫలంబదియ కాదె.

క. శ్రీవైష్ణవాంశ ధూర్వహ । మై శిశునకుఁ జూడ్కి పండువగు గర్భావి
ర్భావ ద్విగుణిత చిహ్న । శ్రీవిధము సుమిత్ర శుభచరిత్ర వహించెన్.

క. నవమాసావధిగా ని । ట్లవనీశ ప్రేయసీత్రయంబు సమస్త
స్తవనీయ గర్భభాగము । లవలీల ధరించి మించి రసదృశమహిమన్.

వ. అయ్యవసరంబునం గ్రమంబున.

క. అతిశుభవేళం గనియెన్ । సతి కోసలకన్య ధన్య సనయున్ దనయున్
గృతసుకృతి ప్రకృతి సత్త్వము । నతులతర ప్రతిభ దగ్ధభార్గవుఁబోలెన్.

క. ముద్దియ మునిహృత్కమలము । లుద్దామ శ్రీ సమృద్ధినొందం గనియెన్
బ్రొద్దులు నిండుటఁ జేసి ల । సద్దీప్తి సహస్రభాను శతకోటినిభున్.

క. ఆహరిదశ్వకులంబున । శ్రీహరి దైత్యారి యవతరించెన్ లీలా
బాహుజుఁడై కౌసల్యా । మోహనతరగర్భశుక్తి ముక్తాఫలమై.

శా. ఉల్లాసాతిశయంబు నొందెఁ జదలేఁ బుల్లోల కల్లోలమై
మల్లోకంబులు నోలలాడెఁ బ్రమదాంభోధిన్ దిశల్ వాల్చెరా
జిల్లెన్ మానసలజన్నముల్ జపతపశ్శీలంబులా రాజయో
షిల్లోకాగ్రణి యప్పుడప్రతిహత శ్రీధాము రామున్ గనన్.

క. సవనోపఘ్నకులాధిప । భవనోపవనోపయుక్త పవనోప కృతా
ర్జవనోపమసుమవర్ష । చ్యవనోపాయనములబ్బె నబ్బాలునకున్.

గీ. నెలలు తొమ్మిది మోచి నిర్నిద్రధాము । రామచంద్రునిఁ గన్న యా రామతోడ
నొక్క నెల మోచి పతిమేన నొరగు గౌరి । తారకారాతి జనయిత్రి ధాత్రిసరిరొ.

వ. అంత.

చ. వనధిపరీతభూమి యనవగ్రహ సౌఖ్యము గాంచఁ గేకయీ
వనరుహ పత్రనేత్రయు నవగ్రహముల్ సదనుగ్రహంబులై
గొనకొని యొక్కటం బదునొకొండవచోటి ఫలంబులియ్యఁగాఁ
గనియె ఘనున్ మనోజగురుకల్పు ననూనజయున్ దనూజునిన్.

ఉ. అంత సుమిత్రయుం గనె ననంతవిలాసుల ధర్మశాస్త్ర సి
ద్ధాంత రహస్యకోవిదుల నప్రతిమ ప్రతిభా ప్రభావ దు
ర్దాంతుల శ్రీనిశాంతుల సవగ్రగభీరిమ చాతురీ సర
స్వంతుల నిర్వురన్ విమతజైత్రులఁ బుత్రుల సచ్చరిత్రులన్.

గీ. రాము నభిరాముఁ గోసలేంద్రజయు భరతు । సిద్ధనయశోభరతుఁ గేకయీపురంధ్రి
యతులబుధమైత్రి సౌమిత్రి ననఘు నిఘ్నుఁ । డయిన శత్రుఘ్ను నా సుమిత్రయును గనిరి.

వ. అప్పుడు.

క. కురిసె విరిసోనవానలు । దొరసె సుధాంధోవధూ మధురగానంబుల్
మొరసె దివిఁదూర్యరవములు । విరిసెన్ మునిమానసార విందములంతన్.

క. ప్రతియాయజ్ఞాక గృహ సం । హతులనటించెన్ బ్రదక్షిణాకృతుల శిఖా
తతులతులగతుల మెఱయఁగ । హుతవహుఁడు శుభావహోదయోన్నిద్రుండై.

చ. అమరతరుప్రసూన నిచయంబుల వర్షము హర్షమగ్న సం
యముల పునః పునర్జయ జయధ్వని కిన్నరసిద్ధసాధ్య గా
నములు వియచ్చరాంగనల నాట్యము మంగళతూర్యనాదముల్
సమసమయ ప్రయుక్తములు సాగెరఘూత్తము లుద్భవించినన్.

గీ. హరిచతుర్భుజ పౌరుషవ్యక్తులొక్కొ । యలచతుర్విధ పురుషార్థములువహించు
పుంస్త్వములొకాకయంగము ల్పానిపోలుచు । శ్రుతులొయనసల్లురారాజసుతులుదగిరి.

క. నలుగురుకొమరుల నుగ్గుఁ । కులసతులున్ గన్నవార్తకున్ దశరథుఁడు
జ్జ్వలమోదచిత్తుఁడై వి । ప్రులకున్ మదిదనియనిడియెఁ బుత్రోత్సవముల్.

క. విశ్వప్రియులఁ గుమారుల । శాశ్వతులను నల్లురన్ బ్రసన్నులఁగని య
య్యీశ్వరునికంటె ముమ్మడి । నైశ్వర్యముగాంచి దశరథాధిపుఁడలరెన్.

ఉ. దైవతమానికార్య పరతంత్రులఁ బుత్రులఁగాంచెఁగాన నా
నావిధపుణ్య దానకలనన్ బితృతృప్తివిధాయియై జగ
త్పావనుఁడై ఋణత్రయముఁ బాపుకొనెన్ భళిమేదినీసుధాం
ధోవిభుమూర్తి యా దశరథుండు మనోరథసిద్ధి సంధిలన్.

గీ. పదిదినంబులు చన్నభూపాలసతికిఁ । బురుడు వెడలెఁ బ్రయోగణ్యఁబుణ్యరాము
యతిమనః పద్మమద మధువ్రతముఁగన్న । పువ్వుబోఁడికి జగములఁ బురుడుగలదె.

వ. తదనంతరంబున.

క. అలఘులనరుంధతీశా । దుల మౌనులఁగూర్చి సుతచతుష్టయమునకున్
జెలఁగి యొనరించె నారా । జలలాముఁడు జాతకర్మ సంస్కారణాదుల్.

క. లీలాసౌధాంతరమణి । డోలాతల్పములనిడి కడుందత్పరతన్
బాలికలు పెంచిరానర । పాలక బాలకుల ధర్మపరిపాలకులన్.

చ. దొరసిప్రభాధురంధరుఁ జతుర్దశలోకధరున్ మహాత్మునే
కరణిని గోసలేంద్రసుత గాంచెనొకో యని నాభిపంకజాం
తరమునఁ జెక్కు బ్రహ్మలఁగనంగల వేల్పునకెట్టు బొడ్డుగో
సిరా యనిపల్కురర్యమరుచిన్ రఘునందనుఁజూచి చూపరుల్.

క. వేదాదుల నెడఁబాయఁడు । వేదాదుల మఱగినాఁడు వీఁడౌరా కే
ళీదశఁ బరవశుఁడై మే । లీ దశరథరాజు భాగ్యమిందఱిలోనన్.

క. అనియీగతి నారఘునం । దను సన్నిధి నున్న మహిమఁ దమ మెదలి పురీ
జనులతులజ్ఞానశ్రీ । ఘనులై వర్ణించి రుక్తికౌశలమొప్పన్.

ఉ. ఆడటె నీవు నాఁడు కలశాంబుధితుంగతరంగ బాలఁడో
లాదర కేళికావిహరణాభిగతిం గుతుకంబుగాంచు న
య్యాదిభుజంగశాయివి ధరాధిపునింటఁ బసిండితొట్లలోఁ
దాదృశసౌఖ్యమందితిగదా కితవార్భకయంచు నవ్వుచున్.

ఉ. పట్టిఁబసిండి తొట్లనిడి పట్టికిలోచన గోచరంబుగాఁ
గట్టిరి రత్నకందుకము కస్తురిఁ బెట్టిరి చక్కఁబొట్టు జో
కొట్టిరి జోలపాడి రెడఁ గూర్కినఁగంటికి రెప్పవోలె న
ట్టిట్టెడగాక కాచిరి మహీవరమందిర మందగామినుల్.

క. పాలింపు మిజ్జగంబులఁ । బాలింపుగఁద్రావి చలమువాటింపకు మా
పాలింటివాఁడవై రే । పాలింటికి వచ్చినప్పు డరయుము మమ్మున్.

వ. అని బహువిధంబుల నుపలాలించి.

క. కడుపునకుఁ బెట్టి యొడయక । యొడనెడఁ జన్నిచ్చి పాడి యెప్పుడిపి యొడల్
గడిగి తెలిమడుఁగుఁ బాన్పున । నిడి యీగతి రఘుకుమారు నేదిరి దాదుల్.

శా. జోజో వారిజబాంధవాన్వయమణీ జోజో కుమారాగ్రణీ
జోజో దాశరథీ దయాశరధి జోజో కోటి కందర్ప లీ
లాజైత్రాంగ శుభాంతరంగయని జోలల్పాడిరింతుల్ త్రయీ
రాజీవాంతరరటన్మధువ్రత కిశోర శైనరాచూలికిన్.

సీ. మీనంబునయినాఁడ నేననిసూచించు తెఱఁగున ననిమిషదృష్టిఁ జూచుఁ
గమఠరూపము నేన కైకొంటినను వైఖరి బోరగిలు వీఁపుగానరాఁగఁ
బోత్రివేషము నేన పూనిమించితినంచు నెఱిఁగించు క్రియధాత్రి నెత్తమరుగు
నృహరిభావంబును నేన తాల్చితినన్న వీఁక బ్రహ్లాదాభివృద్ధినలరు
నడుగు వైపులుగని చూపు వడుగు బాగు । కరము గొడ్డలి నెఱపి భార్గవతఁ దెలుపు
దాశరథి వంశశరధిసుధాకరుండు । కేశవవిలాసభాగాత్మ శైశవమున.

సీ. అభవుఁడిమ్మేదినీ విభుపురంధ్రీగర్భ శుక్తిముక్తాఫలవ్యక్తిఁ బొడమె
వటశేషశాయి యీ యవనిపాలకునింటి పసిఁడితూఁగుందొట్లఁ బవ్వళించె

వేదాంతవేద్యుఁడీ విశ్వంభరాధీశు శుద్ధాంతకాంతల జోలఁ జొక్కి-
నఖిలపోషకుఁ డీనృపావరోధముచక్కి సొంపుమైదాదులు పెంపఁ బెరిగె
నితనిపుణ్యం బగణ్యమిం కితనితోడ | వాసవుఁడు గాఁడు ప్రతి వాసి గీసవెలితి
తమ్ముఁడతనికి శార్ఙ్గి యీతనికిఁ దనయుఁ | డగుట దశరథుఁ డన్యుఁడే యనిరి బుధులు.

క. రాకొమరుని మాత్రంబె య | లౌకికకమనీయతరకళానిధియని యా
లోకించిరి పైపైఁ బ్రజ | లా కౌసల్యాస్తనంధయమణిఁ బ్రేమన్.

వ. అంతనక్కుమారుఁడు.

క. తానును రజోగుణాత్మకుఁ | డైన తెఱంగెఱుకపఱుచు నట్లా త్రిజగ
త్ప్రాణిత శుభశైశవ ల | క్ష్మీనిధి వర్తిల్లుఁ బాంసుకేళిపరతన్.

క. కూర్చుండ నేర్చె నయ్యఖి | లార్చార్హుఁడు రఘుకుమారుఁ డరివర్గముఁ బో
కార్చి తపోరతి నియతిన్ | గూర్చుండఁగఁ గలిగె మునులకున్ సుఖవసతిన్.

గీ. ఇట్లు దశరథ వసుధాతలేంద్రసూతి | భీతిపగఱకు నాత్మలోఁ బెరుగఁ బెరిగెఁ
దొంగి యాడంగ నేర్చె దైత్యులు కృశించి | తొంటిమదమేది మేదినిఁ గుంటువడఁగ.

గీ. ఆలనృపాలక బాలకుఁ డల్లనల్ల | నడుగు పెట్టఁగడంగిన నడుగు వట్టి
రఖిలదైత్యులు నాఁడె యయ్యాదిదేవు | నడుగు వట్టినఁ గలదె నేఁడకటనేఁగ.

గీ. దశరథకుమార నీవిడు తప్పటడుగు | లుల్లమున నమ్మఁగాఁ జాలమొండు రెండు
తప్పటడుగులమును జగత్త్రయముఁగొంటి | బలిఁగికురుపెట్టి యనిబుధుల్ పలికిరపుడు.

శా. అప్పాలంచును బారఁ జాఁచి చనుదేరా యన్నయా కల్ప మా
యుప్పా యొప్పులకుప్ప యానతకకుప్పా యన్నఁ గప్పంగురుల్
గప్పన్మోమునఁ జిన్ని నవ్వొలయ బంగారందియల్ మ్రోయఁగా
నప్పాపం డరుదెంచుఁ దల్లి తనునారార్పం దగన్ ముందటన్.

క. ఈరీతి మనిరి క్రమమున | నారఘుకులతిలకు లనుదినాభ్యుదయ తనూ
చారిమఁ గూఁకటి ప్రాయము | వారై గురు మాతృభక్తి వశమానసులై.

క. ఆమహనీయులలోపల | రాముఁడు లోకత్రయాభిరాముఁడు సుగుణా
రాముఁడు నిఖిలాఘాఘువి | రాముఁడు చూపఱఁ గరంబు రంజిలఁ జేయున్.

క. వేదాదివిద్యలెఱిఁగెన్ | వేదండ విరోధిచండ విక్రముఁడు బుధుల్
సాదనశాత్రవుశల్లహ | సాదన జెగజెట్టిఁ దొడరి సాదన సేయున్.

క. నిసువుం దనవుం దటి నా | నసువులు రాసుతులు సకలశాస్త్రకలాపా
భ్యసనవ్యసనాభిముఖో | ల్లస[illegible] శ్రీశాలులైరి లలితప్రతిభన్.

క. సర్వజ్ఞశిఖామణులై । యుర్వరనాబాలచంద్రు లుత్తుంగ శ్రీ
ధూర్వహులై కనుపట్టిరి । పూర్వోదయ రేఖఁ బ్రబలి బుధపూజితులై.

క. రాఘవులు మించిరతిశర । లాఘవులై పటుధనుష్కళా పాండిత్య
శ్లాఘారేఖామోఘా । వ్యాఘాతభుజా విజృంభణారంభగతిన్.

క. పలుమరులసొబగుచందము । పలుమఱునగు నంగపటిమఁ బాటిల్లు నరా
నలుగురు రాసుతు లుగ్రా । నలు గురులతుల ప్రతాప నైపుణికల్మిన్.

గీ. ఇరువురిరువురు కవగూడి దొరసిమెలసి । యేకమై యలదశరథాధీశసుతులు
ప్రణుతిగాంచిరి రామలక్ష్మణు లనంగ । భరతశత్రుఘ్ను లన ననపాయమైత్రి.

క. ఎడయెఱిఁగియుఁ దమలోపల । నెడయెఱుఁగక ధర్మపథ సమేతస్థితికిన్
నడిమింటివారలై రా । నడిమింటిరవిన్ హసించు నవ్యప్రభలన్.

క. తనయులనలువురచేన । జ్జనపతి వక్త్రములవిధి భుజంబులహరియున్
వనధులవరుణుండును బ్రా । మినుకుల జన్నమును బోలి మిగులం బొలిచెన్.

వ. ఇవ్విధంబునం గుమారజనకుండై కుమారజనకుండునుంబోలె శాశ్వతైశ్వర్యపోషితా
శేష మిత్రుండై మిత్రుండునుంబోలె నప్రతీపప్రతాపాటోప ప్రభావభావుకాప
ఘనుండై ఘనుండునుంబోలె నతుల వితరణ నైపుణ్యుండును నగణ్యపుణ్యుండును
నసమరాజన్యుండును నసంభావ్య రాజన్యజన్యుండును నగుచు ఫలితమనోరథుండై
దశరథుండు సుఖంబుండె నయ్యవసరంబున.

శా. ధాటీసంభ్రమదభ్రచుంబికరటిద్రాఘిష్ఠశుండాముఖ
త్రోటీకల్పితరాహు సంశయ భయోద్భూతక్షపానాథ క
ర్ణాటాధీశసభాసరోరుహ వనాంతా రాజహంస స్ఫురా
ఘాటోదారయశః కలాపప్రతిభా కద్రూకుమారాగ్రణీ.

క. వైర్యక్షికుముదసూర్యా । సూర్యభయప్రదదయాభి శోభితశౌర్యా
శౌర్యంఘ్రికమలకలిత స । పర్యా పర్యటదపార పటుకీర్తినిధీ.

గద్య. ఇది శ్రీమదొంటిమిట్ట రఘువీరశతక నిర్మాణకర్మఠ జగదేకఖ్యాతి ధుర్యాయ్యల
రాజు తిప్పయమనీషి పర్వతాభిధాన పౌత్రాక్కయార్యపుత్ర పరిశీలితసవిద్ధ
రామానుజమతసిద్ధాంతమర్మ ముమ్మడి వరదాచార్యకటాక్షవీక్షాపాత్రహృదయ
పద్మాధిష్ఠిత శ్రీరామభద్ర రామభద్రకవిప్రణీతంబయిన రామాభ్యుదయ మహా
ప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము.

చతుర్థాశ్వాసము.

క. శ్రీద్రాఘిష్ఠకటాక్ష స । ముద్రమరుద్ధురిమ జయాభిముఖ వితరణ సం
పద్రమణీయకళా ని । ర్నిద్రా గొబ్బూరి నరసనృపవంశమణీ.

వ. అవధరింపుము తదనంతర కథావిధం బెట్టిదనిన.

క. కదలి మొలనూలినవలా । మొడయనఁ బది తేరులయ్యె నొయ్యన చేరన్
జడదారి మేటి రావం । గడపం బాలుండు కోరికలు చేకూఱన్.

క. వచ్చినపుడర్ఘ్యపాద్యము । లిచ్చి సువర్ణైకపీఠమిడి ముని వర మీ
రిచ్చోటికి బడలికమై । విచ్చేయుట యేమి తెలుపవే పనిని నృపున్.

క. నావినివిను నానావని । దేవ తపోధనజనాళి తేయాగమునన్
నే విశ్వసించి యాగము । గావింపఁదలంచితిన్ జగన్నుతచరితా.

క. అఘదూరు నీకుమారున్ । రఘువీరు నుదారు నుగ్రరణశూరుని ని
మ్మఘటనఘటకుని మన్మఖ । విఘటనకర దనుజహరణ విహరణనిధికిన్.

వ. అని మునీంద్రుండు రాకుమారునిం దోడ్కొని చనవేఁడుకొను వార్త పురజనంబులు
విని యిట్లనిరి.

క. అసురుల మాయోపాయులఁ । గనిమసఁగఁగనఁట మఖంబుఁ గావఁగనఁట తా
పసుఁడొకఁడఁట సిసువులఁ గ్రో । న్నిసువులనడిగెఁనఁట మునులు నిర్మోహులుగా.

ఉ. అక్కట కోసలక్షితి వరాత్మజ కానక కన్నముద్దు లేఁ
జక్కనిచుంచు రాకొమరుఁ జంపుటకెక్కడ యధ్వరావనం
బెక్కడ దైత్య సంహరణమెక్కడ ఘోరవనాంతరాశ్రమం
బెక్కడ యెట్టులంపుమనియెన్ ముని నోరెటులాడెనింతకున్.

వ. అని పలికిరంత నిక్కడ మునీంద్రుఁడు మఱియుఁ బఙ్క్తిరథున కిట్లనియె.

క. విను క్రతు కర్తయు భోక్తయు । వనజోదరమూర్తియగు భవత్తనయుఁడ పో
జనవర కర్తాభోక్తా । జనార్దనయటంచు శ్రుతులు చాటన్ వినవే.

క. నలువ గల్గెలోఁతుపొక్కిలి । నలువగల భుజంబులుం దనరసిరినంటున్
గలిమి దొర నీకుమారుఁడు । కలిమిహికామిహిరమూర్తి గాకన్యుండే.

చ. మునివరువెంట నీ పరమముగ్ధుల బాలుర నంపవచ్చునే
యని మదిసంశయింపకు నృపాగ్రణి మానవమాత్రులే భవ
త్తనయు లమోఘవిక్రము లుదారులు కారణజన్ము లార్య వం
దనపరు లమ్మహామహుల ధార్మికులన్ దృఢబుద్ధినంపవే.

క. అనఁ దనయు రామచంద్రుని । మునిపరమేశ్వరునికిచ్చె మోహముతో న
జ్జననాథుఁడు జాబిల్లిన్ । వననిధి వలిగట్టు నల్లువానికిఁ బోలెన్.

క. బాలుర గత మష్కృత జం । బాలుర మునిలోకహృదయ కుంకజనికరం
బాలులనక్కునఁ జేర్చి నృ । పాలుఁడు దీవించె నతికృపాలుండంతన్.

చ. నరవరసూనులంతఁ జరణంబుల వ్రాలిన వారిమీఁద ని
ర్భరతరబాష్పబిందువులు రాల్చెఁ గగంబనురక్తిఁ గుంభినీ
శ్వర కులసార్వభౌముఁ డతిసత్త్వధురంధరమూర్తి యద్రిలిం
గరి కర శీకరంబులఁ దగంగలశంబులఁ దోఁచు కైవడిన్.

క. గురునాజ్ఞ నంత రాఘవు । లరి భీకరు లనుసరించి రా సంయమి శే
ఖరు శమదమములు యోగము । నిరుపమ విజయోదయములు నీతింబోలెన్.

వ. అప్పుడు.

క. పదపదరాఘవ నిలునిలు । మదవదపడవలను దశరథాధిపనీకున్
ముదమొదవఁ దెత్తు మఖరిపు । మదవదసురవధయొనర్చి మగుడన్ సుతులన్.

వ. అనిన దశరథుండిట్లనియె.

చ. గురుతరపుణ్య యీ కుసుమకోమలమూర్తుల నీకుమార శే
ఖరులగుఱించి మీరడుగఁగా నిపుడంపక మానరాదు భీ
కరకరినాశ్మ మార్గములఁ గానలఁ ద్రిమ్మరనేతదంఘ్రి పం
కరుహయుగంబులింకఁ గసుగందకకుందకయున్నె నావుడున్.

క. వినుమును బలివంచన వే । శనృపాగ్రణి యబ్ధిమేఖలావలయం బీ
తనికేకపదము గాదా । కనుఁగొని నడుచు నని వగవఁగాఁ బనియేమీ.

ఉ. భూవరపోయివత్తుమె తపోధన కంటికిఱెప్పచందమై
కావవలెంజుమీ యటులు కాకమతేమి యఘంబులంటవి
ప్పావననీవె చూచెదవు పల్కులువేయును నేటికిన్ క్రియా
కేవలముత్తరంబని యకిల్బిషుఁడమ్మునియేగె నవ్వలన్.

క. మునివెనుకొని నృపకిశోరకుని । చనిరిరఘూత్తములు పవన సన్నాహ నిరూ
ఢ నిగాఢగమనవేగం । బున శరధిశరాస శరసముత్కరధరులై.

చ. కలనినదంబుచేత విహగంబులు నష్టతరాతపంబుచే
జలరుహమిత్రమున్ వలపుచల్లెడు క్రొవ్విరివానచే ఘనం
బులు గరుడాంకుఁడున్ స్వకులపూజ్యుఁడుపేంద్రుఁడు గాన విక్రమో
జ్జ్వలునిఁ బ్రశాంనిధిన్ భువనవల్లభు రాము భజించెఁ ద్రోవలోన్.

(సశేషము.)

మధ్యకవులు. (౧౬-పుట శేషము.)

సారంగు-తమ్మయ్య

ఈ ప్రాంతములయందు సారంగువారు సాధారణముగా మాధ్వులుగానున్నారు. ఈకవి తన వంశమును వర్ణించుచు

ఉ. తమ్మనయంబుఁ బ్రోచుటకు ధారుణిబంధులు బంధుపారిజా
తమ్మన రామభక్తిఁగని తార్కికులెల్లను వీనిదౌరచి
త్తమ్మనఁ జూపులందనిసి ధార్మికులీతని దెంతమంచి వృ
త్తమ్మన నాగిరిప్రభుని తమ్మన మించె నుదంచిత స్థితిన్.

సీ. తమ్మ మంత్రిగాంచెఁ దిమ్మాయి యందు నం
దనుల శౌర్యసింహు నారసింహుఁ
జతురబుద్ధిచంద్రు సత్కళా గుణచంద్రు
గిరిచమూవరేంద్రుఁ గీర్తిసాంద్రు.

తన తాతను రామభక్తునిగాఁ జెప్పుటచేతను, ఆతనిభార్యను తిమ్మాయి యని చెప్పుట చేతను, కూడ నితఁడు మాధ్వవంశజుఁ డేమోయని యూహింపఁదగియున్నను,

క. సారమతి యానృసింహుఁడు
వారాశి గభీరుఁడతుల వైభవమునఁగౌ
రీరమణి నీశుఁడుంబలె
నారూఢా న్వయవరించె నక్కమసాధ్విన్.

అని తన తల్లిదండ్రులను పార్వతీ పరమేశ్వరులతోఁ బోల్చుటచేతను తన పూర్వుల కమాత్యాదిపదములను జేర్చుచు వచ్చుటచేతను కవి నియోగిబ్రాహ్మణుఁడని తోఁచు చున్నది. ఇతఁడాపస్తంబసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; నరసింహమంత్రిపుత్రుఁడు; సారంగు తమ్మయామాత్యపౌత్రుఁడు. ఈకవి వైజయంతీ విలాసమను నాలుగాశ్వాసముల పద్యకావ్యమును రచించెను. ఇందు విప్రనారాయణుఁడనెడి యాళ్వారు చరిత్రము వర్ణింపఁబడినందున, దీనికి విప్రనారాయణ చరిత్రమనియు నామాంతరముగలదు. ఈ విప్రనారాయణునికే తొండరడిప్పొడి యాళ్వారని యఱవ పేరు. ఈ పుస్తకము నందలి కవిత్వము మనోహరముగానే యుండునుగాని యందందు కవిత్రయమువారి ప్రయోగములకు విరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నవి. కథయు మిక్కిలి యింపుగానుండును. విప్రనారాయణుఁడను వైష్ణవ బ్రహ్మచారి కావేరీ తీరమునందు శ్రీరంగ క్షేత్రమునందు వసించుచు మాధుకరవృత్తిచే జీవించుచు భక్తితో శ్రీరంగ నాయకునకు తులసిమాలల నర్పించుచు కాలము గడపుచుండెను.

శా. స్వాధ్యాయంబుఁ బఠించు సాంగకముగా సంధ్యాద్యనుష్ఠానముల్
విధ్యుక్తక్రియనాచరించుఁ దఱితోఁ వ్రేల్చుం బ్రపూతాత్ముఁడై
మధ్యేరంగశయానమూర్తి కిడుసమ్యద్భక్తిఁ దోమాలికల్
మధ్యాహ్నంబునఁ గుక్షి భిక్షుఁడనుపున్మాధూకరప్రక్రియన్.

ఇట్లుండఁగా మధురవాణియు దేవదేవియనను వేశ్యలక్క చెలియం దేవాలయములోఁ జూచి యాతని నిష్ఠకద్భుతపడి భక్తితోఁ మ్రొక్కఁగా మ్రొక్కు గైకొనకపోయెను. అప్పుడు దేవదేవి యలిగి యప్పతో

ఉ. మ్రొక్కిన నెవ్వరేమనఁడు; మోమటుపెట్టుక చక్కఁబోయె; నీ
దిక్కును జూడఁడాయె; నొకదీవన మాటయునాడఁడాయె; వీఁ
డెక్కడి వైష్ణవుండు? మనమేటికి మ్రొక్కితిమమ్మ? యక్కటా!
నెక్కొనివెఱ్ఱిబుద్ధిమయి నిద్దురవోయినవాని కాళ్లకున్.

అని యతని నిరాకరించి పలికెను. మధురవాణియు చెల్లెలి నూరార్చుచు,

ఉ. చూచిననేమి? నీవలను చూడకయుండిననేమి? పూజ్యులం
జూచినభక్తి మ్రొక్కుటయెశోభన; మీతఁడు బ్రాహ్మణుండు; ధా
త్రీచరులందు బ్రాహ్మణుఁడు దేవుఁడు; దేవుఁడు నీవు మ్రొక్కినన్
జూచునె? పల్కునో? యటులనుమ్మితఁడు స్సరసీరుహాననా!

అని శాంతచిత్తనుజేసి యతని వైరాగ్యమును గొంత ప్రశంసించెను. అప్పు డప్పమాట లంగీకరింపక

చ. ప్రకట జితేంద్రియుల్ ధరఁ బరాశర కౌశికులంతవారు స్త్రీ
లకు వశు, లంతకంటె మిగులన్ దృఢమా మగకచ్చ బిగ్గఁ గ
ట్టుకొనఁగ నీతఁడెంత? శుకుఁడో? హనుమంతుఁడొ? భీష్ముఁడో? వినా
యకుఁడొ? తలంచుకో సరసిజాయతలోచన నెమ్మనంబునన్.

క. ఈనిష్ఠలింతితారస । మైనందాఁకానెసూ! సదాచారి యటం
టే, నబ్బినదాఁకనెయగు; । మానిజనవిడంబనములు మనమెఱుఁగనివే?

క. ఇటువంటయ్యలెకారా
చిటుకుమనకయుండ సందె చీఁకటివేళన్
ఘుటచేటీవిటులై యీ
కటకంబునఁ దిరుగువారు? కంజదళాక్షీ!

*   *   *   *   *

గీ. నిర్జితేంద్రియుండు నిష్ఠాపరుండంచు । నప్పసారెసారెఁ జెప్పితీవు;
వీనిఁ బ్రతినచెఱిచి విటుఁజేసితెచ్చినఁ । గలదె పందెమనినఁగాంతపలికె.

* * * * *

క. నీవీవైష్ణవు విటునిం । గావించిన, లంజె తనవు గడనే విడుతున్;
గావింపలేకయుండిన, । నీవున్విడిచెదవెయనిన నెలఁతుకయొప్పెన్.

చెల్లెలా వీరవైష్ణవుని విటుని జేయవచ్చుననియు, అప్ప యతని నట్లుచేసినయెడల తాను వేశ్యావృత్తిని విడిచెదననియు, వివాదపడినమీఁదట దేవదేవి తానావైష్ణవ బ్రాహ్మచారిని విటుని జేసి యింటికిఁ దేలేకపోయినపక్షమునఁ దాను వేశ్యావృత్తిని విడిచెదనని పంతము పలికి తన రత్నాభరణములను కస్తూరీ తిలకమును దీసి తులసిపూసల పేరులును తిరుమణి నామమును వేసి సానివేషముఁబాసి దాసరిసానియై తిన్నగా విప్రనారాయణుఁడున్న యారామమునకుఁబోయి యాతనికి నమస్కారముచేసి, హేయభాజనమైన వేశ్యావృత్తిపై విరక్తిపొడమినట్లు నటించి,

గీ. * * హేయభాజన మెన్నిట నెన్నిచూడ । వేశ్యజన్మంబు జన్మమే విప్రవర్య.

* * * * *

ఉ. ఒక్కనిఁ బిల్వనంపి, మఱియొక్కనిచేతఁ బసిండిపట్టి, వే
ఱొక్కనియింటికేగుచు, మఱొక్కనినానడుచక్కి నొక్కచోఁ
బొక్కి కలంచి చూడ భ్రమఁబొంది విటుల్తెలియంగలేరుగా
కెక్కడి సత్య మేడవల పెక్కడినేమము వారకాంతకున్?

గీ. అనఘ వేశ్యా విడంబవర్తనములెన్న । నిసుకపాతఱ యీజోలియేలఁద్రవ్వ?
నప్పడుపుఁగూటిపై నసహ్యతజనించె । నా మనసురోసినట్టి చందంబువినుము.

* * * *

గీ. వారసతులైన యీసీమవారివలెనె । మోడిమానినిసినైన నేగోడునెఱుఁగ;
జిహ్వనాల్గచ్చరాలు నేర్చినకతానఁ । బడుపుఁగూటికి మనసుగొల్పకనిలైతి.

అని వేశ్యావృత్తిని నిందించుచు తియ్యనిమాటలుచెప్పి యాతని చెంతఁజేరి పరిచర్య చేయుచు దాస్యమిషమున మెల్లమెల్లగా నాతని యుల్లము కలంపఁజొచ్చెను. ఇట్లు కొంతకాలము దాసురాలిపొత్తు గలుగునప్పటికి

శా. ఆవిప్రోత్తము వజ్రపంజరనిభంబై నిశ్చలంబైన స
ద్భావం బంగనసాహచర్యగుణసంపర్కంబునన్ లోహమై,
గ్రావంబై, దృఢదారువై, తరుణవృక్షంబై, ఫలప్రాయమై,
పూవై, తన్మకరందమై, కరఁగెఁబో నీళ్లకుంబల్చనై.

విప్రనారాయణుని వజ్రకఠినమైన హృదయము దినదినక్రమమునఁ గరఁగి నీటికంటెను బలచనై దేవదేవి మనస్సులో నైక్యమయ్యెను. అంతట గురువేదాసురాలికి దాసుఁడయి పరిచర్యచేయ నపేక్షించి వేఁడుకొనఁగా మొట్టమొదట నాటక్కారివారాంగన

గీ. నిడుద పట్టెతిరుమణియె వైష్ణవము గాని
మీరలాడుమాట తీరుచూడ
ననఘ మొసలు బత్తుఁడును నోరుతో డేల
టన్నరీతి తోఁచుచున్నదిపుడు.

అని నీతులు చెప్పియు,

క. ఓసతి భగవత్సేవకు । వాసి గణింపంగ భాగవతసేవయ; త
ద్దాసులఁ గైంకర్యముఁ గృపఁ । జేసిన రంగేశ్వరునకుఁ జేయుటె సుమ్మీ.

అని యాతనిచేత బ్రతిమాలించుకొని భాగవత కైంకర్యము నంగీకరించి తుదకాతనినింటి బంటునుజేసి తనయింటికే కొనివచ్చి పందెము గెలిచెను. ఇట్లా వైష్ణవ వటుని విటుని జేసి తెచ్చి యిల్లుచేర్చినతరువాత వేశ్యమాత తగులుకొని

క. నవమదనునైన మెచ్చవు; । తవిలితివీయఁడవ; బోడితలకువలచితో?
ధవళాక్షి! వీని ప్రేలుం । జెవులకు వలచితివో? పిల్లసిగకువలచితో?

అని కూఁతునకు బుద్ధిచెప్ప మొదలుపెట్టెను. తానుపట్టిన ప్రతిజ్ఞ నెఱవేఱినందున,

క. పెదయప్పయు నేనును బ । న్నిదమాడినపనికి నీతనిందెచ్చితినా
కొదవయింటఁదీటె నిఁక నీ । కొదవయె యున్నదనఁ దల్లి కూఁతునకనియెన్.

కూఁతురును తల్లిమాటలకు సంతోషించిక్రొత్తయల్లుని నిల్లువెడలింపఁదల్లింబురికొల్పెను. ఆ సన్న గైకొని వేశ్యమాత నూతన జామాతనుజేరి

సీ. నీ పట్టెతిరుమణి నీ తిరుచూర్ణంబు గణికకు వెండి బంగారులౌనె?
నీపుట్టగోచియు నీ కావివేష్టనుల్ వారకాంతకుఁబట్టు చీరలౌనె?
నీముష్టికూడయు నీ తులసిసరులు వేశ్యకుఁబండుగ వేఁటలౌనె?
నీవేదశాస్త్రముల్ నీజపసంధ్యలు లంజెసానికిఁబాఁజులగములౌనె?
పెట్టనోఁపితివా యెప్పటట్టెయుండు
పెట్టలేకున్నవిచ్చేయు పెందలకడ
మొదలరోయింఁతులకు నొక్క ముడుపె కాక
నీసదాచారమేలయ్యా? దాసరయ్యా!

అనికసరి సాగనంపఁగా నా భాగవతోత్తముఁడు వేశ్యాగృహమువిడిచి తన కుటీరము చేరి తన హృదయేశ్వరిని తలఁచి చింతిల్లుచు

గీ. అతివ వైష్ణవ మతరహస్యముఁ జాలఁ । బరిచయము గన్నయట్టి ప్రపన్నురాలు
శూద్రసంపర్కమున కేల చొచ్చు మరల? । నిచ్చటికి నెంత ప్రౌఢైన వచ్చుఁగాక.

అని ప్రియురాలి గుణసంపత్తిని బ్రశంసించి యడియాసపడుచు

సీ. తనకు నేమిత్రోవ తలకెత్తి రమరు లీ
యుర్విమనుజులేమి యొసఁగ రైరి?
నింగివారసతుల నిర్మాతృకలఁ జేసి
పుడమి మాతృభూతముల సృజించె.

అని భూలోకమున వేశ్యలకు తల్లులను సృష్టించినందునకు బ్రహ్మదేవుని నిందించుచు, పరితపింపఁ జొచ్చెను. వేశ్యాసంపర్కము వలన నెట్టి దృఢమనస్కులకును ననర్థములు వచ్చునని చూపుటకయి యింతవఱకుఁ గల్పింపఁబడిన కథ నీతిబోధకమ్ముగానే యున్నది కాని తరువాతికథమాత్రము నీతిబాహ్యముగా నున్నది. భక్తుఁడట్లు పరితపించుట చూచి భక్తజనార్తిహరుఁడగు రంగేశుఁడు శిష్యరూపము ధరించి

క. సారమణి ఖచితమగు బం
గారపుఁ దనగిన్నె వారకామినికొసఁగన్
శ్రీరంగదివ్యధామ వి
హారుఁడు స్వయమర్థచోరుఁడై కొనిపోయెన్.

తన గుడిలోని బంగారపుగిన్నెను గొనిపోయి తన గురువగు విప్రనారాయణుఁడు పంపినట్లుగా వేశ్యమాతకు సమర్పించి తన భక్తునకు మరల వేశ్యతోడి పొత్తు సమకూర్చెనఁట!

చ. సతతము బ్రహ్మరుద్ర సురషండము ముఖ్యులనాత్మమాయ మో
హితులుగఁ జేయు సామి వెలయింతిని మోహితఁ జేయలేక ప్రా
కృత జనునట్లు తాను దన గిన్నె నొసంగెను బంటుకోసమై
మతకరి వేశ్యమాత వెడమాయ లజేయలు విష్ణుమాయకున్.

వేశ్యమాయలు విష్ణుమాయను సహితము మించినవఁట! దేవాలయములోని స్వర్ణపాత్రము మాయమగుట కనుఁగొని జియ్యరు రాజభటుల కెఱిఁగించి, వారు వేశ్య యింట గిన్నె పట్టుకొని విప్రనారాయణుని చోరునిగా దండితుఁ జేయుటకయి కొనివచ్చినప్పు డాతని గుడివెడల నడవఁబోవుచుండఁగా, శ్రీరంగేశుఁడు సాక్షాత్కరించి భక్తప్రమోదసంధానముకొఱకు తానే గిన్నెను వేశ్యకిచ్చితినని చెప్పి రాజభటులు పట్టుకొన్న స్వర్ణపాత్రమును మరల వేశ్యకిప్పించి భక్తునకు బ్రహ్మరథము పట్టించి జీవన్ముక్తి యొసంగెనఁట!

గీ. బ్రహ్మసభయెల్ల భక్తినప్పరమవైష్ణ । వోత్తముని బ్రహ్మరథమున నునిచి పట్ట
ణమున నేగించి రథికసంభ్రమము మీఱ । జియ్యమును దఱికొమ్ముసఁ జేరిమోవ.

ఆహా! ఏమి యీ బ్రాహ్మణోత్తమునిభాగ్యము!

ఉ. చోరుఁడనంగరా దొరులసొమ్ములుద్రుచ్చిలినం బ్రపన్నునిన్,
జారుఁడనంగరాదు వెలుచంబరకాంతలఁ గూడినన్, దురా
చారుఁడనంగరాదయనిశంబును వేశ్యలతో రమించినన్,
బోరునమీరలాతనికిఁ బూనుఁడు బ్రహ్మరథంబువైష్ణవుల్.

ఇటువంటి సిద్ధాంతములే మన దేశములో నీతికిని మతమునకును గూడ నమితమైన చెఱుపును గలుగఁజేయుచున్నవి. నీతినివిడిచిన మతమెప్పుడును దేవునికి ప్రీతికరము కానేరదు. వైజయంతీవిలాసములోని

చ. ఇనసమతేజులౌ నృపులనెల్ల మహమ్మదుశాహియేలు నీ
యెనుబదినాల్గు దుర్గములనేలిన యేలిక గోలకొండఁ ద
ద్ఘన నగరస్థలింగరణికం బొనరించుచుఁ దమ్మమంత్రి యా
జనపతి రమ్ము సొమ్మసఁ బ్రజల్లయవెట్ట గృహస్థులౌనన్.

అను పద్యమునుబట్టి యీ తమ్మకవి మహమ్మదుశాహి గోలకొండ నబాబుగానుండిన ౧౫౮౧ వ సంవత్సరమునకును ౧౬౧౧ వ సంవత్సరమునకును మధ్యకాలములో వైజయంతీవిలాసమును రచించినట్లిదివఱకే తెనాలిరామకృష్ణకవి చరిత్రమునందుఁ దెలుపఁబడినది. పయిపద్యములవలననే కవియొక్క కవిత్వరీతి తేటపడునుగనుక వేఱుగఁ బద్యముల నుదాహరింపవలసిన యావశ్యకము లేదు.

ఎలకూచి - బాలసరస్వతి.

ఈకవి పదునేడవశతాబ్దారంభమునందుండి మహామహోపాధ్యాయ బిరుదము నందినవాఁడయి పాండిత్యముచేత మిక్కిలి ప్రసిద్ధికెక్కినవాఁడు.

క. ఆలోకసుతుఁడు మొన్నటి
కీలకసమ నామతంగగిరికడ నొసఁగెన్
బాలసరస్వతులకు నతఁ
డోలిఁదెనుఁగుటీకదాని కొప్పుగఁజేసెన్.

అని యప్పకవి చెప్పుటనుబట్టి యితఁడాంధ్రశబ్దచింతామణికి తెనుఁగుటీకను ౧౬౦౮ వ సంవత్సరమునందు చేసినట్టు కనఁబడుచున్నది. ఈకవి కట్టకడపట రచించిన రాఘవ

యాదవపాండవీయమునందు తానుచేసిన గ్రంథములనుగూర్చియు తన్నుఁగూర్చియు నిట్లు చెప్పుకొన్నాఁడు—

సీ. కవిసమీహిత రంగ కౌముదీనామనాటకవిధానప్రతిష్ఠాఘనుండ
సారసారస్య సచ్చంద్రికాపరిణయ ప్రముఖశతాగ్ర ప్రబంధకర్త
నంధ్రచింతామణి వ్యాఖ్యాన భాషావివరణాది బహుతంత్ర కరణచణుఁడ
వేదశాస్త్రపురాణ వివిధసంగీత సాహిత్యాది విద్యోప బృంహణుండ
ననఘ కౌండిన్యగోత్రుఁడ హరిపదాబ్జ। భక్తిశీలుఁడ నేఁడూచి భైరవార్య
కృష్ణదేవతనూజుఁడనేవిచిత్ర। కావ్యమొక్కటి నిర్మింపఁగాఁ దొడంగి.

శా. మెండైనట్టి విచిత్రనైఖరులచే మీఁదౌ మహాకావ్యముల్
దండింద్రోల్లియె చేసిరాదిములు తత్కావ్యాధిక శ్లాఘులై
నుండ న్రాఘవ కృష్ణపాండవ కథాయుక్తప్రబంధంబు వా
క్పాండిత్యం బలరార శ్లేష రచనైకప్రౌఢి నేఁ జేసెదన్.

ఇతఁడు రచించిన యీ రాఘవ యాదవ పాండవీయము మూఁడర్థములుగలది ఇట్లు త్ర్యర్థికావ్యములను రచించినవారిలో నితఁడే మొదటివాఁడు. పూర్వోదాహృతమయిన సీసపద్యమువలన నితఁడు రంగకౌముది యను నాటకమును, చంద్రికాపరిణయమను ప్రబంధమును, ఆంధ్రశబ్ద చింతామణి వ్యాఖ్యానము భాషా వివరణమునను లక్షణగ్రంథములును, రాఘవ యాదవ పాండవీయమను త్ర్యర్థికావ్యమును రచించినట్టు కనఁబడుచున్నది. ఇతఁ డాంధ్రశబ్ద చింతామణికి వ్యాఖ్యానము మాత్రమే చేసినట్టు పయిపద్యమునఁ జెప్పఁబడినను మూలగ్రంథమునుగూడ నితఁడేచేసి గౌరవము కలుగుటకయి దాని కర్తృత్వమును నన్నయభట్టునకారోపణ చేసినట్లనేక హేతువులచేత నిశ్చయింపఁదగియున్నది. ఈవిషయమునుగూర్చి బమ్మెరపోతనామాత్యుని చరిత్రమునందుఁ గొంత వివరముగా వ్రాసియున్నాను. నన్నయభట్టునకు శబ్దశాసనుఁడన్న బిరుదీశబ్దశాస్త్ర నిర్మాణముచేతఁ గలిగినదని కొందఱు భ్రమపడుచున్నారుగాని యది సరికాదు. నన్నయ భట్టారకుఁడు మొట్టమొదట లక్షణప్రాయమైన సత్కావ్యమును రచించి యితరకవులకు కావ్యరచనకు దారిచూపుటచేత నాతనికి వాగనుశాసనుఁడన్న బిరుదము వచ్చినదేకాని వ్యాకరణ నిర్మాణముచేత రాలేదు.

"భట్టార బాలసరస్వతికవి మహోపాధ్యాయుఁడు" తాను రచియించిన చంద్రికా పరిణయమును పర్తియాల జమీన్‌దారుఁడగు జూపల్లి వేంకటాద్రి కంకితము చేసెను. ఈపర్తియాల బెజవాడకు రెండామడదూరమున నిజాము రాష్ట్రములోనున్నది. ఈకవిని కాకు సూర్యప్పకవి చూచియుండవచ్చును. చంద్రికా పరిణయ కృతినాయ

కుని తండ్రి జూపల్లి లింగన్న. ఈ లింగన్నను రంగరాజులింగన్న గూఢముగాఁ దిట్టిన యీ క్రింది చాటుపద్యము నప్పకవి యుదాహరించియున్నాఁడు—

క. రవికోటిధామమయమై
నవకాంచన యుతమునగుచు నానాటికొగిన్
భువిని శివాన్వితమగు నీ
భవనము జూపల్లిలింగ భవగుణసంగా.

చంద్రికా పరిణయమునందు కాశిరాజు కూఁతురైన చంద్రికను భీముఁడు వివాహ మాడిన కథ వర్ణింపఁబడినది. ఇతఁడు పదునేడవ శతాబ్దారంభమునుండి ౧౬౫౦-౮౦ సంవత్సరములవఱకును పండితకవిగా పేరుపడియుండవచ్చును. ఈతని రెండు తెలుఁగు కావ్యములనుండియు రెండేసిపద్యముల నిందుదాహరించుచున్నాను.—

చంద్రికా పరిణయము.

ఉ. జంగమరోహణాద్రి సదృశంబులు తత్పరిఁగల్గు భద్రసా
రంగవరేణ్యముల్పయికి హస్తములించుకసాఁచి యవ్వియ
ద్గాంగఝరంబుపీల్చిమరి తద్వమథుప్రకరంబు దప్పివో
యంగనెసంగు రంగుగనిజాఖ్యవహించిన చాతకాళికిన్.

ఉ. అంతట రుక్మబాహు వసుధాధిప నందనయొక్క-నాఁడు శు
ద్ధాంతగృహంబు వెల్వడి విహారగతింజను దెంచె నెచ్చెలుల్
చెంతలఁగొల్వఁ జంచదళి శింజితరంజిత కుంజమంజుల
ప్రాంతగిళత్ఫలా నవరతాంగజఘోటికిఁ బుష్పవాటికిన్.

రాఘవ యాదవ పాండవీయము.

ఉ. భోరనసద్దునంగడచి పోనెడయీుకచరించు మంచు న
వ్వారిధిగాఁదలంచి పురివాడలకుం దిగఁబోలు గేహసం
స్కారక ధూప ధూమము మిషంబునమబ్బుదినాంతవేళల
న్వారవధూటులందుఁ గలవాలుమెఱుంగులువోగణింపఁగన్.

ఉ. పాయక భ్రాతృయుక్తుఁడయి భవ్యసుఖంబులుగాంచుచు న్జగ
ద్ధేయయశుండతండు పరగెన్మహిదైవత పూజలం బితృ
వ్యాయత తర్పణక్రియల నంచిత ధర్మము విస్తరిల్లఁగాఁ
జేయుచు భూరినిష్ఠ మహిషీయుతుఁడై సుమఖాళిసల్పుచున్.

జ్యోతిశ్శాస్త్ర సంగ్రహము.

ఆకాశమునం దద్భుతముగా వెలుఁగుచుండెడు సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములు, మొదలయిన గోళములకెల్లను జ్యోతులనిపేరు. అట్టి జ్యోతులయొక్క స్వరూప స్వభావాదులను వివరించెడిదయినందున పెద్దలీశాస్త్రమును జ్యోతిశ్శాస్త్ర* మని వ్యవహరించుచున్నారు. ఆకాశమండలమున ప్రకాశించుచుండెడి గోళములలో నెల్ల నధిక తేజోవంతమయి తన సహజ తేజస్సుచేత మనదృష్టిని మిఱుమిట్లుగొలుపుచు సృష్టికర్తయొక్క యపారమహిమను వెల్లడించుచున్న సూర్యబింబమును మన పెద్దలు గ్రహరాజని వ్యవహరించియున్నారు. మనపూర్వులు భావించినట్లు నిజముగా సూర్యబింబ మొకగ్రహముగాక మనకత్యంత సమీపముననున్న నక్షత్రమేయయినను, సూర్యుని గ్రహరాజని పిలుచుటకు మాత్ర మేయాక్షేపమును లేదు. బుధశుక్రాంగారకాది సమస్తగ్రహములను స్వశక్తిచేత నడిపించుచు, వానికెల్లను ప్రకాశమునిచ్చుచు, వానిచేత తనకు ప్రదక్షిణములు చేయించుకొనుచుండు సూర్యుఁడు నిస్సందేహముగా గ్రహరాజే. గ్రహరాజని పిలువఁబడెడు సూర్యుఁడే గ్రహముకాకపోయినపక్షమున గ్రహములకును నక్షత్రములకును గలభేదమేదో యేవేవిగ్రహములో యేవేవి నక్షత్రములో సహేతుకముగా నిరూపింపవలసియున్నది. మన సూర్యునివలెనే సహజ తేజస్సుకలవయి స్థానమును గదలక తాము నడుముగానుండి తమచుట్టును గ్రహములను తిరుగునట్లుచేయు జ్యోతిర్మండలములను నక్షత్రములనికాని దూరముననున్న సూర్యులనికాని చెప్పవచ్చును; స్వతస్సిద్ధమయిన తేజస్సులేక తమ కాంతినంతను సూర్యునివలననే పొంది తమతమ కక్ష్యలలో సూర్యునిచుట్టును తిరుగుచుండెడు గోళములు గ్రహములు. అశ్విని, భరణి, మొదలయినవి నక్షత్రములు. బుధుఁడు, శుక్రుఁడు, భూమి, అంగారకుఁడు, మొదలయినవి గ్రహములు. మనము నివసించెడు భూమికూడ సూర్యునిచుట్టును తిరుగుచుండెడి యొక గ్రహమని వినఁగానే వింతగాతోఁచి మన భూమియే సూర్యుని చుట్టును తిరుగుచున్నదా సూర్యాదులన్నియు మన భూమిచుట్టును తిరుగుచుండలేదా యని యనేకులు శంకచేయవచ్చును అయినను మనము నివసించుచున్న భూమియన్న యభిమానమునుమాని సత్యమును చెప్పవలసినప్పుడుమాత్రము మనభూమి సూర్యుని చుట్టును తిరుగుచుండెడి గ్రహములలో నొకటియనిమాత్రమేకాక యట్టి గ్రహములలో నెల్లను పెద్దది సహితముకాక సామాన్యమయిన వానిలో నొక్కటియనికూడ నొప్పుకో

* (సం. జ్యోతిస్ = ప్రకాశించునది.) దీనికే ఖగోళశాస్త్రమని నామాంతరముగలదు.

వలసివచ్చును. భూమిలోని వస్తువులతో పోల్చి చూచినప్పుడు మనదృష్టి కీభూమి నిజముగా పెద్దదిగానే కానఁబడినను, మనదృష్టిని మఱింతదూరముగా పోనిచ్చి గగన మండలములోని యితరగోళములతో పోల్చిచూచి నప్పుడుమాత్రము మనభూమి యీ గొప్పతనమునంతను బోఁగొట్టుకొని చిన్నదికాక తప్పదు. మన భూమండలము కూడ నొక గ్రహమనియు, ఆకాశములోని జ్యోతిర్మండలములలో నొకటియనియు, చెప్పితిమిగాన జ్యోతిర్మండలములనుగూర్చి చెప్పునప్పుడు ముందుగా మన పాదముల క్రిందనున్న భూగోళములో నారంభించి యితరగోళముల కటుతరువాత పోవుట యుచితముగానుండును. కాఁబట్టి యిప్పుడు ప్రప్రథమమున గ్రహరూపమయిన భూగోళస్వరూపమునుగూర్చి కొంత విచారింతము.

మొదటి ప్రకరణము.

భూగ్రహము.

భూమండలముయొక్క స్థలజల విభాగములనుగూర్చియు, నదీ పర్వతాదులను గూర్చియు, దేశసరోవరాదులను గూర్చియు, భూమిమీఁది యితర విశేషములను గూర్చియు భూగోళశాస్త్రమునందు వివరముగాఁ జెప్పఁబడియుండును. ఆయంశము లను విచారించుట ప్రస్తుతమున మనపనికాదు. భూమి నిప్పుడొక్క గ్రహసామాన్య మునుగా గ్రహించిమాత్రమే దానితో సంబంధించిన విషయములను మనము చర్చింప వలసియున్నది. ‘భూమియొక్క యుపరిభాగము సమముగానున్నదా? వంపుగా నున్నదా? దాని రూపము చదరముగానున్నదా? గుండ్రముగానున్నదా?’ అన్న యంశమును మనము ముందుగా తెలిసికోవలెను. సూర్యునిచుట్టును తిరుగుచుండెడు బుధశుక్రాది సమస్త గ్రహములును గోళాకారముగానే యుండుటచేతను, వానిలో నొక్కటియైన భూమిమాత్రము వేఱువిధముగానుండుననని యూహించుటకు హేతువు కనఁబడకపోవుటచేతను, స్థూలబుద్ధితో విచారించువారికి సహితము భూమి యొకగోళ మనియే తెలియవచ్చును. అయినను కొన్నిదేశములవారు ※ కొంతకాలము క్రిందటి

※ ఇతరదేశస్థులు భూస్వరూప విషయమున నెట్టి యభిప్రాయము కలవారుగా నుండినను భరతఖండనివాసులుమాత్రము మొదటినుండియు భూమి వెలగపంటి వలె సర్వతోవృత్తముగా నున్నదనియే నమ్మియున్నారు.—

శ్లో. వృత్తభపంజరమధ్యే కక్ష్యాపరివేష్టితఃఖమధ్యస్థః ।
మృజ్జలశిఖివాయుమయో భూగోళస్సర్వతోవృత్తః॥ — ఆర్యభటుఁడు.

వఱకును భూమి సమప్రదేశముగా నున్నదని భావించియుండుటను బట్టియు, పయికి మన చూపులకును భూమి యాలాగుననే కానవచ్చుచుండుటను బట్టియు, భూమి బంతివలెగుండ్రముగానున్నదనిచూపుటకు రెండుమూడు నిదర్శనములనుజూపుచున్నాను.

౧. మనమొక్క సమప్రదేశమున నిలుచుండి నలుదిక్కులను దృష్టిసారించి చూచినపక్షమున దూరముననున్న పర్వతములు వృక్షములు మొదలయినవాని కొనలు మాత్రమే ముందుగా మనకు కానఁబడును. అట్లు మనమాపర్వతాదులు కనఁబడెడు దిక్కునకయి నడిచెడుపక్షమున, మనము వానిని సమీపించుకొలఁదిని పర్వతాదుల యొక్క దిగువభాగములు క్రమక్రమముగా కనఁబడ నారంభించి కట్టకడపట వాని మొదళ్లు కానఁబడును. భూమి నారింజపండువలె గుండ్రముగానుండి మనకును పర్వతాదులకును నడుమనున్న భూభాగమే మనదృష్టికడ్డముగాక భూమి చదరముగా నున్నయెడల, పర్వతముయొక్క పాదము సహితము మనకు మొట్టమొదటనే కానఁబడవలెను. అంతేకాక మనమాపర్వతముయొక్క మొదట నిలుచుండి చూచెడు పక్షమున కొంతదూరముమాత్రమే భూప్రదేశము మనకంటికిఁ గానవచ్చును; పర్వతము పయికి మఱికొంతదూరమెక్కి చూచినయెడల మఱికొంత యధికదూరము భూప్రదేశము కానఁబడును; మనము పర్వతాగ్రమునకెక్కి దృష్టిని వ్యాపింపఁజేసినయెడల వెనుకటికంటెను మఱింత యధికదూరము భూప్రదేశము కానఁబడును. ఇదికూడ మనము పయికెక్కినకొలఁదిని గుండ్రముగా నుండుటనుబట్టి మనదృష్టి కడ్డముగా నుండెడు భూభాగము మన దృష్టిమార్గమునుండి తొలఁగుచువచ్చి దాని యావలి ప్రదేశము కానవచ్చుచు భూమి గోళాకారముగా నున్నదని స్థాపించుచున్నది. ఒక్క భూప్రదేశము మాత్రమేకాక సదాసమసూత్రముగా నుండునని మనము భ్రమపడుచుండెడు జలప్రదేశముకూడ విలువంపుగానేయుండి భూమియొక్కవర్తులత్వమును పూర్తిచేయుచున్నది. సముద్రపురేవున నిలుచుండి చూచెడుపక్షమున దూరమునుండి వచ్చుచుండెడి యోడయొక్క చాపకొయ్యకొనలు ముందుగా మనకు నేత్రగోచరములగును. అటుతరువాత ఓడ సమీపించుకొలఁదిని తెరచాపలు మొదలయినవియు కడపట దాని యడుగుభాగమును మనకు కానవచ్చును. భూమి గుండ్రముగా నుండని పక్షమున నిట్లగపడుటకు కారణముండదు; పెద్దదియగుటచేత ముందుగా మన కడుగుభాగమే కానఁబడవలెను. ఒడ్డుననుండి లోపలికిపోయెడి యోడలయొక్క యడుగుభాగములే ముందుగా నదృశ్యములయి, అటుతరువాత కొయ్యలుమొదలయినయెత్తయిన భాగములు భూమ్యంతరిక్షములు కలిసికొన్నట్లు కానఁబడెడు దిఙ్మండలముక్రిందనడఁగి మఱుఁగగుచుండుటయు భూమి గుండ్రముగానున్నదని స్థిరపఱుచుచున్నది.



పయిపటములో వలయాకారముగానున్న రేఖ భూగోళముయొక్క యుపరి భాగమును దెలుపును; దానిపైని నిలుచుండినట్లున్న మనుష్యునియొక్క నేత్రమునకు సమముగా గీయఁబడియున్న సరళరేఖ యా మనుష్యుని దృష్టిపథమునకు సమరేఖలో నుండు ప్రదేశమును దెలుపును. సముద్రతీరమున నిలుచుండి చూచుచుండువానికి దూరమునుబట్టి యదివఱకు దిగువ నదృశ్యముగానున్న యోడ ముందుకువచ్చి దృష్టిమార్గము యొక్క సమరేఖను తాగసించునప్పటికి మొట్టమొదట చాపకొయ్యకొనమాత్రము కనఁబడును; మఱికొంత సమీపమునకు వచ్చునప్పటికి చాపకొయ్యలు సగమువఱకు కానఁబడును; ఇంకను సమీపమునకువచ్చి దృష్టిమార్గమునకు తిన్నగా నుండునప్పటి కోడయంతయు పూర్ణముగా కనఁబడును. ఈయంశమును పయిపటములోఁ జూపఁబడిన యోడయొక్క మూఁడుస్థానములను జూచి సులభముగాఁ దెలిసికొనవచ్చును.

౨. ఒకవస్తు వేయాకారము కలిగియుండునో దానినీడయు ఆ యాకారముగానే యుండునని యెల్లవారికిని ప్రత్యక్షానుభవముచేతనే తెలియును. చంద్రగ్రహణ సమయములయందు చంద్రబింబముమీఁద పడుచుండెడు భూమినీడ యెప్పుడును గుండ్రముగానే కానఁబడుచున్నందున భూమి గుండ్రముగా నున్నదని ప్రత్యక్షముగా తెలియుచున్నది.

౩. ఒక ప్రదేశమునుండి బయలుదేఱి మఱి యేప్రక్కను తిరుగక ముక్కుకు సూటిగా సముద్రయాత్రచేసిన నావికులనేకులు మొట్టమొదట తాము బయలుదేఱిన స్థానమునకేవచ్చి మరల చేరుచున్నారు. భూమి గుండ్రముగా నుండనిపక్షమున వారట్లు యథాస్థానముచేరుట సంభవింపదు.

ఈ చెప్పిన హేతువులన్నియు చక్కగానే కానఁబడుచున్నవి కాని క్రోశముల కొలఁది యౌన్నత్యముగల పర్వతములును మిక్కిలి లోఁతయిన పల్లములును భూమిమీఁద కానఁబడుచుండఁగా భూమి నారింజపండువలె గుండ్రముగానున్నదని యెట్లు నమ్మవచ్చునని కొందఱడుగవచ్చును. భూమియొక్క వైశాల్యమునుబట్టి చూడఁగా హిమవత్పర్వతమువంటి మహోన్నత పర్వతములుకూడ నారింజపండు నంటుకొన్న చిన్న యిసుక రేణువులకంటె నెక్కువపరిమాణము కలవిగానుండవు. కాఁబట్టి యిరువది నాలుగువేలమయిళ్ళ వృత్తముగల భూమియొక్క యుపరిభాగమునందు నొకచోట

నాలుగువేలమయిళ్ళెత్తుగల్గు పర్వతమునుగాని పల్లమునుగాని నారింజపండుతోలు మీఁదనుండెడు మిట్టపల్లములకంటె గొప్పగా భావింపఁగూడదు. మూఁడువేలయిన్నూరు క్రోసులనఁగా నెనిమిదివందల యోజనముల వ్యాసము * గల యీ భూమిపయినున్న రెండుక్రోసులయెత్తుగల పర్వతము భూమియొక్క దళసరిలో సహస్రాంశమయిన నుండదుగాన, భూపరిమాణమునుబట్టి యాపర్వతము పెద్దగున్నడిపండుమీఁద నంటించిన కాగితము దళసరికంటె నెక్కువగా నుండదు. కాఁబట్టి యిన్ని పర్వతములతోను పల్లములతోనుగూడ భూమియొక్క పయిభాగము దాని పరిమాణమునుబట్టి నారింజపండు పయిభాగమునకంటె నెక్కువ నున్నగా నుండుననియే తెలిసికోవలెను.

భూమియొక్క యాకారమును తెలిసికొన్నతరువాత దాని పరిమాణమునుగూడ తెలిసికోవలెను. తిరిగెడు వెలగకాయ బొంగరములకు మధ్యనుండి లోపల పుల్ల యున్నట్టుగా భూమిమధ్య నుత్తరమునుండి దక్షిణమునకున్నట్లు మనమూహించెడి యిరుసున కక్షమని పేరు. భూమిలోపలినుండి నిజముగానే యిరుసున్న పక్షమున, అది పైకి వెడలెడి భూమియొక్క భాగములలో నుత్తరపుదాని కుత్తరధ్రువమనియు దక్షిణపుదానికి దక్షిణధ్రువమనియు నామములు. నారింజపండుచుట్టును నడుమను దారముకట్టినట్లుగా నుభయధ్రువములనుండియు నెటుచూచినను సమదూరములో నుండులాగున భూమిచుట్టును మధ్యనుండి యున్నట్టు మనమూహించెడు రేఖకు భూమధ్యరేఖయని పేరు ఈ భూమధ్యరేఖకే విషువద్వలయమనియు, నాడీమండలరేఖ యనియు, నామాంతరములుగలవు. మనభూమి బంతివలె కేవలము గుండ్రముగా నుండక ధ్రువములవైపునఁ గొంచెము లోపలికి నొక్కుకొనిపోయి, భూమధ్యరేఖవైపునఁ గొంచెము పైకుబికి యున్నది. అందుచేతనే భూమియొక్క వ్యాస మొకధ్రువమునుండి యొక ధ్రువమునకున్నదానికంటె భూమధ్యరేఖవద్ద నొకప్రక్కనుండి యొకప్రక్కకుండునది దాదాపుగా పదుమూఁడుమైళ్లు హెచ్చుగానుండును. భూగోళముయొక్క యుపరిభాగముయొక్క వైశాల్యమంతయు ౧౯౬౬౨౬౦౦౦ (పందొమ్మిదికోట్ల యఱువదియాఱులక్షల యిరువదియాఱు వేల) చదరపుమైళ్లు; ఇందులో మూఁడువంతులు జలమయముగాను, ఒకవంతు

* వ్యాసము (diameter) అనఁగా అడ్డకొలత. బొంగరమునుగా నుపయోగించునప్పుడు వెలగపండు మధ్యనుండి గ్రుచ్చెడు వెదురుపుల్లను మీరు చూచి యుందురు. ఆపండులోపల మధ్యనుండిపోయి యావలావలలపైకివచ్చిన పుల్లయొక్క పండులో నిమిడియున్న భాగముయొక్క నిడివి పండుయొక్క వ్యాసము. క్రోసునకు రెండున్నర యింగ్లీషు మయిళ్లనియు, యోజనమొకటికి పదియింగ్లీషు మయిళ్లనియు, గ్రహింపవలెను. యోజనమనఁగా ఆమడ.

స్థలమయినను గానఁ, ఉన్నది. భూమిమీఁద నేవిధమయిన రేఖలును లేకపోయినను గణన సౌకర్యార్థము జ్యోతిశ్శాస్త్రజ్ఞులు రేఖలున్నట్లు కల్పింతురు. అట్లూహింపఁబడెడు భూమధ్యరేఖనుండి ధ్రువములవఱకును నుత్తరమున తొంబది సమభాగములను దక్షిణమున తొంబది సమభాగములను జేసి యాభాగములను దెలిపెడు సమాంతర రేఖలను భూమిచుట్టును వలయాకారముగా నేర్పఱిచి శాస్త్రకర్తలావలయ రేఖలకు అక్షాంశ వృత్తములని పేరు పెట్టిరి; ఈ యక్షాంశవృత్తరేఖలు భూమధ్యరేఖ కుత్తరమున తొంబదియు దక్షిణమున తొంబదియు మొత్తమున నూటయెనుబది యుండును. ఈ యక్షవలయరేఖలు నాడీమండలమునుండి యుత్తరముగాఁగాని దక్షిణముగాఁగాని ధ్రువములవఱకునకుఁ బోయిన కొలఁదిని పరిధి (చుట్టుకొలఁత) యందంతకంత కొకదాని కంటె నొకటి తక్కువగా నుండును. ఇట్లు సమభాగములుగాఁ జేయఁబడిన యొక రేఖనుండి యొకరేఖకుఁగల దూరము భాగయనికాని యంశయనికాని చెప్పఁబడును; భాగలో నఱువదవభాగము కళయనికాని లిప్తయనికాని చెప్పఁబడును; కళలో నఱువదవభాగము వికళయనికాని విలిప్తయనికాని చెప్పఁబడును.

ఈ ప్రకారముగానే నాడీమండల మనఁబడెడు భూమధ్యరేఖను తూర్పునుండి పడమటకు మున్నూటయఱువది సమభాగములనుగా భాగించి యుత్తర దక్షిణ ధ్రువములవఱకు నిలువుగా సరళరేఖలనేర్పఱిచి శాస్త్రకర్తలారేఖలకు రేఖాంశవృత్తములని పేరుపెట్టిరి. ఈ రేఖలన్నియు ధ్రువములవద్ద నేకముగా కలిసికొనునుగనుక, భూమధ్య రేఖనుండి ధ్రువములవంకకుఁ బోయినకొలఁదిని వెడల్పునందవి యంతకంతకు తగ్గుచుండును. ఇందొక్కొక్క రేఖమీఁదవసించువారికందఱికిని మధ్యాహ్నమేకకాలమునందు వచ్చుటచేత వీనికి మధ్యాహ్నరేఖలనియు పేరుగలదు. ఈ రేఖలు గోళమునకు మున్నూట యఱువది యగుటచే నర్ధగోళమునకు నూటయెనుబదేసియుండును. పయిని చెప్పిన ప్రకారముగానే వీనికి సహితమొక రేఖనుండి యొకరేఖకుఁగల దూరము భాగయనియు, భాగలో నఱువదవవంతు కళయనియు, కళలో నఱువదవవంతు వికళయనియు, చెప్పఁబడును. అందుచేత మనమేదైన నొక మధ్యాహ్నరేఖను పైకొన్నపక్షమున, దానికి తూర్పునఁగాని పడమటనుగాని యేప్రదేశమును నూటయెనుబది భాగలకంటె నధిక దూరముననుండదు. భూమధ్యరేఖ యడ్డముగా తూర్పునుండి పడమటకును, ధ్రువములలోనుండి పోవురేఖ నిలువుగా దక్షిణముననుండి యుత్తరమునకును, ఉండునుగదా? భూమియొక్క పరిధి (చుట్టుకొలఁత) ౨౫౦౦౦ మైళ్ళయినందున, భూమధ్యరేఖను సమభాగములుగా భాగించిన మున్నూటయఱువది భాగలలో ప్రతిభాగయు ౬౯½ (అఱువదితొమ్మిదిన్నర) మైళ్లు నిడివికలదిగా నుండును. మనకంటికిఁ గనఁబడు విధమును

బట్టి సూర్యుఁడు భూమిచుట్టును ఒకదినములోననఁగా నిరువదినాలుగు గంటల కాలములో నొకసారి తిరిగివచ్చునట్లగాన, సూర్యుఁడు గంటకు ౧౫ భాగల చొప్పున తిరుగును. అందుచేత నొకపట్టణమునకు తూర్పున ౧౫ భాగల దూరములోనున్న ప్రదేశములో నొకగంట ముందుగాను, పడమటను ౧౫ భాగల దూరములోనున్న ప్రదేశములో నొకగంట తరువాతను, సూర్యుఁడుదయించును.

ఇదివఱకుఁ జెప్పియున్న ప్రకారముగా పయికిఁ జూచుటకు మనము వాసము చేయు భూమి స్థిరముగా నిలిచియున్నట్లును దానిచుట్టును సూర్యచంద్రాది గ్రహము లును నక్షత్రములును ప్రతిదినమును తూర్పునుండి పడమటకు ప్రదక్షిణములు చేయు చున్నట్లును కనఁబడుచున్నను, నిజము విచారింపఁగా మనభూమి పడమటనుండి తూర్పునకు తన యక్షముమీఁద తిరుగుచుండుటచేతనే యట్లు కనఁబడుచున్నదిగాని సూర్యచంద్రాదులు తిరుగుచుండుటచేతఁగాదు. పూర్వకాలపువారందఱును పయికి కనఁబడుచున్నట్లుగా భూమి స్థిరముగానుండి సూర్యచంద్రాదులు భూమికి ప్రదక్షిణ ములు చేయుచున్నట్లు భ్రమపడి తదనుగుణముగానే తమ సిద్ధాంతములను జేసి యున్నారు. అయినను తరువాతి వారాభ్రమను కనిపెట్టి సహేతుకముగా సత్యమును వెల్లడిపఱుచుటచేత నిప్పుడు పశ్చిమఖండవాసులందఱును నైకకంఠ్యముతో భూభ్రమణ సిద్ధాంతమునే యంగీకరించియున్నారు. పశ్చిమఖండమునందువలెనే యీభరతఖండము నందును మొట్టమొదట మన పూర్వులు నక్షత్రాదుల భ్రమణమునే చేకొనిరిగాని కొంతకాలమయినతరువాత హూణశకము నాలవశతాబ్దమునందనఁగా పశ్చిమఖండ ములో భూభ్రమణసిద్ధాంతము కనిపెట్టఁబడుటకు చిరకాలము ముందే యార్యభటా చార్యులవారు తమ సిద్ధాంతములో భూభ్రమణమును స్థిరపఱచినారు. ※ అయినను భూభ్రమణసిద్ధాంతమునకు మనదేశములో నంతగా వ్యాప్తికలుగలేదు. ఆర్యభటుల వారికిఁ దరువాత క్రీస్తుశకము ౧౧౫౦ వ సంవత్సరమునందు సిద్ధాంత శిరోమణిని రచియించిన భాస్కరాచార్యులవారును భూమియే స్థిరముగానున్నదనియు భగణమే తిరుగుచున్నదనియు వ్రాసియున్నారు.

※ శ్లో. ※ ※ ఉపరిష్టాద్భగోళోయం వ్యక్షే పశ్చాన్ముఖస్సదా.

మధ్యేసమంతాదండస్య భూగోళో వ్యోమ్నితిష్ఠతి

బిభ్రాణః పరమాంశక్తిం బ్రహ్మణో ధారణాత్మికామ్.

అని సూర్యసిద్ధాంతమునందు భగోళము (గ్రహనక్షత్రాదులు) సదా పయినుండి పశ్చా న్ముఖముగా సంచరించుననియు, భగోళమధ్యమునందు భూగోళము బ్రహ్మయొక్క ధారణశక్తిచేత నిలిచియున్నదనియు, చెప్పఁబడియున్నది.

భూమి స్థిరముగానుండి గ్రహనక్షత్రములే తిరుగుచున్నను, గ్రహనక్షత్రములు స్థిరముగానుండి భూమియే తిరుగుచున్నను, ఈలోకముతో సంబంధించియున్నంత వఱకు నక్షత్రాది బాహ్యపదార్థముల వ్యాపారములన్నియు మనదృష్టి కేకవిధముగానే తోఁచును. అయినను భూభ్రమణము నంగీకరింపనిపక్షమున, గ్రహనక్షత్రాదుల దైనందినగతి మొదలగు వానిని సహేతుకముగా సాధించుట శక్యముకాదు. భూమి చిన్నది; సూర్యమండలము భూమికంటె ౧౩౪౦౦౦౦ల రెట్లు పెద్దది; ఆకర్షణశక్తిచేత పెద్దదానిచుట్టును చిన్నది తిరుగవలెనుగాని పెద్దదయిన సూర్యమండలము తనకంటె శతసహస్రగుణములు చిన్నదైన భూమండలముచుట్టును తిరుగుట సంభవింపనేరదు. ఇట్లున్నచో భూమియే తిరుగుచున్నపక్షమున, తారుమారయినప్పుడు గుండ్రముగ నుండు భూమిపైనున్న మనుష్యులు క్రిందపడక నిలువఁగలుగుదురాయని కొందఱు ప్రశ్న వేయుదురు. క్రిందేమి? మీఁదేమి? గోళాకారముగానున్న భూమికంతయు మీఁదే. ఎక్కడనున్నవాఁ డక్కడనే తాను పయినున్నట్లు భావించుకొనుచుండును. తూర్పనను, పడమటను, ఉత్తరముననను, దక్షిణముననను, క్రిందను, మీఁదను, ఎక్కడనున్నవాఁడు పయికిఁజూచినను తన తలమీఁద నాకాశమును నక్షత్రములనే చూచుచు తాను భూమిని ద్రొక్కుకొనియే యుండును. తాను భూమినివిడిచి పడకుండుటకు భూమి యొక్క యాకర్షణశక్తియే కారణము. * భూమి యెప్పుడును తన శక్తిలోనికి వచ్చిన పదార్థమును భూమధ్యాభిముఖముగా నాకర్షించుచుండుటనుబట్టి మనుష్యుఁడుగాని మఱి యేపదార్థముగాని భూమిని విడువక యంటిపట్టుకొని యుండఁగలుగును.

శ్లో. భపంజరః స్థిరో భూరేవావృత్యావృత్య ప్రాతిదైవసికౌ
ఉదయాస్తమయౌ సంపాదయతి గ్రహనక్షత్రాణామ్.

నక్షత్రపంజరము స్థిరముగానున్నది; భూమియే తిరుగుచుండి ప్రతిదినమును గ్రహనక్షత్రముల కుదయాస్తమయములను కలిగించుచున్నదనియు,

శ్లో. అనులోమగతిర్నౌస్థః పశ్యత్యచలం విలోమగం యద్వత్
అచలాని భాని తద్వత్సమ పశ్చిమగాని లంకాయాః.

నావయెక్కి పైకిఁబోవువాఁడు చలింపని పదార్థములను దిగువకుఁబోవుచున్నట్లు చూచునో యట్లే యచలములైన నక్షత్రములు పశ్చిమమునకుఁ బోవునట్లు కనఁబడు ననియు, ఆర్యభటులవారు తమ సిద్ధాంతమునందుఁ జెప్పియున్నారు.

*శ్లో. ఆకృష్టశక్తిశ్చ మహీతయాయత్ ఖస్థంగురుస్వాభిముఖం స్వశక్త్యా
ఆకృష్యతే తత్పతతీవభాతి.— ఇత్యాది సిద్ధాంతశిరోమణి వచనమునుబట్టి భూ యాకర్షణశక్తివిషయమయి మనపూర్వులెఱుఁగుదురనుట స్పష్టము.

 (సశేషము.) కం. వీరేశలింగము.

భాస్కరవిలాసము. (౧౮-పుట శేషము.)

అంతట నొకనాఁడు నాకాశ్రయుఁడయిన రాజకీయోద్యోగి తానేదో సభలో కవిత్రయమువారి శైలులనుగుఱించి యుపన్యాసమొకటి చదువఁబూనుకొనెనని చెప్పి తనకు తీఱుబడి కాదు గనుక నన్నది వ్రాసిపెట్టుమని కోరెను. నేను నా కల్పనా సామర్థ్యమునందును రచనావేగమునందును మిక్కిలి నమ్మకము గలవాఁడనయి వెంటనే అందుల కొప్పుకొంటిని. కాని నా యలవాటుచొప్పున అది కావలసిన దినమునకు ముందటినాఁటివఱకును, అది వ్రాయుట కొక్కపూట చాలుననియు 'రేపు' వ్రాయవచ్చుననియు జాలము సేసితిని. ఇంతట నాఁటికి అవితర్కితముగా, నాయీడువాండ్రేయయిన నామిత్రులగు చుట్టములు కొందఱు నా బసకు వచ్చిరి. వారితో ఆడుకొనుచు పాడుకొనుచుఁ గూర్చుండి రాత్రి వారిని సాగనంపఁ బోవునప్పటికి రెండు జాములయ్యెను. అప్పుడీయుపన్యాసము మాట నాకు స్మరణకే రాలేదు. మఱునాఁటి ప్రాతఃకాలమున నేనింకను మంచముమీఁదనుండి లేవకమునుపే నా యాశ్రయుని బంట్రౌతువచ్చి నన్ను నిద్రనుండి లేపి 'పంతులుగారు మిమ్ములను గాకితములడిగి తెమ్మన్నార'ని చెప్పెను. ఈమాటలు వినఁగానే నాకుఁ గలిగిన మనోవ్యాకులత వ్రాయనలవిగాదు. తొందర తొందరగా గదిలోనికిఁ బోయి కాగితమును కలమును బుచ్చుకొని వ్రాయనారంభించితిని. అంత వ్యాకులమయిన మనస్సుతో నేమి వ్రాయఁగలను? అయిదేసి నిమిషముల కొక్కొక్కమాఱు 'బాబూ! ప్రొద్దెక్కుచున్నది' అని బంట్రౌతు వాకిట నఱచుచుండెను. ఒక అరగడియవఱకును నాకు తొలివాక్యమే తోఁచినది కాదు. రెండుమాఱులు తొలిపుట వ్రాసి నామనస్సునకే సంతుష్టి కాక చింపివేసితిని. అప్పటికి జాము ప్రొద్దెక్కెను. బంట్రౌతు తానింకఁ గనుపెట్టుకొని యుండఁజాలననియు వెళ్లెదననియు కేకవేసెను. ఇఁక నప్పుడేమియుఁ దోఁచక 'నాకు తలనొప్పి వచ్చినందున నేనుపన్యాసము వ్రాయఁజాలనైతి' నని జాబువ్రాసి పంపితిని. నా మనోవ్యాకులతవలన నప్పుడు నాకు నిజముగానే తలనొప్పి వచ్చియుండెను. నా దురభ్యాసమునకు నన్ను నేనే సాయంకాలమును నిందించుకొనుచునే యుంటిని. ఏమిలాభము? మఱునాఁటి సాయంకాలమున మహారాజులుంగారి యాస్థానకవిపదము మఱియొకరి కీయఁబడెనను వార్త వింటిని. నా తండ్రిగారికి సమాచారమంతయుఁ దెలుపుచు వ్రాయలేక వ్రాయలేక తుదకెట్లో సిగ్గుచేత సగము చచ్చి జాబువ్రాసితిని. ఆజాబు చదివినప్పుడు నా తండ్రిగారి మనస్సెట్టి యవస్థను పొందెనో నాచదువరులూహింపఁదగినదే కాని నేను వివరింపఁజాలను. మఱి నాలుగు దినములనాఁటికి నాకీ క్రిందిరీతి నుత్తరము వచ్చెను—

శ్రీ రామ.

శ్రీరస్తు ప్రబల రామలింగశాస్త్రి మా కొమాళ్ళ ప్రబల భాస్కరరావును చిరాయువులుగాను పుత్రపౌత్రాభివృద్ధిగాను దీవిస్తిమి.

యిక్కడ రాయవరంలో క్షేమం. నీక్షేమ సమాచారం వ్రాస్తూరావలెను. త॥ నీవు బరిమాని తక్షణం యింటికిరావలెను. నీవంటి సోమరిపోతుకు చదువేమిటి. తప్పకుండా యీవుత్తర మందినవెంటనే బయలుదేరి రావలెను. గ్రహించవలెను.

శ్రీ శ్రీ శ్రీ. ది ౨ డిసంబరు ౧౮—సం॥ ప్ర॥ రామలింగశాస్త్రి వ్రాలు

ఇది చదువుకోఁగానే నాగుండె జల్లుమనెను. అయినను నాతండ్రిగారికి నాయందుఁగల ప్రేమాతిశయము నెఱిఁగినవాఁడను గనుక నా వాదబలము చేత ఆయన మనసు మరలింపఁ బూని యీ క్రిందిప్రకారము జాబువ్రాసితిని.

విజయనగరము ౫ డిసెంబరు ౧౮—

నాన్నగారూ!,

ఆస్థానకవిపదము మించిపోయినదని మీరు మిక్కిలి వ్యాకులపడుచున్నట్టు కనఁబడుచున్నది. అందుకంత వ్యాకులపడవలసిన పనిలేదు. దూరమాలోచించినయెడల బుద్ధిసూక్ష్మతగలవారికి ఏవో పద్యములల్లుకొనుచు నొకమూలఁ గూర్చుండుట తగిన పనికాదు. పరీక్షలలోఁ దేరి రాజకీయోద్యోగమునందుండి లోకానుభవము సంపాదించి యేగొప్ప జమీందారువద్దనో దివానుపని పొందుటకు ప్రయత్నింపవలయును. అట్టి స్థితిలోనుండి ప్రసిద్ధిసంపాదించినయెడల మహిసూరు మొదలయిన సామంతరాజ్యములవారును ఒకవేళ ఉన్నతపదమును దేనినైనను ఈయవచ్చును. అట్టి ప్రయత్నము మాని కావ్యాలాపములతోఁ బ్రొద్దుపుచ్చెడి మొద్దుపని మించెనని వగవనేల? ఇంకఁ బదిదినములలోఁ బ్రవేశపరీక్ష జరగును. అదికాఁగానే యింటికివచ్చెదను. దయయుంచవలయును. చిత్తగింపవలయును. శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ. నే॥ భాస్కరరావు.

"బుద్ధిసూక్ష్మత" "ఉన్నతపదము" అను మాటలు చూడఁగానే మునుపటి వ్యాకులతయు నామీఁదికోపమును పాఱిపోయెను. మఱి నాలుగుదినములకు 'గట్టిగాఁ జదివి పరీక్షయందుఁ గృతార్థుఁడవు గమ్ము' ని నాకు త్తరమువచ్చెను. ఈ జాబు నామనస్సును సంపూర్ణముగా స్వస్థపఱిచినందున నేను మరల నెప్పటి దీర్ఘసూత్రుఁడనయితిని.

డిసెంబరు ౧౫ వ తారీఖున జరగవలసిన మెట్రిక్యులేషను పరీక్షకు నా సహాధ్యాయులందఱును ఒకదినము వ్యవధియుండఁగా వెళ్ళుటమంచిదని ౧౨ వ తారీఖుననే బయలుదేరివెళ్లిరి. నేనుమాత్రము అంతకుముందుగా విశాఖపట్టణముచు వెళ్లి అక్కడి కంపుచేతను దోమలచేతను పీడింపఁబడనేల యని యెంచి ౧౩ వ తారీఖున బయలుదేరఁ

దలంచితిని. కాని మఱునాఁడెల్లను బట్టలును పుస్తకములును సర్దుకొనుట మొదలగు పనులు చేయుచు బండి కుదుర్చుకొనుటకు జాలము చేసితిని. నేను రాత్రి ౮ గంటలకు బండి కుదుర్చుకొనఁ బోవునప్పటికి బండ్లు దిగెడి స్థలమునకొక్కబండి యయినను కనఁబడలేదు. నాఁడు కలక్టరుగారి కచేరిబారందఱును విశాఖపట్టణమునకు బయలుదేరి నందున వారికొఱకు బంట్రౌతులు బండివాండ్రను తన్ని యీడ్చుకొనిపోయిరనిఅక్కడి వాండ్రు చెప్పిరి. మఱునాఁటి సాయంకాలమున వెలమపేట బండిమీఁద బయలుదేరిన పక్షమున వేళకు విశాఖపట్టణము చేరవచ్చునని యెంచి నేనును తొందరపడక యింటికిఁ బోయి పరుంటిని. మఱునాఁడెంత ప్రయత్నము చేసినను వెలమపేటబండ్లు దొరకలేదు. కాని మఱియొక బండివాఁడు తన కయిదురూపాయ లిచ్చినయెడల తెల్లవాఱునప్పటికి బండి విశాఖపట్టణమునకుఁ దోలుదునని యొప్పుకొనెను. ఇట్లు ఇతరసమయములయం దిచ్చెడి దానికి త్రిగుణముగా నిచ్చుకొనుట కంగీకరించి బండియెక్కి బండివానిని ఎంత తొందరపెట్టి తోలించినను విశాఖపట్టణమున కిటకమువారి కోనేటియొద్ద కాల్యకరణీయములను దీర్చుకొని నా గడియారము దీసి చూడఁగా— ఏమిచెప్పుదును!— పదిగంటలు సరయయ్యెను. పదిగంటలవేళ పరీక్షారంభము. ఆరంభమైనది మొదలుకొని అరగంట మించినపిమ్మట వచ్చినవానిని చేర్చుకోరు. ఏమి చేయుదును? అప్పుడు నా మనస్సునఁ గలిగిన ఆందోళనమునకుఁగాని ప్రలాపమును తుది నిమిషము వఱకును నిల్పియుంచెడి నా నిర్భాగ్యపు టలవాటునకై నన్ను నేను తిట్టుకొన్న తిట్లకుఁగాని మేరలేదు. ఇట్టిదయనీయావస్థయందుండఁగా నాకొక్క యాలోచన తోఁచెను. పరీక్షాధికారిగడియారము నా గడియారముతో సరిగా నేయుండునా? ఇరువది నిమిషములు వెనుకఁబడియుండఁగూడదా? తనంతట నదియట్లుండకున్నను ఆయన, యేప్రమాదమువల్లనయినను కొందఱు పరీక్షకు కొంచెము వేళమించిన తరువాత వచ్చినయెడల చెడుదురన్న జాలిచేతనయినను పావుగంటో అరగంటో యుక్తకాలమును మీఁదఁ బెట్టకుండునా? ఇట్టి యాలోచనలచేత ధైర్యము తెచ్చుకొని బట్టలువేసికొని బండిలోని సామగ్రి కూలివాని నెత్తినిబెట్టి వెంటరమ్మని నేను తిండితినకయే నార్మలుస్కూలునకుఁ బరుగెత్తితిని. నేను పరీక్షామందిరము గడపలోఁ గాలు పెట్టునప్పటికి పరీక్షాధికారి గడియారమునుబట్టి సరిగా పదిగంటలుసరయయ్యెను. అరగంట మించినతరువాత వచ్చిన వానిని చేర్చుకోఁగూడదన్న విధినిబట్టి నన్ను చేర్చుకొనుట కధికారి కొంత సంశయించి నా యవస్థను విన్నపైని ఎట్లో చేర్చుకొనెను. ప్రశ్నపత్రములు చేతఁబడఁగానే నాకంటె రెండు దినములు ముందుగా వచ్చినవాండ్రకంటె నాకు తక్కువ యేమనితలఁచి ప్రశ్నముల కుత్తరములు వ్రాయనారంభించితిని.

తొలినాఁటిపరీక్ష ముగియఁగానే పట్టణములోనికిఁ బోయి బస కుదుర్చుకొని మఱునాఁటి ప్రాతఃకాలమునిమిదిగంటలకే భోజనము చేసి పరీక్షామందిరమునకు వెళ్లితిని. మూఁడవనాఁడును ఆరీతినే ౮ గంటలకు భోజనము చేసితినిగాని అప్పటినుండియు వెళ్ళి యక్కడ దొర్లనేలయని బీజగణితమందేదో కఠినోద్దేశమొకటి యాలోచించుచుఁ గూర్చుంటిని. తొలినాఁటిరాత్రి రెండుజాములవఱకును మేలుకొని చదువుచుండుట చేతను భోజనానంతర మాలోచన కారంభించుటచేతను చల్లఁగా నిద్రపట్టి ౧౧ గంటలకు తెలివివచ్చెను. అప్పుడు తొందరపడి పరుగెత్తితినిగాని కార్యము లేకపోయెను. నన్ను చేర్చుకొనరైరి. ఒక్కనిమిషము విషాదపడి అంకగణితపరీక్షయు [illegible] మించి పోయినది. రేఖాగణితమందును బీజగణితమందును చక్కఁగా వ్రాసి యాలోపమును తీర్చెదనని ధైర్యము తెచ్చుకొంటిని. మఱి యేప్రమాదమును లేకుండ పరీక్ష మఱి రెండు దినములలో ముగిసెను.

పరీక్ష ముగియఁగానే బయలుదేరి యింటికివచ్చితిని. కాని నేనంకగణిత పరీక్ష నాఁడు వేళమించినతర్వాత వెళ్లితినన్న సమాచారము విని నా తండ్రిగారు నన్ను గట్టిగా చీవాట్లుపెట్టుట కారంభించెను. గణితశాస్త్రమందలి మూఁడుభాగములలో నొకటి పోయినందున నష్టిలేదనియు తక్కిన రెండుభాగములను చక్కఁగా వ్రాసితి ననియు బూకరించి నా తండ్రిగారి నూరకుండఁజేసితిని. కాని మఱి రెండుమాసములకు నా పరీక్షపోయెనని వార్త వెలిసినప్పుడు ఆయనకుఁ గలిగిన విషాదమును వ్రాయ నలవిగాదు. ఆయన, విషాదకోపములయొక్క యుద్రేకమువలన నన్ను చీవాట్లు సహితము పెట్టనొల్లకుండెను.

ద్వితీయాశ్వాసము.

కాలమెట్టి భావోద్రేకమునయినను శాంతింపఁజేయును. ఇట్టి అప్రతిహతశక్తిగల కాలమునకు మా నాయనగారి కోపవిషాదములను శాంతింపఁజేయుటయందు నాయం దాయనకుఁగల పుత్రవాత్సల్యాతిరేకముకూడ తోడయినందునను, నేనును సమయము దొరకినప్పుడెల్లను ఆయన వినునట్లుగా ఎవరితోనో, 'ఇఁక కొన్నిదినములలోనే సామాన్యపరీక్ష జరగఁబోవుచున్నది. నేను ఆ పరీక్షకును వెళ్లెదను గనుక అందుఁ గృతార్థుఁడనయి రాజకీయోద్యోగముల కర్హుఁడను కాఁగలను. ఆ పరీక్షకొఱకు దిట్టముగా చదువుచున్నాను గనుక ప్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడను కానయితినని అంతగా వగవఁబని లేదు.' అని చెప్పుచు వచ్చినందునను ఆయన శీఘ్రకాలములోనే స్వస్థచిత్తుఁడయ్యెను. కాని నాభావ్యుదర్కముల విషయమునమాత్రము ఆయనకు మునుపటి యుల్లాసము మఱి కలుగలేదు.

142 (సశేషము) బు. ఎసు. పాపయ్యశాస్త్రి.

పండితరాజశతకము. (౭౬-పుట శేషము.)

శ్రీరామనామపర, సం । సార తిమిరమిహిర, వేదసారా, సుమహో
దార, మునిదారకావన । ధీరా, వామార్ధదేహధృత నిజదారా.

క. రాచినను, గోసినం, గఱి । త్రాఁచుల గఱచిన, విదారితము సేసిన, ని
న్నోచందన? మేల్వలపున । నేచెదు నీసాధుతనము నెన్నఁగలమె. ౧.

శా. ఎన్నో తీవలఁ జేరి మంచుతఱి నీవెంతే మనఃఖేదముం
గన్నన్నైన ఫలంబ యో మధుప? మాకందంబు క్రొంబువ్వగు
త్తిన్నాడెంబగు తేనె జాలిదె సువిస్తీర్ణంబగు; న్దానిమో
యన్నా? నిర్జరసేవ్య పుష్పసమయ ప్రారంభకాలంబునన్. ౨.

తే. గీ. తేనెఁ బేరాసఁ జేరెను దేఁటిబారు । సూరుకరముల విచ్చిన సారసంబు;
నయ్యయోయీదురంతమేమంబుజంబు। ముంచి వెనుమంచుముద్దగావించికొనియె.

మ. భ్రమరం బేయెడ మావిఁ జూచి యతిదూరస్థంబు మోహాతిభా
రమునందద్విరహంబు సైఁప నసమర్థంబై యరణ్యాంబుమొ
ల్లమరందంబుఁ ద్రుజించుచుం బాగడచెట్లం బాల్చు క్రొమ్మొగ్గపా
ళిమదిం గోరక చేరె; నాతరువుఁ జీల్చెన్ వ్యథ రాజీవచెలీ? ౪.

మ. నరుఁ డెవ్వానికివచ్చు నన్వహము స్వర్ణశ్రీలయత్నంబ; య
త్యురుతన్వాఁ డొనరింపడేన్వయ యముతద్భాగ్యంబు, దాహంబు సే
కులు దైవంబున; బన్ధమన్ధములు దత్తుల్సేయుదు; ర్పొంద నీ
త, రమాజాని జగమ్ము కేటి దివియ పొందంజేయఁడే సంద్రముల్. ౫.

తే. గీ. కాచుకొనియుండిరేఁ గొంతకాల మనుల । నైన మానసకాసార మందునంబు
జంబుల సుఖింపుమీ దీని సౌహృదంబు । మాత్రమెప్పుడు విడువకు మానసమున.

శా. దూరస్థుండయి యేయునుండు దెసలందుం బర్వు చీఁకట్ల ను
త్సారించె; న్దైఱపించెఁ గన్నుగవఁ; గాంతిన్గూర్చె; మైత్రిస్ఫుటీ
కారంబయ్యెను దీననాచుఁదరి కేగం జూచినం జక్రవా?
వైరస్యంబుగ నాక్షణంబ పడవే భస్మంబుగాఁ జట్టుపల్. ౬.

ఉ. వచ్చెన రాత్రి వేఱుపఱుపన్మనలన్విధి నిర్దయుం; డటం
చచ్చపుబీతునన్నలఁగి యంగన? జక్కవఁ జూచె; దూరకీ
వెచ్చగనీవెతన్మది వహింపక; నేవిధిఁ దద్దయూజెదం
బొచ్చెముగాని కూర్మియిడి పొందకయేనిసిఁ గుందఁజేయుటల్. ౭.

తే. గీ. ఎండఱిరుపుట్టుపులువచ్చి యేగరుగొని । దళిముఫలమేని; సుప్రధితంబునీకు
గండుఁగోయిల పలుకుల కలిమివలన । నే రసాలమ? యుతరోపకారపరత. ౮.

తే. గీ. పృథివిని దండు జనులకుఁ బ్రియుఁడవగుదు! పోయి జీమూత! జీవన మొసఁగుకతన;
సారసంబులు వాని దేశంబు పోవు । చున్న నయములఁ బెదరించు టుచితమగునె.

మ. అడఁగంజేయుదుగాక యెల్లెడల నిం దౌ, ముత్తెపుల్పుక్తులం
బడనీ చినుకులు; నాస్తు చేలు; దరులన్ బాటీర ముఖ్యంబులం
బొడముం బల్లవ; మబ్ధిసీరు కడునుప్పౌ గ్రోలితో మేఘ! యె
వ్వా పరక్షోణిలఁ బ్రోడ యెవ్వఁడసు గుణమ్ముల్ గ్రీనివా క్రువ్వఁగన్. ౧౧.

తే. గీ. చాటిపట్ల గోతుల సలిల ములల । నరఁజేసితి; పంటల పొలములందు
నీటి చినుకులె రాల్చితి; నీదునీతి । నవని నెంచను మును గాన మంబువాహ. ౧౨.

క. పడలేదిల, సలిలకణము; । లడఁగ న్లేదింక దెసలయాతపబాధ
ల్వాడమించె నింపుహాలికుల । కడరుటనే బ్రతుకు సుందు లంబుదములివే. ౧౩.

ఉ. గోఁదురుగప్ప కూఁతలెసఁగు న్భవదభ్యుదయక్షణంబున
న్దాదరణీయ కోకిలరుతౌఘ ముధిక్కృత; సఖ్యుపప్పనీ
రాదట ద్రావినాఁడ; వమరాపగ తియ్యని నీరు గ్రోలవం
భోద యొనర్పవైతివి విమోహమునన్ సదసద్వివేకమున్. ౧౪.

తే. గీ. అట్టిపమ్ములఁగూర్మి లేదంబువాహ; । కుదిరె హావ్యక్త మయ్యెడి కొడిసెపూల;
కాన విశ్వైక జీవనస్థానమైన, । నీకు మర్యాదమారుత నిహూలియరుదె. ౧౫.

చ. నిరుపమవారి, నింపు దవనిన్వని సాటిగ, నెల్ల చెట్లకు
న్సరియగుచుండి వారిధర చందనమం దొనరింతు చల్వ; నే
ర్పరులకు దద్దియున్నతికిఁ బాత్రము గా; విధిపూనవే! హృదం
తరమున నీకు వచ్చుఁ దటిల్లప్పకహాని విసంబు ద్రావుటన్. ౧౬.

తే గీ. చండమార్తాండ కిరణసూర్చ్ఛాపరవశ । ములగు నీ పెనుబ్రాఁకుల బలఁగములకుఁ
గడలిజలమూని వర్షించు కాలమేఘుఁ । దక్కరక్షకుఁ డెవ్వఁడీ ధాత్రి నహహ.

మ. తలఁగె న్వేసఁగి కాఁకల, న్మనుపఁ గాంతారంబు నర్చె; న్ధరా
తలము న్ధారల నానె; నార్చె దవము న్ధారాధరుం, డార్చె గ
ర్జలనందందు నెమిళ్లఁ; దుంగపదమర్త్యమ్మంది కాంచె న్జగ
మ్ముఁ గుస్మేలెసో; మాఘులంగ్రు శరదంభోదంబు తత్కీర్తినే. ౧౭.

మ. భువనోత్తాపమడంతు, ధారలఁ బోఁ దమ్మున్నస్పి మెప్పింతు; పు
జ్జవతన్నన్వెనర్తు వీ, కడిమివృక్షంబుల్ప యోదా? కినుం
గవ మిన్నందిమవాన కోయిలకు గ్రుక్కన్నింపహర్షంబుఁ జెం
దవు; నీయాఘున కార్యమంత్యమగు నెంటన్నమ్మునే యెవ్వడేన్. ౧౮.

క. అనానావిధనలినము, । లోని, రాతేఁటి దాఁటులావిహగమ్ముల్
గానఁబడ వాక్కనిమిషను । లో; నదునేమిగిలె నింతలోనె సరసునకా.

శా. ఆవర్తంబులు లేవునేఁడు తటినీ? వ్యాలోలకల్లోల మా
లావిస్తారములేదు; భీషణరయోల్లాసంబునంబుట్టు నా
రావంబేమియులేదు; హూళ్చితివి తీరక్షోణివృక్షాళిముక్; .
గావర్తంబవు పెన్బులుంగులకునేఁ గల్పించుకోవాసమున్. ౨౧.

తే. గీ. నిలిచిమిన్నెటివెల్లువ? నీలకంఠు
తలపయినొకచోటనె వార్ధిఁ దలియఁజనుట
వ్యక్తముగ దగుఁ; స్రోవనదాంతరములు
పెక్కదగులుట దెగదునే ప్రముక్కడియును. ౨౨.

మ. అనుఁగా? పాంథ? యెదేనిబావిగలదం చాలింపనేనాఁడు; నే
జనుఁ డింతిట్టి దెఱుంగుగుంట; కనకాబ్జ శ్రీవిరాజిల్లు వా
హినిలేదెవ్వరెఱుంగ! రంతతెగువన్ హెచ్చించి, నన్వీడ, న
బ్బును బల్లప్పలఊచ్చునేలజలమే; పో జుట్టుకోడప్పివోకా. ౨౩.

తే. గీ. వలపుమోపరి? చొచ్చెదు వనములందు; । వలపుగుంపులనెపుడు సంపాదనంబు
నేసె; దిదె నీదునేరమి నేయవిద్ది । వలపుగబ్బిది; యనువేఱు పాటొకండె. ౨౪.

తే. గీ. అహహయందఱయనువులకనుగలములు
వెలుఁగులుంచుచు వెన్నెల పులుగునోళ్లఁ
జంద్రుఁడుదయి-ప నయ్యయోచేఁముపట్టి,
గ్రుక్కగొనె నతిబలుఁడు నః గ్రుండు రాహు. ౨౫.

చ. కొలఁకులఁగల్వమొగ్గగమి గోరు వికాసముఁ జెందదేని; నే
వలనఁజకోరముల్దలఁచుఁ బారణముం బచరింప దేనిఁ; గ
న్నులుదనియించునెయ్యది; మనోహర, మామునిమాపువచ్చెఁ జ
ల్వలదొర? కార్తికిం, గనుము భాస్వరకీర్తి మహోపకర్తనై. ౨౬.

తే. గీ. పొగడఁదగు, సుధసురలకు ముదముఁగూర్చు । బుభుక్షపతికృష్ణపక్షపరిక్షయమును
నీచుఁడే నౌరతాఁకని నీరుగల్లు । వారినిధిపూర్ణ భానము వర్ణ్యమగునె. ౨౭.

చ. అతివలఁ గూడువారలకు హర్షము, నారులఁబాయువారికి
న్వెత,నిడుఁజంపు; జక్కవలవేడుకకత్తెలకుత్తలంబు, తు
ష్టతను జకోరకాంతలకు, సారసలక్ష్మిహరించుఁ, గల్వసం
తతి నలరించు, నైరముహితత్వము పూర్వకృతైకలభ్యముల్. ౨౮.

మ. కలరిందెందఱొ రాజు లెల్లెడల విఖ్యాతు ల్సమీపస్థల
న్బ్రజాసంపన్నులఁ బ్రోచువా; రిదిదలంపం జిత్రమే; రాజగున్
జలివెల్గొక్కఁడె దాల సూరకర సంతాపంబునన్వాడు వె
న్నెలపుల్గుంగమి జూమెఱుంగనిదె దీనిస్థితిన్దప్పటన్. ౨౯.
తలఁగుంజీఁకటి; మంచు మించుఁదొలఁచున్; దమ్మింగరస్ఫూర్తిచే
నలరించు౯; గవగూర్చు జక్కవల; లోకాక్షిద్వయాన్వర్థతన్
గలిగించు న్జగదేకలోచన మహార్యాఘుండ మెల్లప్పుడు
న్నిలుపుం జెందఁడయేని, యెవ్వఁడు విధిం గెవ్వన్నరుఁడోహటున్. ౩౦.
క. అరవిందంబులు భాస్కరు । విరహంబున శోకవేగ వివశములగు- నా
తరణికి నెట్టులొయంతః । కరణము తద్విరహమందుఁ, గనుగొనఁదరమే. ౩౧.
క. ఎదిపసినాఁడు సఖుంబుల । విదళించెను హరి, మదేభ పృథుకరటతటం
బదిజళ్వనంపుఁబండుగ । ముదమందుచు నేఁడు శౌర్య ముఁజూపునెటన్. ౩౨.
క. నరపతిమందిరములఁ గే । సరి పంజరబంధరుద్ధ శౌర్యంబయ్యెన్;
జరుపఁగలఁ డెవ్వఁడదరెడు । కరికరటములందు వేడ్కఁ గరజార్పణమున్. . ౩.
మ. కలఁచెందొమ్ములఁ గారుదున్నలు తటాకంబద్దె యాత్మేచ్ఛ, బె
బ్బులులున్గాఁద్రుమటంచు జింకగుమిఁ బర్వుల్గాల్పె, నంతన్మృగ
మ్ములరాజొడ్డికతోఁ బదంబులిడుచు న్స్వైరస్వజృంభింప ని
శ్చలతన్గాడదె యట్లెచిత్తరుపుతో సౌమ్యంబుఁజెందెన్గటా! ౩౪.
తే. గీ. పగులఁజేసెఁగరేణు గర్భమ్ములఁ దమ । యంత, సేనంగు చెక్కులయూముసీరు
పుడిసేఁడుగఁగ్రోలె సేహరిబొబ్బ, లదియె। వృద్ధహరిణులచే సహియించునోటు.
మ. భువనానందన? మిత్ర? చందనతరూకి? పొమ్మియరణ్యమ్మునం
దువసింపందగ; దిందసారహృదయుల్దుర్వంశజుల్నిష్ఠురు
ల్నివసింత్రంతట; వారలొండొరులసంనిర్ఘర్షజాగ్న్యర్చి, స
ర్వవనంబున్దహియింతురాత్మకులమాత్ర ధ్వంసకుల్గారుగా. ౩౬.
చ. గుణియుదమందునాత్మ గుణకోవిదుఁడించుక యిచ్చునేని; త
ద్గుణగణమూఢుఁ డిచ్చినను గోటిఁ, బ్రమోదము లేదు; గ్రామ్య వీ
క్షణమిరుఁగన్నులున్దెఱచి చక్కఁగఁజేయును జాణగాక; ప
ట్టణవధువక్షి కోణనిగిడంబునవశ్యునిఁజేయుఁ బూరుషున్. ౩౭,
క. తులువయను చిలువమరణము । గలిగించెడు విధము వింతగాఁగన నగు ని
య్యులఁ; గఱచు నొకని చెవియు । మ్ముల; నస్యుఁడు విడుచుఁబ్రాణములుదక్షణమే.

146 (సశేషము) ఆ- వ్యాసమూర్తిశాస్త్రి

రామచంద్రవిజయము. (౧౦౪-పుట శేషము.)

శోభ— కనకరత్నమా! ఈపిల్లవాఁడు మురుగులను విక్రయించవలెనని నాతో చెప్పినాఁడు. నీవు నాకు నమ్మకముగలవాఁడవును, మాకు మీకు చాలవ్యవహారము లుండుటచేతను నేను నీకు వర్తమానము నంపినాను. ఒక డబ్బుసొమ్మెక్కువ కమ్మవలెగాని తక్కువకమ్మవద్దు. మాకతఁడు కావలసినవాఁడు. బంధువులతో పని. హెచ్చుతగ్గేయయిన వచ్చినపక్షమున నాకు మాటదక్కదు. ఇది నీవ్యవహారముగా చూచుకోవలెను. వేఱే నేచెప్పనక్కఱలేదు.

కన— సరిసరి, తమరు నాతో సెలవియ్యవలెనా! ఇంతకాలమునుండి మీకు నేను వస్తువులు నమ్మకముగా నిచ్చుచున్నాను. ఎన్నఁడయిన దమ్మిడి దగ్గఱనయిన తేడా వచ్చినదా? మనుష్యునకు మాట నమ్మకముండవలెగాని ధనమా పోవనము? బోగనుది గణించగలను. తమవంటివారిదగ్గర మర్యాద కావలెనుగాని ఒకడబ్బిటయితేనేమి, అటయితేనేమి? ఏవీ? మురుగులు తియ్యండి.

అని కనకరత్నము చెప్పగానే శోభనాచలము రామచంద్రునిదగ్గరగా జరగివచ్చి అబ్బాయీ మురుగులు తీయనాయని యడుగ నతఁడు తీయుమని తలయూఁచి యూరకుండెను. చేతిని మురుగులు చిన్నతనములో చక్కగా నొక్కించుటచేత చేతులతో లాగినప్పుడు మురుగులు రాలేదు. తరువాత త్రాఁడ్లుపోసి వారు లాగుచుండఁగా, తల్లిదండ్రులు చిన్ననాఁడు తనకావస్తువు చేయించిపెట్టిన నాటికి నిప్పటికి తన యవస్థలో నెంత తారతమ్యము గల్గినదో తలంచుకొని, మురుగుల నమ్ముకొనుటచేతగాని తనకు భోజనము జరుగకున్నదని కొంచెము విచారించి రామచంద్రుఁడా దుఃఖమును పైకి రాకుండ దిగమ్రింగి బేరముఁ జూచుచుండెను. కనకరత్నమును మురుగులు తీసిన తరువాత కొన్ని రాళ్లు త్రాసులోవేసి మురుగులుతూచి కొంచెము నోరు చప్పరించెను. అప్పుడు వారిట్లుమాటాడిరి.

రామ— ఏమోయి! ఆలాగనుచున్నావు? ఎన్నితులము లౌతున్నవి?

కన— ఏమని మనవిచేయనండి? ప్రాతగుల్లలు. చూడఁగానే, నేనేమాత్రమో యుండుననుకొన్నాను. అబ్బే! మాయవస్తువులండీ. ఏకంసాలి చేసినాఁడండి? లాభము బాగుగా కొట్టినాఁడు. ఇవి రెండుతులములున్నవి. తులము పదునెన్మిదిరూపాయిలధర.

రామ— మా నాన్నగారు నమ్మకమయిన కంసాలిచేత చేయించినారు. అదిగాక యిది మేలిమిబంగారము. తులము పాతికరూపాయిలుధర. గీటురాయియేది?

కన— పిచ్చిమాట. ఎంతనమ్మకమున్నను కంసాలి తిన్నగాచేయునా? అదిగాక యివి వరహా వన్నెగాని మేలిమిగాదు. కావలసినయెడల నింక నెవరికయిన చూపించుకొనుడు. నేను గీటురాయి మఱచిపోయినాను.

శోభ— గీటురాయి యెందుకయ్యా? అతడు నాణెముకట్టునట్లు నూఁగ్రామమునం దెవ్వరును గట్టలేరు. ఒకవేళ పొగబాటువచ్చిన నతడు పారిపోవునా? నీవు పారిపోదువా? ఇచ్చినమట్టుకు సొమ్ము పుచ్చుకో. నిలకడమీదను చూచుకొనవచ్చును. పుష్యరాగములుకూడ విక్రయించవలెననియున్నదా?

రామ— అవి యిపుడు విక్రయించను. ఈ రూపాయి లయినతరువాతగాని, చూడను. అయితే, కనకరత్నము! నీవిపుడు రొక్కము నీయఁగలవా?

కన— "తత్క్షణము పుచ్చుకోండి. ముప్పదియైదు రూపాయిలు నాదగ్గర నున్నవి. తక్కినరూపాయి రేపుదయమున పంపించెదను." అని లెక్కపెట్టిసొమ్మిచ్చెను. రామచంద్రుఁడు సొమ్ముపుచ్చుకొని బొడ్డుకొంగున గట్టుకొనెను. అంతట శోభనాచలము నింటికి వెళ్లిపోయెను.

అపుడు రామచంద్రుఁడును శోభనాచలమును లోకాభిరామాయణమును చెప్పుకొనుచుండగా పాతికె సంవత్సరముల వయస్సుగల యొక కఱ్ఱవాఁడు, రెండు భుజములమీద కాయలు స్పష్టముగ గనుపడుచుండ, జుట్టును జుల్పములను, సన్నగ దువ్వి, చేతిలో నొక పేపబెత్తము బట్టుకొని, తలకు నుత్తరీయము కుచ్చువచ్చునట్టు చుట్టి, నోట నొకచుట్టను బెట్టుకొని కాల్చి గుప్పుగుప్పున పొగలువదలి చిన్నమేఘములను గల్పించుచు, చేతిలో గుప్పెడాకులును చెక్కలును బట్టుకొని, నాగరికతయంతయు తన మొగముననే తాండవమాడునట్లు లోపలికివచ్చెను. లోపలికివచ్చిన యీ మనుష్యుని చూడగనే శోభనాచలమున కొకవిధమయిన తొందరకలిగెను. వచ్చిన క్రొత్త మనుష్యుఁడు తన చంకక్రింద గుడ్డలో చుట్టబడియున్న చీట్లపేకనుదీసి సావడిమీఁద వేయగనే, శోభనాచలమునకు తొందర యెక్కువై, మొగము వెలవెలబాఱి, రామచంద్రుడు తనతో ప్రసంగవశమునఁ జెప్పుచున్న మాటలు వినబడకుండెను. అతడు వచ్చి కూర్చుండి చుట్ట కాల్చుకొనుచు, తమలపాకుల తొడిమలదీయుచు శోభనాచలమునకు లేశమయిన నిష్టములేకపోయినను నాతడుచేసిన కనుసంజ్ఞనైన చూడక మాటలాడ నారంభించెను. ఈతని పేరు నరసయ్య.

నర— "ఓరీ! శోభనాచలము! మనవాండ్రెవ్వరు రాలేదా? నీవుకూడ మొద్దులాగున కూరుచుంటివేమి? దొడ్డిలో చింతచెట్టుక్రింద చాపలు వేయించినావా? నీపద్ధతి జూడగా నీవేళ యిక్కడనే యాడుటకు నిశ్చయించినట్లున్నది. ఏమి! జెల్లముకొట్టినరాయిలాగున మాటడవేమిరా?

అని క్రొత్తమనుష్యుడిట్లు మాటలాడుచుండగా పంగనామములు పెట్టుకొని యింకొక బ్రాహ్మణుఁడువచ్చి కూరుచుండెను. శోభనాచలమాతనిజూడగనే "దయ

చేయండి: వెంకటరత్నముగారు" అని పలుకరింపగా వెంకటరత్నము మిక్కిలి తెలివి గలవాఁడును, ప్రపంచ వ్యవహారములందారి తేరినవాఁడును గావున, కడుమర్యాదగా కూరుచుండెనుగాని తమలపాకుల వేసికొనుచు మొదటవచ్చిన బ్రాహ్మణుఁడు వెంకట రత్నమును జూచి యిట్లు పలుకరించెను.

నర— ఏమిరో! వెంకటరత్నము! నీవుకూడ నింత యాలస్యము చేసినావేమి?

వెంక— ఈవేళ భోజనము ప్రొద్దుపోయినది. వైశాఖపూజ చేసినాము.

నర— ఇది చైత్రమాసముగదా వైశాఖపూజయేమిటి?

వెంక— ఏడ్చినావులే. నీవూరుకో. నీకేమియు తెలియదు.

నర— మీయింట వైశాఖపూజజరిగిన శరభరాజుగారు నాకు వర్తమానము పంపరు? మీయింట నేను రెండుకాళ్లు మంచినీళ్ళుమాత్రముపోసి వెళ్లిపోయినాను.

ఈప్రకారముగా మాటలాడుకొనుచుండగా మఱి నలుగురు మనుష్యులు తటాలున తలుపుతోసికొనివచ్చిరి. అందులో నొకఁడు శోభనాచలమునుజూచి "ఓరీ! పిల్ల కుదిరినదట. సోమావధానులు చూచివచ్చినాడు' అని చెప్పెను. అపుడు వెంకటరత్నము మొగము చిట్లించుకొని యాక్రొత్తమనుష్యునివైపుదిరిగి కండ్లుకొరికి మాటాడవద్దని సంజ్ఞజేసి "మనమందరము దొడ్డిలోనికి పోదముగాండి" యని వారి నందరిని వెంటబెట్టుకొని యవెనకే చింతక్రింద కమ్మకుట్టువాఁడు పఱచిన చాపలమీద కూరుచుండి చీట్లపేకనాడ నిశ్చయించిరి. శోభనాచల మాదినము రామచంద్రుఁడు వచ్చుటచేత నాటకువెళ్ళక గూరుచుండెను. మెడలో పిడికెడు యజ్ఞోపవీతము లుండుటచేత శోభనాచలమునకు వివాహమైనదని నమ్మియున్న రామచంద్రునకు నొకడువచ్చి పిల్ల కుదిరినదని చెప్పగానే శోభనాచలము చెప్పినమాటలయందును, వాని పెండ్లివిషయమందును, కొంచెము సందేహము గలుగుటయేగాక యతనియింటికి వచ్చి సంభాషించినవారి మాటలనుబట్టి వారందఱు వంటబ్రాహ్మణులు, నీళ్ళబ్రాహ్మణులు మఱి యితరమైన నీచులనికూడ ఆలోచనతోచి శోభనాచలము నడిగిచూడవలెనని బుద్ధిపుట్టెను. వారిట్లు మాటలాడిరి.

రామ— ఏమండీ! ఆ మొదటవచ్చినబ్రాహ్మణుఁడెవరు?

శోభ— (విని వినుపించుకొననట్లు మనస్సులో నేదో యాలోచించుచుండెను.)

రామ— ఏమండీ! ఆమనుష్యుడెవరండీ?

శోభ— ఈగ్రామమునందు నీళ్ళబ్రాహ్మణుడు. (అని మెల్లగాజెప్పెను.)

రామ— అతఁడు పరువుమర్యాద లెఱుగకుండ మాటలాడినాడేమి?

శోభ— ఏమిటో. చిన్నతనమునందు మేమిద్దఱము నొకబడిలోనే చదువు కొన్నాము. అప్పటి చనువుచేత నిప్పటికిని నన్నాలాగున నాతఁడు పిల్చుచుండును. స్నేహితులయెడ నాకంతపట్టింపులేదు.

రామ— పిల్లకుదిరినదని యొకమనుష్యుఁడన్నాఁడు. ఆపెండ్లియెవరికి?

శోభ— నాకు వివాహమనుకొన్నావా యేమి? మా పినతండ్రి కుమారునికి వివాహముకాలేదు. అతనివిషయమై పిల్లను వెదకబంపినాను.

రామ— ఇప్పుడు వారందరు దొడ్డిలో నేమిచేయుచున్నారు?

శోభ— పేకాట నాడుచున్నారు. నీవుగూడ నాడఁగలవా?

రామ— నాకు చేతగాదు. నేనాడఁదలంచుకొనను లేదు.

శోభ— ఆడిన తప్పులేదు. చేతగాకున్న నేర్చుకొనవచ్చును. డబ్బుపెట్టి యాడరు. ఒకవేళ సంతోషమునిమిత్తమాడినను తిరిగి గెలువరిడబ్బు వారికే యిచ్చివేయుదురు.

రామ— అటువంటి యాటను నేను నేర్చుకొనను.

అని యిద్దఱు ప్రసంగము చేయునపుడు లోపల పేకనాడుచు కొంచెము ధనము ఋణము కావలసి యొక స్నేహితుఁడు శోభనాచలమును వలకు పిలిచి ప్రస్తుత మాడుకొనుట కభ్యంతరము గల్గినదనియు తా నింటిదగ్గఱనుండి తెచ్చిన యిరువది యైదురూపాయిలు నోడిపోవుటచేత పదిరూపాయిలప్పు కావలెననియు చెప్పగా శోభనాచలము రామచంద్రునియొద్ద కాతనిఁ దీసికొనివచ్చి యాతఁడు మహాధనికుఁ డనియు, సంవత్సరమున కతనికి వేయిరూపాయిలు భూములమీఁదవచ్చుననియు జెప్పి తన నమ్మకముమీద పదిరూపాయిలు ఋణమిప్పించెను. అప్పుదీసికొనుచున్న యా మనుష్యుఁడు ధనవంతుఁడు గాకపోయినను,జూదరియు,నిర్భాగ్యుండును నైనను, శోభనాచలమున కతనియందుగల యభిమాన మతనివిషయమై యంత చక్కఁగా చెప్పనట్లు చేసినది. శోభనాచలముయొక్క మాటలనమ్మి రామచంద్రుఁడు తాను దిగుచున్న మహావిపత్సముద్రము నెఱుఁగకయే, కొంగునగట్టినసొమ్ము విప్పి బిళ్లకుడుములలాగున పదిరూకలు లెక్కపెట్టి చేతిలోబెట్టెను. రూపాయకు దినమున కొకయణావడ్డినిచ్చెద నని చెప్పి యతఁడు సొమ్మును పట్టుకొనిపోయెను. మఱి కొంతసేపటికి కామనుష్యుఁడే తిరిగివచ్చి మఱి యైదురూపాయిల నిమ్మని యడిగి పట్టుకొనిపోయెను. ఇప్పటికి రామచంద్రునియొద్ద నిరువదిరూపాయిలుమాత్రముండెను. శోభనాచలముగారి పెరటిలో జరుగుచున్న మహాద్యూతమునందు మొహరీలు, వరహాలు, రూపాయిలు, అణాలు, డబ్బులుగూడపందెములుగాబెట్టి, దారపుత్రాదులన్నవస్త్రములులేక మలమలమాడుచు,

నిత్యశివరాత్రులను నేకాదసులను సలుపుచున్నను దానిని లక్ష్యపెట్టక, యహోరాత్రములు వేదాంతులవలె బంగారమును చిల్లపెంకులవలె జూచుచు వినోద సముద్రమునందు మునిగి తేలుచున్న యనేక నలచక్రవర్తులును, ధర్మరాజులును, ఆ చింతచెట్టుక్రింద కొలువుఁదీర్చియుందురు.

వారందఱాదినమ ట్లనిచ్చన్నముగా జూదమాడుచున్న సమయమునందు వాకిట గూర్చుచున్న రామచంద్ర శోభనాచలముల కొకవిధమైన యల్లరి వినఁబడెను. అది వినఁబడినతోడనే శోభనాచలమునకు మనసుతాళకపోయినందున వెంటనే యరుగుమీది నుండి గుబుక్కున నేలకురికి లోపలికతడు పరుగెత్తుకొని పోవుచుండఁగా నీతని కెదురుగా పయిమీద బట్టలేక జుట్టుముడి విడిపోయి, వెక్కి వెక్కి యేడ్చుచు, కుచ్చెళ్ళ కొంగుతో కన్నీళ్ళు తుడుచుకొనుచు, నొకపిల్లవాడువచ్చెను. అతనిజూచి రామచంద్రుడుకూడ లేచి పిల్లవాని యెదుటకుఁబోయెను. అప్పుడాపిల్లవా డిట్లుచెప్ప నారంభించెను.

“అయ్యా! ఈసంగతి మీరు వినుండి. నేను వీధిలోనుండి మాయింటికిఁ బోవుచుండగా నీ కమ్మశెట్టివాడు నన్ను లోనికిఁ దీసికొనిపోయెను. వెంకటరత్నముగారు నన్నుఁగూడ చీట్లాడుమని బలవంతపెట్టిరి. ఒకటి రెండు పందెములయందు నన్ను గెలిపించి తరువాత నాచేతనున్న బంగారపు ముద్దుటుంగరమును పందెము పెట్టించిరి. నామీదనున్న జరీ యుత్తరీయమునుగూడ లాగుకొని నేనిమ్మని గట్టిగా నడిగినప్పుడు నన్ను వీరందఱు తిట్టి కొట్టినారు. ఇదిగో చఱుపులుచూడుండి. దెబ్బ లేలాగున నట్టలుకట్టియున్నవో. నేనిప్పుడు శరభరాజుగారియొద్దకుబోయి యీసంగతి జెప్పెదను. అని చెప్పుచున్న కుఱ్ఱవానిమాట కడ్డమువచ్చి నరసయ్య మహాకోపముతో నిట్లనియె.

నర — కారుకూతలు కుయ్యకు. చెప్పుదెబ్బలు తినగలవు. శరభరాజుగారితో చెప్పి తలగొట్టి మొలవేయించగలవాఁడేమి? నీదిక్కున్నచోట చెప్పుకో (అని శోభనాచలమువంకఁజూచి) ఈతఁ డుంగరమునుఁ బెట్టుకొనిరాలేదు. ఉత్తరీయము నేను పుచ్చుకొన్నమాట సత్యమే. నాదగ్గఱ రెండురూపాయిలప్పుదీసికొని నాలుగునెలలయినది. ఇంక నీయలేదు. అందుచేత బట్టలాగుకొన్నాను. ఇతడు రానులేదు. ఆడనులేదు. అంతయు నబద్ధమే.

ఇట్లిద్దరుచెప్పఁగనే విని శోభనాచలము తన స్నేహితులశక్తియు సాహసమును నెఱిఁగినవాఁడు గావున తప్పక వారాయుంగరము నపహరించియుందురని నిశ్చయించి శరభరాజుగారీసంగతి విన్నపక్షమున తనకు మాటవచ్చునని యేలాగైన నతనిసొమ్మతని

కిప్పించవలెనని నిశ్చయించుకొని బలవంతముగా రాని కోపమునుఁ దెచ్చుకొని యీప్రకారముగాఁ జెప్పెను.

శోభ— పుణ్యమునకుఁ బోఁగా పాపమెదురైనదట. స్నేహితులుగదాయని యూరకొనుటకు స్థలమిచ్చినందుకు దెబ్బలాటయును, కుడకు నష్టరములునా? నాయనా! నీసొమ్ము నాయింట బోయినందులకు నేనాదండుగ నిచ్చుకొందును. తెచ్చుకొన్నందుకు వచ్చినట్లనుభవింపవలెను. నాసొమ్మెందరు తినుచుండుటలేదు? అందులో నీవొకఁడవు. ఇంతమాత్రముతో నేమి చెడిపోను (అని రామచంద్రునివంకదిరిగి) అబ్బాయి! నీదగ్గరనున్న యిరువదిరూపాయిలు నాకు బదులియ్యగలవా? సాయంకాలము తిరిగి నీకు నిచ్చివేయుదును.

రామ— చిత్తము. పుచ్చుకొనుడు. అనిచెప్పి యాసొమ్మునంతయు నిచ్చెను. ముప్పదియైదు రూపాయిలు బదుళ్లక్రిందనే యిచ్చివేయుటచేత రామచంద్రునకు భారమంతయుఁ దగ్గి దేహము చులకనయ్యెను. ఆరూపాయిలు పుచ్చుకొని యాపిల్లవాఁడుత్తరీయమునుగూడ మరల నరసయ్యయొద్దనుండి పుచ్చుకొని యింటికిబోయెను. అప్పుడు సాయంకాలమగుటచే రామచంద్రుఁడు సంధ్యావందనమును జేసికొనుటకు చెరువునకుబోఁగా వెంకటరత్నమును, శోభనాచలమును వానిని వెంబడించిరి. వెంకటరత్నము చెరువుగట్టునయున్న నాకయింటఁ బ్రవేశించెను. శోభనాచలముమాత్రము చుట్టఁగాల్చుకొనుచు గట్టుమీదఁ గూరుచుండి రామచంద్రుని సాంధ్యకృత్యములయిన తరువాత నతనితోగలసి ప్రదోషకాలమున శివాలయమునకరిగి తానుమాత్రము వీధిలో నిలుచుండెను. రామచంద్రుడును లోపలికరిగి యాలయముచుట్టును మూడుప్రదక్షిణములుచేసి నందీశ్వరుని చెవులసందుననుండి ముందుగా నీశ్వరుని దర్శనముచేసి, గర్భగుడిఁ బ్రవేశించి తనకందకుండనున్న గంటనెగిరికొట్టి శివదర్శనముచేసి “వందేశంభుముమాపతిం” అను శ్లోకమును పఠించి పూజారియిచ్చిన రుద్రపాదముల నందుకొని మారేడుపత్రినంది తలనుంచి విభూతి మొగమునదాల్చి, కనుబొమలసందున నమ్మవారి కుంకుమను బొట్టుపెట్టుకొని యీశ్వరప్రసాదమునుఁ దినఁగూడదుగనుక కొబ్బరిముక్కల నక్కడనుంచి, కొంతసేపచట గూరుచుండి యింటికి శోభనాచలముతో గలసివచ్చునప్పటికి భోజనపువేళయయ్యెను.

తన యదృష్టముపుచ్చి రామచంద్రుఁడు వచ్చుటచేత తన కుమారునిచేత తగిలెడు దెబ్బలు తప్పినందునకు సంతోషించుచు, నల్లమందు లేకపోవుటచేత కాళ్లు లాగుచున్నందున, వంటమాత్రము చేసికొని శోభనాచలముతల్లి పరుండెను. శోభనాచలమువచ్చి తానే యన్నమువడ్డించి రామచంద్రునితో గలసి సుఖముగా భోజనముఁజేసెను

భోజనమగువఱకు వెంకటస్వామి వచ్చి సిద్ధముగానున్నందున శోభనాచలము వాని నక్కడనే పండుకొమ్మని సహాయార్థముంచుకొనెను. రాత్రి జామయినతరువాత రామచంద్రునికి నిద్రపట్టెను. కొంతసేపటికందఱు బుసకొట్టి నిద్రబోవుచుండిరిగాని వెంకటస్వామి మాత్ర మేకారణముననో నిద్రపట్టదయ్యెను. తరువాత రెండుజాముల వేళ నేలగొట్టినట్లు చప్పుడయ్యెను. ఏదో స్వప్నమువచ్చి మెలకువగలిగిన రామచంద్రు డాచప్పుడువిని ‘యెవరువారు’ అని కేకవేసెను. ఆకేకవేయగనె యాచప్పుడాగిపోయి మరల నొకరెండుగడియలయ్యెను. అప్పటికి రామచంద్రుడు గాఢముగా నిద్రించుచుండెను. అప్పుడొకదొంగ చప్పుడుగాకుండ మెల్లమెల్లగా నడుగులబెట్టుచు రామచంద్రునియొద్దకువచ్చి, తలపైపునగూర్చుండి తమ్మట్లదీసికొని దురాశచేత, శోభనాచలమునివరకే రూపాయిలన్నియు క్షౌరముచేసినాడన్నమాట నెఱుంగక, తలక్రిందిమూటలో నేమో యున్నదనకొని మెల్లగ మూటలాగెను. మూటలాగగనె తల భూమిమీదబడి టక్కున తగులుటవలన మెలకువవచ్చి రామచంద్రుడు తలయెత్తి చూచి ‘దొంగ, దొంగ’ యని కేకవేసెను. వెంటనే దొంగ మూటం బాఱవైచి యేమూలకో పాఱిపోయెను. రెండుమూడు పిలుపులు పిలిచినతరువాత శోభనాచలము లేచి దొంగలుపడినందుల కాశ్చర్యపడి దీపము వెలిగించి కత్తిపుచ్చుకొని యిల్లు నాల్గు మూలలు వెదకెనుగాని వానికెక్కడను దొంగ కనుపడడయ్యెను.

కమ్మకుట్టివాడుమాత్ర మీకేకలు వినబడక కాబోలు, చెమటపోయుచున్నను ముసుగుపెట్టుకొని పండుకొనెను. రామచంద్రుడొక్కడు పండుకొనుటకు భయము గలుగుటచేత, తాందలచినపని కొంచెమునయినదిగనుక శోభనాచలము రామచంద్రుని మీద నతిదయగలిగి దగ్గరగా పండుకొనెను. రూపాయిలు శోభనాచలము దగ్గర నుండుటచేతను తమ్మట్లు దొంగలెత్తుకొని పోవుటచేతను, రామచంద్రునకు భయపడ వలసిన యావశ్యకమంతయుం బోయి సుఖముగా నిద్రపట్టెను. కాని మధ్యమధ్య స్వప్నములు, పలవరింతలు, నాతని నిద్రకు నంతరాయములు గల్పించుచుండెను. ముసుగుల నమ్ముకొనుటచేత వచ్చినసొమ్ముతో కొంత కాలక్షేపము చేయవచ్చుననుధైర్యముచేత తమ్మట్లుపోయిన విచారమంతగా రామచంద్రున కగుపడలేదు. వయస్సునందు బాలుడయ్యు, తెలివితేటలందసమానుడయిన యాకమ్మకుట్టివాడే రామచంద్రుని తమ్మట్లు బాధపడలించిన సాహసవిక్రమార్కుండని చెప్పనక్కఱలేకయే మీరు తెలిసికొనవచ్చును. జూదరియు, వంచకుండును, ద్రోహియునగు నీ శోభనాచలము, రామచంద్రుని తండ్రియగు శ్రీరాములుగారి నెఱుంగకపోయినను నెఱింగినట్లు చెప్పి, నిరక్షరకుక్షియయ్యు కావ్యపంచకమువఱకు చదువుకొన్నట్లు చెప్పి, పరమనీచుడయ్యు

గొప్పవారికి బంధువుడనిచెప్పి, బ్రహ్మచారియయ్యు గృహస్థుడననిచెప్పి, మోసముచేసి, రామచంద్రుని తనయింటికి రప్పించుకొని చేయదలంచినపనియంతయుఁ జేసి సఫలమనోరథుఁడై యారాత్రి కమ్మవానిచేత దొంగతనము వేయించి, తమ్మంట్లు తానే యపహరించి మిగిలిన రాత్రియంతయు సుఖముగా నిద్రించెను. మద్దుల కనకరత్నమును శోభనాచలమున కేవిషయమునను దీసిపోనివాఁడే గనుక నేబదిరూపాయిల విలువగల మురుగులను ముప్పదియారు రూపాయిలకే దీసికొని యాదులో నొకరూపాయి నరువుపెట్టి తనచేతనయినంతవరకు దానును రామచంద్రుని వంచించెను. అందఱు నుదయమునందు లేచి కాల్యకృత్యముల నిర్వర్తించుకొనిరి.

మూఁడవ ప్రకరణము.

ప్రాతఃకాలమందు కాల్యకృత్యములు నిర్వర్తించుకొని విశ్వనాథశాస్త్రులవారి దర్శనము చేయుటకుఁ బోవలయునని రామచంద్రుడు శోభనాచలమునుగూడ రమ్మని యడుగ నతడు వచ్చుటకు వీలులేదనియు, శాస్త్రులవారు మిక్కిలి మంచివారనియు, స్వయముగానే వెళ్ళవచ్చుననియుఁ జెప్పి వారియింటికి మార్గమునుఁ జూపుటకు మాత్రము వెంకటస్వామికి జతయిచ్చెను. అతడును రామచంద్రుని వెంటఁబెట్టుకొని శాస్త్రులవారి యిల్లుచూపిపోయెను. విశ్వనాథశాస్త్రులవారియిల్లు రాజవీధిలోనున్నది. విశాలముగానున్న రెండువీధి యరుగులమీద తాటియాకులచాపలు వేయబడియున్నవి. ఆ చాపలమీద విశ్వనాథశాస్త్రులవారి విద్యార్థుల దమఁ గూరుచుండియుండిరి. అందులో కొందఱు తామిదివఱకుఁ జదువుకొన్న పాఠముల చింతనచేసికొనుచుండిరి. కొందఱు ముందు చెప్పకొనవలసిన పాఠములనుఁ జూచుకొనుచుండిరి కొందఱాకును, గంటమును, బుచ్చుకొని క్రొత్తపుస్తకములఁ జూచి ప్రతులవ్రాయుచుండిరి. ఉదయమునందె స్నానముఁ జేసి, విభూతి పెండెకట్లుఁ బెట్టుకొని, మొగలితట్టు సంస్థానమునం దస్తావధానముఁ జేసి నపుడు మహారాజుగారిచ్చిన పట్టుశాలువ మీదఁగప్పుకొని, బరువైన బంగరుకుండలములు చెవులను క్రిందకు దిగలాగుచుండ విశ్వనాథశాస్త్రులవారు గోడకుఁ జేరగిలఁబడి కొంచెము తలవంచి కన్నులకు సులోచనములు పెట్టుకొని ప్రాతదగుటచేత నక్షరము లగుపడకున్నందున శిష్యుఁడొకడు మధ్యమధ్య పత్రములకు కాకరపసరు వ్రాయుచుండ తాటియాకుల పుస్తకమొకటి చదువుచుండెను. శాస్త్రులవారి కిప్పటికి రమారమి యేబదిసంవత్సరము లున్నందున తల కొంచెము నెఱసియుండెను.

వివేకవిజయము. (౯౬-పుట శేషము.)

చిఱుప్రాయములోని యనాథకాంతలు మనస్సులలో విస్మయ సంభ్రమ సంతోషములు సందడింపఁగా పునర్వివాహముచేసికొన్న వారినిగూర్చియు చేయించినవారినిగూర్చియు లోలోనపొగడుచున్నను పైకి తెగడుచుండిరి. లేఁబ్రాయముననున్న వితంతువులు తోఁబుట్టువులుగాఁగల సోదరులుగాని, అట్టివారు పుత్రికలుగాఁగల జనకులుగాని, ఈ నూతనాచార మవశ్యాచరణీయమని తమతో నెవ్వరైన వాదించినప్పుడు, తమ కుటుంబస్థితిని మఱచి, ఔ నౌనని తలలూఁచుచువచ్చిరి. ఆంగ్లేయ విద్యాభ్యాసముచేయుచు యుక్తాయుక్త విచారముచేయనేర్చుకొన్న విద్యార్థిసంఘములకు వారగోష్ఠియందును, సాయంకాల సల్లాపములందును, నెలపుదినములందును, ఇదియే వివాదాంశముగా నుండెను.

రామారావు చంద్రశేఖరశాస్త్రికనఁబఱిచిన సంస్కరణదీక్షను సదుద్దేశమును బట్టి యాతనిం బ్రోత్సాహపఱిచినచో నాతఁడు వితంతువును వివాహముచేసికోవచ్చునని యోచించి, కార్యము కొనసాగుటకాతఁడు సుగుణవతియు విద్యావతియునైన వితంతువు దొరకుటయొక్కటియే యొక ప్రతిబంధముగాఁ జెప్పినందున, ముందా ప్రతిబంధమును తొలఁగించి పిమ్మట ఆతనివద్దకుఁబోయి యాతనికిఁ బ్రోత్సాహము కలిగించవచ్చునని, పిల్లకొఱకాలోచించుచుండెను. అంతట తన స్నేహితుఁడైన దక్షిణామూర్తి చెల్లెలిమాట జ్ఞప్తికిరాఁగా, ఆతఁడు సంస్కరణవాది యగుటచే ధైర్యముతెచ్చుకొని, ఆతనిఁ జూచుటకు వెళ్లినప్పటికి, పదియడుగులదూరమున నాతఁడును తడి యంగవస్త్రమును శిరముపైని వేసికొని, చేతనున్న విసనకఱ్ఱ నెండకడ్డముగాఁ బెట్టుకొని మెల్లమెల్లగా నడుగులిడుచు కొట్టుతలుపు తీయుటకయి వచ్చుచుండెను.

దక్షిణామూర్తి స్థూలకాయముగలవాఁడు. ముఖము గుండ్రనిదై దూరదృష్టికందముగానే యుండును; కాని నేత్రములు ముఖమునకుఁ దగిన పరిమాణముగలవి గాకపోవుటచేతను, పెదవులు చిన్నవిగానుండుటచేతను, సమీపదృష్టి కాతనిముఖము సుందరమైనదని చెప్పుటకుఁ దగిన లక్షణములు కనఁబడవు. అయినను చెవులనున్న మంచిముత్యములు చుట్టఁబడిన తమ్మంట్లును, నల్లని యుంగరపు వెండ్రుకలును, చామనచాయతో నొప్పు వదనమునకందమును దెచ్చుచున్నవి. ఆతఁడు కొట్టుతలుపుతీసిన పిమ్మట మిత్రులిద్దఱు నిట్లు సంభాషణ మొదలుపెట్టిరి.

"ఏమోయి! రామారావు! విశేషములేమి?"

"ఏమియులేవు. ఉదయమునుండియు నీవేమి చదివినావు?"

"ఆదివారమువచ్చినప్పుడు చదువవలెనని యెన్ని ప్రయత్నములుచేసినను, ఎవరో యొకరువచ్చి మాటలు మొదలుపెట్టుదురు. మా ప్రవేశపరీక్ష తరగతిలోనివాఁడొకఁడుదయముననేవచ్చి సంస్కారపక్షమువారు బయలుదేఱి దేశమును పాడుచేయు

చున్నారని నిందింప మొదలుపెట్టఁగా, ఆతనితో వాదించి యిప్పుడే భోజనమునకుఁ బోయి వచ్చినాను. నీవేమి—"

"ఇదేమో చూచుటకు చిత్రముగుచున్నదే! ఎక్కడఁ జూచినను పునర్వివాహ ప్రశంసయే. భోజనము చేయుచున్నప్పుడు నివియేమాటలు. అక్కడనుండి మీకొట్టు దగ్గఱకు వచ్చుచుండఁగా నెవ్వరో యీవిషయమునే మాటలాడుకొనుచున్నారు."

"నీచేతిలోని కాగితమేమిటి?"

"నీకుఁ జూపవలెననుకొని మఱచిపోయినాను. ఇదియొక పూర్వనాగరిక పక్షమున వాదించు వార్తాపత్రిక. దేశమును బాగుచేయవలెనన్నయెడల బాల్యవివాహములు మాన్పిన బాగుగానుండునుగాని మహనీయులైన పెద్దలు నిషేధించిన స్త్రీపునర్వివాహమును చేయఁగూడదని యిందొక లేఖయున్నది."

"బాల్యవివాహములుకూడవని బోధించి వానిని మాన్పకుండ నెవ్వరైనఁదల్లేఖకు నడ్డుపెట్టినారా? దేశాభివృద్ధికున్న మార్గములలో నది యొక్కటియని మనము సంగీకరింతుముగదా! వితంతువివాహములు కూడవనుపట్టేమి? ఆతనికే వెట్టి యొకవితంతు పుత్రియున్నచో కుదిరిపోను."

"ఏమో మనమాలాగున ననుకొందుము గాని వితంతుపుత్రికలున్నవారెందఱు లేరు? ఆ యనాథపుత్రికలకు పునర్వివాహము చేయవలెనని వారితండ్రుల కేమైనఁ దెలియుచున్నదా? ఇంతేల? సంస్కారము ముఖ్యముగా జరుగవలెనను నిశ్చితాభిప్రాయమున్నప్పటికిని, వితంతువులైన తమ యక్కచెల్లెండ్రకును, కొమార్తెలకును, వివాహము చేయుటకు సాహసింపలేనివారెందఱున్నారు కారు? ఏదీ! తాను మనఃపూర్తిగా నుచితమని నమ్మినదాని నాచరణమందుంచువానినొక్కనినిప్పటివిద్యాధికులలోఁ జూపుము?"

(తలయూచుచు) "ఔనౌను. నీవు చెప్పినది సత్యము. ఎక్కడికో పోనేల? నామాటచూడుము. మా మాణిక్యమునకు పూర్తిగా పదునెనిమిదేండ్లైనను లేవు. అది చక్కగా చదువుకొన్నది. గిట్టనివారుకూడ దానియోగ్యత నెంతో మెచ్చుకొందురు. పునర్వివాహము చేసిన బాగుండునని నాకెంతోయున్నది. కాని నేనేమి చేయఁగలను? స్వతంత్రుఁడనుగానుగదా! ఇంతకును దానికట్టిబుద్ధి పుట్టించుటకెట్లు సాధ్యమగును?"

"నేను నీమాట చెప్పలేదు. ఒకరి పోష్యవర్గములోనున్న మనబోటివారేమి చేయఁగలరు? అయినను పునర్వివాహోపన్యాసములఁ గొన్నిటిని మీ మాణిక్యమునకు పంపించినయెడల బాగుగానుండునని నాకుఁ దోఁచుచున్నది.'

"నేనిదివఱకే ఆ యాలోచనఁ జేసినాను. మాయక్కచూచినయెడల నన్నును మాణిక్యమునుగూడ చీవాట్లుపెట్టునుగనుక, ఆ యుపన్యాసముల నిప్పుడు పంపుటకు

వీలులేను. క్రిందటి సెలవుదినములలో బెజవాడకు వెళ్లినప్పుడు వెనుకటి యుపన్యాస మొకటి తీసికొనిపోయి, దానికిచ్చివచ్చినాను."

వీరిద్దఱు నిట్లు మాటాడుకొనుచుండఁగా దక్షిణామూర్తికొక యుత్తరమువచ్చినది. పయివిలాసమునుబట్టి యది మాణిక్యాంబ వ్రాసినదేయని యూహించి, దక్షిణామూర్తి దాని పైకోశమువిప్పి, తనలో నీ క్రిందిరీతిని జదువుకొనెను.

"విజయవాడ, ౩౧ వ మార్చి ౧౮౮౭.

"ప్రియసోదరుఁడా!

నీవు నానిమిత్తము కొనితెచ్చియిచ్చిన పుస్తకము మొన్నటిదినమున అక్కగారి కంటఁబడినది. దానినిజదివిచూచి, ఆమె నన్నాడిన నిష్ఠురోక్తులు తలఁచుకొన్నప్పుడు నాశరీరము కంపమెత్తుచున్నది.—'పుట్టుకతోడనే చింతనిప్పలు పూజచేసి పుట్టినావు. నీకీపాడుబుద్ధులేమి?" — అనుచు నాపై నెటికలువిఱిచి, చెల్లెలనను వాత్సల్యమైన లేక, నన్ను తూలనాడుట కామెకు నోరెట్లాడెనో! పిమ్మట దానిని నిన్నటిదినమున అన్నగారును నాన్నగారును నాయెదుటనే నిప్పలపాలుచేసి నిన్నును నన్నునుకూడ తెగఁబడి తిట్టినారు. నాలో నేనిట్లుశోకించుచు, దుఃఖము పట్టఁజాలక నీకొకలేఖను వ్రాసి నా దుఃఖము వెళ్ళఁబోసికొన్నయెడల కొంతదుఃఖము శమించునేమోయని వ్రాయ సిద్ధపడితినిగాని కలముసాగక మానివేయవలసినదాననై యీదినమున వ్రాసితిని.

"అన్నయ్యా! నేను బ్రతికియుండియు చచ్చియున్నదానను. ఉదయమున లేచునప్పుడు దినమధ్యమున నొక క్షణమైనను సుఖపడఁగలనన్న యాశ నాకు కలలోనివార్తగదా! ఎట్లో మొండికెత్తి ప్రొద్దుపుచ్చుచుండఁగా సాయంకాలమువచ్చి నా మనోవేదన నెక్కువచేసి కన్నులు మూఁతపడనియ్యదుగదా! ఎట్టకేలకు కనుమోడ్చి నిద్రాపరవశతవలన దుఃఖము మఱచిపోయియున్న నా యదృష్టమున కసూయఁజెందినట్లుదయమువచ్చి నా శోకమునకుఁ బునర్జీవము పోయుచున్నది. సోదరుఁడా! ఇట్టి దుఃఖములననుభవించుచు నేను జీవించి యేమిప్రయోజనము? ప్రాణహత్యచేసికొందునా? హా! ప్రాణమన్న నెంతతీపి? ఓ నిర్భాగ్యహృదయమా! నీకీజీవితాశయెందుకు? సోదరుఁడా! భగవంతుఁడు దయామయుఁడును, దీనబంధువునని వినియున్నానే! నాయెడల నిట్టి కాఠిన్యమేల పూనెనో! నేను నిష్కారణముగా భగవద్దూషణ చేయుచున్నాను! ఆలోచించిచూడఁగా నా దుర్దశ మనుష్యకృతమేకాని భగవత్కృతము కానట్లు తోఁచుచున్నది. దుఃఖసాగరముననున్న నీచెల్లెలిని గట్టుచేర్పుము.— మాణిక్యాంబ."

ఈ యుత్తరమును జదువుకొని దక్షిణామూర్తి కన్నీళ్లోడ్చుచుండుటఁజూచి, రామారావు తొట్రుపాటుతో,

"ఏమిసంగతి? విజయవాడలో మీవారందఱును సుఖముగానున్నారా?" అని యడిగెను.

దక్షి— (కన్నీళ్ళు తుడిచికొనుచు) మఱి యేమియులేదు. (అని యుత్తరము నాతనిచేతి కిచ్చుచున్నాఁడు.)

దానిం జదువుకొని రామారావును కన్నీరుపెట్టుచుకొంత తడవుండి,

"దుఃఖసమయముననే ధైర్యము తెచ్చుకోవలెను. విపత్తులువచ్చినప్పుడు వాని నివారణమునకుఁ దగిన ప్రయత్నముల నాలోచించి ధైర్యముతోఁ బనిచేయుట పురుష లక్షణము. ఇప్పుడు మాణిక్యాంబ యిట్లు కష్టపడుచున్నను, ముందామెను నీ సంరక్షణములోనే యుంచుకొని నీవు సుఖపెట్టవచ్చును" అని దక్షిణామూర్తి నూఱడించెను.

దక్షి— నాతోఁబుట్టువిట్టి దుర్దశలోనుండఁగా చూచి యూరకుండఁజాలను. నేను వెంటనే దానికి దుఃఖోపశమనోపాయముచూడక నీవుచెప్పినది విని జాగు చేసితినేని, అది యెప్పుడో ప్రాణత్యాగముచేసికోక మానదు. కాఁబట్టి దానికి తప్పక నేను పునర్వివాహము చేయించెదను.

"మిత్రుఁడా! నీవు తొందరపడకుము. వివాహము చేయించుటకు నీ కెట్లు సాధ్యమగును?"

"సాధ్యముకాకేమి? దేనినైన చేయవలెనన్న యిచ్ఛ మనయందెప్పుడుండునో దానికి మార్గములును అప్పుడే కుదురును. దానికత్తవారుపెట్టిన నగలలో నాన్నగారు వ్యాజ్యముల నిమిత్తము కర్చుపెట్టినవిపోఁగా నింకను వేయిరూపాయల నగలున్నవి. ఆ ధనమును కర్చుపెట్టి వివాహముచేసి నేనుగూడ దానితోనే యుండెదను."

"నేను సొమ్ముమాట చెప్పలేదు. ఆమె పెండ్లిచేసికొనునెడ మీనాన్నగారు గెలిచిన భూములు మరల నామె మఱదిగారికి వెళ్ళునుగనుక, మీనాన్నగా రామెను పెండ్లిచేసికోనియ్యరు. నీవైనను, ఆయన కెదురుచెప్పలేవు. తొందరపడనేల!"

"దానినంత దుఃఖము పాలుచేసి నాయనగారు సుఖపడనున్నదేమి? ఆయనను సుఖపెట్టుటకు మా అన్నగారేమైనాఁడు? నేనేమైనాను? నాయనగారికి నేనెదురు చెప్పలేకపోయినను, ఇట్టిసమయములో నెదురుచెప్పుట నాకు విధిగనుక, అట్లుచేయుటకు నేను సాహసించెదను."

"అయినను తొందరపడఁగూడదు. ఆలోచించి మఱి చేయుము. ముందుమాట, తగిన వరుఁడు దొరకుటయేకష్టము. ఆమె చదువునకును, బుద్ధికుశలతకును, సుశీలమునకును, సౌందర్యమునకును దగిన వరుఁడు దొరకినప్పుడే యామె సుఖపడఁగలుగును గాని, యెన్నాళ్ళకును పెండ్లికాక ధనమునకును భార్యకును మొగమువాచియున్న

ధనాశాపరుఁడయిన రోమ బ్రహ్మచారికో కట్టిపెట్టినయెడల, ఆమెకేమి సుఖముండును? మనకేమిసుఖముండును? ఇంతకు నామెకు పునర్వివాహమందిచ్ఛయున్న ట్లీయుత్తరమందు స్పష్టమైన యాధారములేమున్నవి?"

"ఈకడపటిరెండువాక్యములును, ఉత్తరముయొక్క సరణియు దానికట్టియుద్దేశమున్నట్లు తెలియఁ జేయుచుండలేదా? ఆభయములేదుగాని నీవు చెప్పినదే గొప్ప బాధకము. తగినవరులెవ్వరైన నున్నారా?"

రామారావు మౌనముదాల్చి యూరకుండెను. పెరటిచెట్టు మందునకు రాదు గనుక, చంద్రశేఖరునిపేరు దక్షిణామూర్తికి జ్ఞప్తికిరాక, "ఆతఁడు పనికివచ్చునా, ఈతఁడంగీకరించునా, ఏపత్రికలోనైన ప్రకటనచేయుదమా" అని రామారావును ప్రశ్నలువేయఁజొచ్చెను. తుదకు రామారావు,

"మనయూరివాఁడెవ్వరైన దొరకినయెడల, బాగుగానుండును" అని చంద్రశేఖరశాస్త్రి యాతన్ని తలఁపునకు వచ్చునేమోయని చూచెను.

దక్షి— మనయూరిలో నంతమాత్రపు మంచియూహలున్నవారెవరున్నారు?

రామా— ఎవ్వరైన దొరకినయెడల ననుకూలముగానుండును.

దక్షి— ఆహా! నాకెంతమఱపువచ్చినది! ఎంతదూరమాలోచించినను చంద్రశేఖరశాస్త్రిమాట జ్ఞప్తికేవచ్చినదికాదు. ఆతఁడిందు కొప్పుకొనునని నీకుతోఁచునా? వ్యాఘ్రావధానులుగారాతని కెక్కడనో గొప్పసంబంధమునుయోచించుచున్నారఁటే!

రామా— ఏమో! ఆతఁడొప్పుకొనునో లేదో! అతని తండ్రివరుస నీవెఱిఁగినదేకదా? ఆయన నీవన్నట్లు గొప్పసంబంధము విచారించుచుండఁగా, ఆయనమాటకు వ్యతిరేకముచేసి వితంతువును వివాహముచేసికొనుట కతఁడంగీకరించునో లేదో! అయినను—

దక్షి— ఆతఁడు తప్పక అంగీకరించుననియే నాకు తోఁచుచున్నది. మన కళాశాలలోఁ జదువుచున్నవారిలో నాతనివలె సంస్కరణదీక్షగల వాఁడిదివఱకు మనకు కనఁబడలేదు. అటువంటివాఁడు తానుపదేశించెడువాక్యముల నాచరణమందుంచవలసిన సమయమువచ్చినప్పుడు వెనుకఁదీయునా?

రామా— ఇటువంటి ప్రతిజ్ఞలుచేసిన వారినెందఱిని చూచినాముకాము?

దక్షి— నీకును ఆతనికిని స్నేహమధికము. మీరిద్దఱు నొకతరగతిలోనివారు. నీవుచెప్పినదాని కాతఁడెదురుచెప్పఁడు. కాఁబట్టి నీవేలాగుననైన ప్రయత్నముచేసి యాతని నొప్పింపవలెను.

రామా— నాశక్తివంచనచేయక ప్రయత్నముచేసెదను.

మూడవ ప్రకరణము.

"పదిమంది చదువుకొన్నవారు కలిసి పునర్వివాహములు మొదలుపెట్టినయెడల మనము వారితో కలియవచ్చునని రామారావు నాతోఁ జెప్పినాఁడు. దేశాచారమునకు విరుద్ధముగా నున్న కార్యములను జేయుటకుఁగాని, చేసినవానికి తోడుపడుటకుఁగాని, ఒక్కసారి పదిమంది యెట్లువత్తురు? చదువుకొన్నవారన్నమాటేకాని, ఇంటివద్ద మూఢురాలైన యే ముసలమ్మయో కాటికికాళ్ళుచాపుకొని మృత్యుదేవత కభిముఖుఁడై కూరుచున్న యే మూఢకాంతాపుత్రుఁడో కోపగించునని భయపడి కొందఱును, వెలిపడి కష్టములుపడవలసీ వచ్చునని కొందఱును, జనులు హీనముగాఁ జూతురని కొందఱును కార్యముయొక్క ఘనతనాలోచింపక ప్రతిసత్కార్యమునకును వెనుకఁ దీయుదురు. ఇట్టి పిఱికిచదువు చదువుకొన్న యయ్యలే సంస్కరణపక్షమున సాహసింపఁ గలిగినచో, పర్వతములు సముద్రములందు తేలవా? పదిమందిచేయుచున్న పనిని చేయుటకు అందఱును సిద్ధపడుదురు. అందుకు నేను కావలెనా? ఇంతేకాక కష్టములోనున్నవారికి సాహాయ్యముచేసెడు పుణ్యాత్ములును, పరోపకారమునకు పాటుపడెడు ధన్యులును, దేశమునం దెందఱున్నారుకారు? వారినిఁ జూచి నాజన్మమెత్తిన తరువాత నేనెుక్క పుణ్యకార్యమైనను చేయఁగలిగితినా? ఎప్పుడో పదిమందితో చేయుదునన్నమాట వట్టి కల్ల. ఇంతకును ఏకార్యమునుజేసినను దానియోగ్యతను బట్టియే చేయవలెనుగాని, పదిమంది చేయుచున్నారను హేతువును పురస్కరించుకొని చేయఁగోరుట కేవలావివేకము. ఓ యీశ్వరుఁడా! ధర్మమని నమ్మిన కార్యమును చేయుటకు నేను సాహసింపలేనేని, నీభక్తుఁడనని నేననుదినమును జేయు ప్రార్థనలు వట్టి బూటకములేకదా! అక్కటా నేను ధర్మమని యెఱిఁగినదానిని చేయలేకున్నాను. ఇఁక నాబ్రతుకెందుకు? సర్వకార్యసిద్ధులును నాప్రయత్నములలోనేయున్నవి. అట్లుండఁగా నాకు నిజమైన యీశ్వరభక్తియే యున్నయెడల నేనిట్లాలోచింపవలసినదా? కాదు. దేనినైనను చేయవలెనని యిచ్ఛయున్నప్పుడు, దాని నిర్వహించుటకు మార్గములవియే యేర్పడును. నేనుతప్పక వితంతువివాహమే చేసికొనెదను. నేనా? పునర్వివాహమంతటి ఘనకార్యమా? అవును. నేనేల యారంభింపరాదు? దేశమును వృద్ధికితెచ్చిన ఘనకార్యములన్నియు మొదట ఒకొక్కరితోనే యారంభమైనవికావా? నిశ్చితబుద్ధిగలవాఁడేమిచేసినను చేయఁగలుగును. అట్టి దృఢనిశ్చయునే విజయలక్ష్మియెప్పుడు నాశ్రయించియుండును. ఇతరులెందఱేమనుకొన్ననేమి? నేనువితంతువునుతప్పకవివాహమాడెదనని నా మనోనిశ్చయమును మా నాయనగారి కిప్పుడే ఉత్తరమువ్రాసివేసెదను."

చంద్రశేఖరశాస్త్రి రామారావునువిడిచి యింటికివచ్చులోపల నిట్లు తనలో తాననుకొనుచుండెను; కొట్టువద్దికి వచ్చునప్పటికి తండ్రిగారి కుత్తరము వ్రాయవలెనను నిచ్ఛ ప్రబలముగానుండెను. తలుపుతీసి కాగితమును కలమును సిద్ధముచేసి, సిరాబుడ్డి కనఁబడక కొన్ని నిమిషములు వెదకి దొరకినవెనుక కొంత సంశయించి మరల నిట్లు వితర్కింపసాగెను.

“వితంతువును వివాహము చేసికొన్నయెడల, నాతోడి విద్యార్థులలో పూర్వ నాగరికులు నన్నెగతాళిచేయ మొదలుపెట్టుదురు; ఎప్పుడైన నా స్వగ్రామమునకుఁ బోయినయెడల, నేనింగ్లీషు చదువుకొనుచున్నానని యసూయపడుచున్నవారు చంకలు వైచికొనుచు, ‘మీసమాజము బాగుగానున్నదా? విధవావివాహము లవిచ్ఛిన్నముగా జరగుచున్నవా?’ అని నన్ను హేళనముచేయుదురు; తుదకు పసులకాపరి కుఱ్ఱవాండ్రు కూడ నన్ను నిందించుచు మాటలాడుకొందురు. ఇప్పుడు చేసికొనుటకంటె, ఒకటి రెండుసంవత్సరములు వివాహముచేసికోక ఆగినయెడల, ఈలోఁగా జనాభిప్రాయము మాఱిపోవును. అప్పుడు చేసికొన్నచో నెవ్వరు నెగతాళిచేయువారుండరు. కాలము కొంతమాఱువఱకును నేను తొందరపడుట మంచిదికాదు.’

ఇట్లు పూర్వముపుట్టిన యుత్సాహము, మబ్బులచేఁ గప్పఁబడు బాలసూర్యుని వలెఁ గొంతసేపు మఱుఁగుపడెను. ఈక్రొత్తనిశ్చయమునకైనను ఆతనిమనస్సు స్థిరపడక, డోలాయమానమై యుయ్యాలవలె ముందుకును వెనుకకునూగులాడఁజొచ్చెను. అంతట, “జనాభిప్రాయము నేననుకొనినంత త్వరలో మాఱునా? వెనుక నెప్పుడో నూఱులకొలఁదిసంవత్సరములక్రిందట నిలిచిపోయిన పునర్వివాహ సదాచారమునకు, రెండుసంవత్సరముల యల్పకాలములో జనులందఱును సమ్మతించునంతటి జనప్రీతి యెట్లుకలుగును? ఆరంభమున జననిందకు వెఱవక కష్టములకోర్చి సత్కార్యధైర్యమును పూని బహుసంవత్సరము లనేకులీయాచారము నవలంబించినఁగాని బహుజనాదరణము కలుగదు. నావలెనే యందఱును వెనుకఁదీయుచున్నప్పుడు జనాభిప్రాయము పునర్వివాహపక్షమునకు మాఱుటెట్లు సంభవించును? మాఱుటకేమి? ఇదివఱకు కొన్ని వివాహములు జరగలేదా? వితంతువివాహములనుగూర్చి అందఱు నాలోచించుచున్నారుకదా. ఈ యాచారము లేకపోవుటచేత వచ్చుచున్న నష్టములు వారికితోఁచి వారే దీని నవలంబించవచ్చును. మనమెఱుఁగకయే కాలమహిమవలన నెన్నిమార్పులు జరుగుచున్నవికావు? (కొంచెమాలోచించి) నేనిప్పుడేమన్నాను? కాలమహిమవలన జనాభిప్రాయము మాఱవచ్చునా? ఏమినావెఱ్ఱి! మంచిచెడ్డలనెఱిఁగిన సచేతనుఁడనైన నేను మార్పుచేయలేక పిఱికిపందనై యూరకున్నానుగాని, నిర్జీవమైనకాలమా

మార్పు చేయునది? నా యవివేకమునకును పిఱికితనమునకును సిగ్గుపడ నూరకుండక, దానిని కప్పిపుచ్చుట కెంత పరిహాసాస్పదమైన మిష నాలోచించితిని! ఇట్లేకదా సంస్కారములకు తోడుపడుట తమధర్మమని యెఱింగియు పలువురు తమ దుర్బలత్వమును కప్పిపుచ్చుటకు, వివేకులు నవ్వుదురను సిగ్గువిడిచి, హేత్వాభాసముల కల్పించుకొని తమ మనస్సాక్షి నోరుమూయఁ జూచుచున్నారు! (క్షణమూరకుండి) ఒకవేళ వారిమాటలే నిజమేమో! ఆకురాలు కాలముపోయిన వెనుక వసంతఋతువువచ్చి మోడువడియున్న చెట్లను చిగురుటాకులతోను, పుష్పములతోను, అలంకరించుచున్నది. కాదా! అయ్యో! వారినూరక నిందించితినే. ఔను; కాలమందెంతయైన సమర్థత యున్నది. ప్రస్తుతము వివాహమును మాని కొంతకాలమువఱకు నుండుటయే యుచితము. (మఱికొంత యాలోచించి) 'అయ్యో! కాలము మార్పులు చేయుననఁగా నర్థమేమి' అని నా మనస్సాక్షి ప్రశ్నవేయుచున్నదే. 'వసంతఋతువు చెట్ల నలంకరించుచున్నదనుట యాలంకారికము, దానికేమైన నవయవము లున్నదా? ఔరా! నేనెంత తప్పుదలఁచితిని! ఒకఋతువునకు నింకొకఋతువునకును ఉండు భేదములు సూర్యోష్ణాదులందును, గాలియందును, ఉండును గనుక వసంతఋతువునందలి యుష్ణమును బట్టియు వాయువును బట్టియు నింక నితరకారణములను బట్టియు చెట్లు చిగుర్చును. అంతియకాని దేశాచారములలో శ్రేయోదాయకములైన మార్పులు కలిగించు సాధనము లెక్కడనున్నవి? శిశిరఋతువు కడచినవెనుక వసంతఋతువునందు పంచభూతములలోను కలిగిన మార్పులవలె, దేశాభిమానులు కష్టనిష్ఠురములకోర్చి జనాభిప్రాయ విరుద్ధముగానున్నను శ్రేయోదాయకములైన యాచారముల నీశ్వరముఖమును జూచి యవలంబించి నడిపించి జనుల యభిప్రాయములలో మార్పులు పుట్టించినప్పుడే, మోడులైన చెట్లు చిగిరించినట్లు, అధమస్థితిలోనున్న దేశమున్నతస్థితికి రాఁగలదు. నాకేదైన వ్యాధివచ్చినప్పుడు దానిని కాలమే కుదుర్చునని యూరకుండక, దానిని మాన్పుకొనుట కెన్నియత్నములు చేసికొనుచున్నాను? దేశాచారములు హీనదశకువచ్చి యనర్థదాయకములైనప్పుడు, వానికిఁదగు చికిత్స చేయవలసిన విధి నాయందుండఁగా నేనిట్టి వ్యర్థహేతువులను కల్పించుకొని తప్పించుకొనఁజూచుచు నెట్లీశ్వరద్రోహమున కొడిగట్టుచున్నాను! కాలమహిమవలన గోడ చవుడుఱికి రాలిపోవుచున్నప్పుడు, యజమానుఁడు కాలమే బాగుచేయునని యూరకుండునా? ఆతఁడప్పుడు వ్యయమగునని సంకోచింపక దానికండలు వేయించినప్పుడే యది నిలుచునుగాని, లేకున్నచో నది కూలిపోదా? హిందూసంఘకుడ్యము హీనదశయందుండి దురాచార నిర్ఘాతములచే అండలుకూలి పడి పోవుచుండఁగా, ఉపేక్షచేసి యూరకుండుటకై నేనీరీతిని హేతువుల నాలోచించుచున్నానుగదా!

(సశేషము) గోటేటి - కనకరాజు.

రాజమహేంద్రవరములోని శ్రీవివేకవర్ధనీ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

	రు. అ. పై.
నీతిచంద్రిక, విగ్రహము (హితోపదేశము ననుసరించి కఠినశైలిని వ్రాయఁబడిన కావ్యము.)	౧- ౨- ౦
నీతిచంద్రిక, సంధి- (విగ్రహముయొక్క తరువాతి భాగమయిన వచనకావ్యము.)	౦- ౬- ౬
రాజశేఖరచరిత్రము-	౧- ౨- ౦
సత్యరాజాపూర్వదేశయాత్రలు, మొదటిభాగము- ...	౦- ౬- ౬
సత్యరాజాపూర్వదేశయాత్రలు- రెండవభాగము.	౦- ౬- ౬
అభిజ్ఞానశాకుంతలము- (కాళిదాసునినాటకమునకు తెలుఁగు) ...	౦-౧౩- ౦
రత్నావళి- (శ్రీహర్షదేవవిరచితమయిన సంస్కృతనాటకమునకు తెలుఁగు)	౦- ౬- ౬
మాళవికాగ్నిమిత్రము- (కాళిదాసప్రణీతమైన నాటకమునకు తెలుఁగు)	౦- ౬- ౬
ప్రబోధచంద్రోదయము-(కృష్ణమిశ్రవిరచిత సంస్కృతనాటకమునకు తెలుఁగు)	౦- ౮- ౬
రాగమంజరి- (ఇంగ్లీషుననుసరించి తెలిఁగిరిపఁబడినచిత్రమైన నాటకము)	౦- ౮- ౬
కల్యాణకల్పవల్లి (౨౦౦ పుటలుగలమిక్కిలిరమ్యమయిన నాటకము)	౦- ౯- ౦
ప్రహ్లాదనాటకము- (భక్తిప్రధానమయిన వచనరూపనాటకము)	౦ -౪- ౬
చమత్కారరత్నావళినాటకము- ...	౦- ౪- ౬
బ్రాహ్మవివాహము- (అతిబాల్యవివాహమువలని నష్టములను దెలుపు నాటకము)	౦- ౩- ౬
వ్యవహారధర్మబోధిని (న్యాయసభలలోని యక్రమములనుబోధించు నాటకము)	౦- ౩- ౬
వేశ్యాప్రియప్రహసనము-	౦- ౩- ౬
కౌతుకవర్ధని- (హాస్యప్రధానమయిన చిన్న నాటకము.)	౦- ౨- ౬
హాస్యసంజీవని, మొదటిభాగము (వివేకవర్ధనిలోనుండి తీసి ప్రకటించిన హాస్యసంభాషణలు.)...	౦- ౫- ౬
హాస్యసంజీవని, రెండవభాగము (వివేకవర్ధనిలోనుండితీసి ప్రకటించిన హాస్యసంభాషణలు.)	౦- ౪- ౬
తిర్యగ్విద్వన్మహాసభ, మూషకాసురవిజయము.(బొమ్మలతోనున్న హాస్యసంభాషణలు.)	౦- ౨- ౬
మహారణ్యపురాధిపత్యము. (బొమ్మలతోనున్న విచిత్రమయినకల్పితకథ)	౦- ౩- ౬
వెనీసువర్తకచరిత్రము. (షేక్స్పియర్ నాటకమునుండి ద్విపదకావ్యముగా రచించిన ప్రథమద్వితీయాంకములు.)	౦- ౪- ౬

ఇంగ్లీషు ప్రహసనముల ననుసరించి వ్రాయఁబడిన వింతలయిన హాస్యనాటకములు.

	రు.	అ.	పై.
౧- అపూర్వబ్రహ్మచర్యప్రహసనము-	౦-	౨-	౬
౨- విచిత్రవివాహప్రహసనము-	౦-	౨-	౬
౩- మహాబధిరప్రహసనము-	౦-	౨-	౬
౪- పునర్మరణప్రహసనము-	౦-	౨-	౬
౫- బలాత్కారగానవినోద ప్రహసనము-... ...	౦-	౨-	౬
౬- కలహప్రియాప్రహసనము-	౦-	౨-	౬
౭- మహామహోపాధ్యాయప్రహసనము-... ...	౦-	౨-	౬
౮- యోగనిద్రా ప్రహసనము-	౦-	౨-	౬
౯- మహావంచకప్రహసనము-	౦-	౨-	౬
౧౦- అసహాయశూర ప్రహసనము-	౦-	౨-	౬
అభాగ్యోపాఖ్యానము. (పద్యరూపముననున్న హాస్యప్రబంధము-)	౦-	౨-	౬
శుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచన నైషధము- (అచ్చతెలుఁగు నలచరిత్ర పద్యకావ్యము-)	౦-	౪-	౬
రసికజనమనోరంజనము- (అపరూపమయిన అచ్చతెలుఁగుశృంగార ప్రబంధము-)	౦-	౬-	౬
కవిరాజమనోరంజనము- (పురూరవశ్చరిత్ర, మంతయిన శృంగారప్రబంధము-)	౦	౯-	౦
మొల్లరామాయణము-	౦-	౧౧-	౦
ప్రభావతీప్రద్యుమ్నము-	౦-	౧౩-	౦
పాంచాలీపరిణయము-	౦-	౬-	౬
పథికవిలాసము-	౦-	౪-	౬
జాణగిల్లిణ తేటగీతములు-	౦-	౧-	౬
నీతిదీపిక- (బాలురకు నిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము-)	౦-	౨-	౬
స్త్రీనీతిదీపిక- (బాలికల నిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము-)	౦-	౨-	౬
చంద్రమతీచరిత్ర-(స్త్రీలకు మిక్కిలి ఉపయుక్తమైన నీతిబోధక పుస్తకము)	౧-	౪-	౬
సత్యవతీచరిత్రము- (స్త్రీలకు ఉపయుక్తమయిన కల్పితకథ-)	౦-	౪-	౬
సత్యసంజీవని- (స్త్రీలకుపయోగించెడి నీతిబోధకమయిన కథ-)	౦-	౪-	౬
సత్యాద్రౌపదీసంవాదము, మాతృప్రేమ & పితృప్రేమ- ...	౦-	౧-	౬
సంగ్రహవ్యాకరణము- (పరీక్షలకుపయోగించు సులభమయిన తెలుఁగు వ్యాకరణము-)	౦-	౫-	౬

ఈ క్రింది పుస్తకములు పదునాలుగును షేక్స్పియరను మహాకవియొక్క నాటకకథల ననుసరించి వ్రాయఁబడిన మనోహరములయిన కథలు.

౧-	చమత్కారరత్నావళి-	౦-౨-౬
౨-	కురంగేశ్వరవర్తకచరిత్రము-	౦-౨-౬
౩-	కళావతీపరిణయము	౦-౨-౬
౪-	గయ్యాళినిసాధుచేయుట-	౦-౨-౦
౫-	రఘుదేవరాజీయము-	౦-౩-౬
౬-	చిత్రకేతుచరిత్రము-	౦-౨-౦
౭-	సుమిత్రచరిత్రము-	౦-౨-౬
౮-	జానకేశవిలాసము-	౦-౨-౦
౯-	సతీమణీవిజయము-	౦-౨-౦
౧౦-	వైశర్భివిలాసము-	౦-౨-౬
౧౧-	భానుమతీకళ్యాణము-	౦-౨-౬
౧౨-	సజ్జనమనోభిరామము.	౦-౨-౬
౧౩.	కుమారద్వయవిలాసము-	౦-౨-౬
౧౪-	ధర్మకవచోపాఖ్యానము	౦-౨-౬
౧౫-	పద్మినీప్రభాకరము-	౦-౨-౬
౧౬-	మాలతీమధుకరము-	౦-౨-౬

శారీరశాస్త్రసంగ్రహము- (వైద్యులకును జనసామాన్యమునకును గూడమిక్కిలి యుపయుక్తమై పటములతోఁ బ్రకటింపఁబడిన శరీరతత్వమును తెలుపు గ్రంథము.) ... ౧-౧-౦

ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము- ౦-౧౧-౦

దేహారోగ్యధర్మబోధిని- (స్త్రీలకును పాఠశాలలకును అత్యంతోపయుక్తమయిన శరీరారోగ్యధర్మములను బోధించుపుస్తకము.) ... ౦-౪-౬

ఉపన్యాసమంజరి- (మతవిషయకములును నీతివిషయకములునయిన యుపన్యాసములుగలది.) ... ౦-౬-౬

అథర్వణకారికలు-(తెలుఁగువ్యాకరణమునుగూర్చిన సంస్కృతశ్లోకములు) ౦-౨-౬

ఆంధ్రతర్కసంగ్రహము- (అన్నంభట్టకృతమయిన తర్కసంగ్రహము తెలుఁగు.) ... ౦-౧-౬

వ్యాసంగ్రహము- ౦-౨-౦

ఈ క్రిందివి బ్రహ్మశ్రీ కందుకూరి-వీరేశలింగముగారిచేత నప్పుడప్పుడు చేయఁబడుచువచ్చిన యుపన్యాసములు.

		రూ.	అ.	పై.
౧.	వేశ్యాకాంతలయుపన్యాసము-	౦-	౨-	౦
౨-	అతిబాల్యవివాహము-	౦-	౨-	౦
౩-	విగ్రహారాధనము-	౦-	౨-	౦
౪-	ఐకమత్యము-	౦-	౧-	౬
౫-	ఈశ్వరదత్తపుస్తకములు-	౦-	౨-	౦
౬.	దానములు	౦-	౧-	౬
౭-	స్త్రీపునర్వివాహచరిత్ర-	౦-	౧-	౬
౮-	స్త్రీపునర్వివాహవిషయకోపన్యాసము- ...	౦	౨-	౬
౯.	స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము. ...	౦-	౨-	౬
౧౦.	స్త్రీపునర్వివాహ విషయక ద్వితీయవిజ్ఞాపనము ...	౦-	౨-	౬
౧౧-	స్త్రీపునర్వివాహశాస్త్రసంగ్రహము- ...	౦-	౩-	౬
౧౨-	స్త్రీపునర్వివాహవ్యాపారముయొక్క భూతవర్తమానస్థితులు-	౦-	౧-	౬
౧౩-	సహాయకష్టకర్తలు- ...	౦-	౧-	౬
౧౪-	దేశీయమహాసభయు దానియుద్దేశములును-	౦-	౪-	౬
౧౫-	జన్మాంతరము.	౦-	౨-	
౧౬-	స్వయంకృషి	౦-	౨-	
౧౭-	ఈశ్వరోపాసనము-	౦-	౨-	
౧౮-	శంకరాచార్యులు.	౦-	౧-	
౧౯-	హిందూమతములు-	౦-	౧-	౬
౨౦-	ప్రార్థన-	౦-	౧-	౬
౨౧-	మానుషధర్మము	౦-	౨-	
౨౨.	విద్యాధికులధర్మములు.	౦-	౨-	౦
౨౩-	వర్ణము-	౦-	౨-	౬


నీతికథామంజరి అను ఈసప్పుకథలు ప్రథమభాగము- ఇంగ్లీషునుండి తెలుఁగుభాషకనుకూలముగా నీతిపద్యములతో వచనరూపమున తెనిఁగింపఁబడి ౭౨పటములతో ప్రకటింపఁబడినది. బాలురకును బాలికలకును జనసామాన్యమునకును మిక్కిలియుపయుక్తముగానుండును.) ౦- ౯- ౦

పదిరూపాయలకంటె తక్కువగాని మొత్తమునకు పుస్తకములు కొన్నపక్షమున నూటికి పదిరూపాయలవంతున పుస్తకములధికముగా నియ్యఁబడును.

ఈపయిపుస్తకములు కావలసినవారు, గోదావరిజిల్లా, రాజమహేంద్రవరము శ్రీవివేకవర్ధనీ ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.

G. B. NAIK & Co
BYCULLA, BOMBAY.

౭౫ వేలకు పైగ అమ్మకము చేయ ఢమయినది.



యోగ్యతా పత్రిక లనే కములు గలవు.

విద్యుచ్ఛక్తి (యెలెక్ట్రిసిటి) తో చేయబడిన ఉంగరములు, చీలబిళ్ళలు మొదలగునవి మన్యపుజ్వరములు, దినజ్వరములు, గుల్మములు, దగ్గు, ఉబ్బసము క్షయ, గుండెనొప్పి, నడుమునొప్పి, వాతనొప్పి, సంధివాతము, పక్షవాయువు, పిత్తజ్వరము, అతిమూత్రము, తలనొప్పి, చలచిత్తము, రక్తభేది, మూర్ఛ వగయిరా రోగములకు అంకుశమువలె గుణమునివ్వగలవని ప్రపంచమునం దెల్లరచే కొనియాడబడుచున్నవి. మరియు నివి మశూచి, విశూచి జాడ్యములకు కూడ పరమౌషధముగానుంటున్నవి.



వాయువనొప్పులు, వెన్ను నొప్పులు, ఊపిరినొప్పులు, స్త్రీలకు తరుచుగా సంభవించెడు గర్భ[illegible] వ్యాధులకును, విద్యుచ్ఛక్తిచే చేయఁబడిన పటకావల్ల నివర్తించును. చంటిపిల్లలకు, పండ్లు రోగములకు, విద్యుచ్ఛక్తితో చేయఁబడినహారము ధరించుటవల్ల నివారణమగును.

లోహపు వుంగరం.	రు ౧-౮-౦	లోహపుచీలబిళ్ళ.	రు ౧-౪-౦
వెండి ,,వుంగరము.		వెండిచీలబిళ్ళ.	,, ౨-౦-౦
బంగారపు ,,వుంగరం.	,,౨౦-౦-౦	బంగారపుచీలబిళ్ళ.	,, ౨౨-౦-౦
లోహపు ,,కమలము.	,, ౧-౮-౦	హారము.	,, ౧-౮-౦
లోహపు ,,మణిబంధము	,, ౧-౮-౦	పటకా.	,, ౪-౦-౦

ప్యాకేజీఖర్చు యివ్వనక్కరలేదు. పోస్టుఖర్చు పేరుగనీయవలెను. ఒక్కొరి రకమునకు ౧౨ తీసికొనినయెడల ౧టి ఇనామియ్యబడును. వస్తువులువ్యాల్యూయేబిల్ పోస్టుద్వారా తెప్పించుకొనవచ్చును. ఉంగరములుకోరువారు వేళ్ళ కొలత నంపవలెను. ప్రతివస్తువుయందును G·B N. గురుతు లేనియెడల. అవినిజమైనవికావు.

ఇతరస్థలములయందు యేజంట్లు కావలసియున్నారు.